ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం
జిల్లా వార్తలు
బుధవారం 4, సెప్టెంబరు 2024

వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద నీటితో అతలాకుతలమైన విజయవాడ వాసులకు బాసటగా జిల్లా ప్రజానీకం నిలుస్తోంది. ఇప్పటికీ లక్షలాది మంది మునకలోనే ఉన్న నేపథ్యంలో వారికి ఆహారం, మంచినీరు అందించేందుకు యంత్రాంగంతోపాటు దాతలు ముందుకొచ్చారు. ప్రభుత్వం తరపున మంత్రి డాక్టర్ స్వామి ప్రత్యక్షంగా విజయవాడలోని పలు ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. అదేసమయంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రత్యేక చొరవ చూపి జిల్లా యంత్రాంగం ద్వారా వివిధ వర్గాల సహకారంతో వేలాది ఫుడ్ ప్యాకెట్లు, మంచినీరు, ఇతర ఆహార పదార్థాలను పంపిస్తున్నారు. మంగళవారం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆధ్వర్యంలో భారీగా ఫుడ్ ప్యాకెట్లు అక్కడికి చేరవేశారు.


ఒంగోలులోని ఓ కల్యాణ మండపంలో జరుగుతున్న ఆహార పదార్థాల ప్యాకింగ్, లోడింగ్


ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో పులిహోరను ప్యాకింగ్ చేస్తున్న తెలుగు మహిళలు

వరద బాధితులకు బాసట

జిల్లా నుంచి భారీగా ఆహారం, మంచినీటి బాటిళ్లు

- విజయవాడలో సహాయ కార్యక్రమాల పర్యవేక్షణలో మంత్రి డాక్టర్ స్వామి
- కలెక్టర్ నేతృత్వంలో రెండు రోజుల్లో 1.25లక్షల పొట్లాలు సరఫరా
- ఎమ్మెల్యే జనార్దన్ ఆధ్వర్యంలో 30వేల భోజనం ప్యాకెట్లు


విజయవాడలో వరద బాధితులతో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ స్వామి

ఒంగోలు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎడతెరపి లేకుండా మూడు నాలుగు రోజులపాటు కురిసిన వర్షం బెజవాడ నగరాన్ని ముంచెత్తింది. అదేసమయంలో ఎగువన కురిసిన భారీవర్షాలతో ఒకవైపు కృష్ణమ్మ, మరోవైపు బుడమేరు ఉగ్రరూపం దాల్చి చాలా ప్రాంతాలను ముంచెత్తాయి. లక్షలాది మంది వరద నీటిలో రోజుల తరబడి చిక్కుకొని తినడానికి తిండిలేక, తాగడానికి నీరు లేక అల్లాడుతున్నారు. స్వయంగా రంగంలోకి దిగిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నా స్థానికంగా ఆహారం దొరికే అవకాశం లేదు. ఈనేపథ్యంలో సమీప జిల్లాల నుంచి భోజనం, మంచినీరు, ఇతరత్రా ఆహార పదార్థాలు పంపించాలన్న ఆదేశాలు ప్రభుత్వం నుంచి అందాయి. దీంతో కలెక్టర్ అన్సారియా తక్షణం స్పందించారు. అందుబాటులో ఉన్న అధికారులతో సమీక్షించి వెంటనే నగరంలోని రెండు కల్యాణ మండపాలను తీసుకొని ఆదివారం రాత్రి నుంచి వంట ప్రారంభింపజేశారు. సోమవారం మధ్యాహ్నం 25వేలు, రాత్రికి మరో 50వేల ప్యాకెట్ల పలావు, పులిహోర, పెరుగన్నం, అలాగే 50వేల మంచినీటి ప్యాకెట్లు, వేలాది బిస్కెట్ ప్యాకెట్లు విజయవాడకు పంపించారు.

మేమున్నాం..
ముందుకొచ్చిన విద్యాశాఖ కార్యాలయ ఉద్యోగులు

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 3: విజయవాడలో వరద ముంపు బాధితులకు మేమున్నామంటూ జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఉద్యోగులు ముందుకొచ్చారు. డీఈవో డి.సుభద్ర ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడకు పది వేల పులిహోర ప్యాకెట్లు, పదివేల వాటర్ బాటిళ్లను ప్రత్యేకంగా స్కూల్ బస్సులను ఏర్పాటు చేసి తరలించారు. డీఈవో కార్యాలయంలో పనిచేసే అధికారులు, ఉద్యోగులందరూ కలిసి ముంపు బాధితులకు తమవంతు సహాయ పడ్డారు. ఇందుకు వివిధ విద్యాసంస్థల యాజమాన్యాలు కూడా సహకారం అందించాయి. తరలించిన ఆహారం ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను విజయవాడలోని స్టేడియంలో అక్కడి అధికారులకు అందజేశారు.


విజయవాడకు తరలించేందుకు సిద్ధం చేసిన వాటర్ బాటిళ్లతో డీఈవో సుభద్ర, కార్యాలయ సిబ్బంది

కలెక్టర్ ప్రత్యేక చొరవతో..

జిల్లా తరఫున జేసీ గోపాలకృష్ణ, డీఎస్‌వో ఉదయభాస్కర్ మరికొంతమంది రెవెన్యూ సిబ్బంది కూడా విజయవాడకు వెళ్లి సహాయక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. జిల్లా నుంచి 35 బోట్లను పంపించారు. సోమవారం సాయంత్రం నుంచి నగరంలోని ప్రధానమైన హోటళ్ల నిర్వాహకులు, అలాగే జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని పరిశ్రమాధిపతులు, ఇతరత్రా వర్గాల వారు అధికారులను సంప్రదించి వారి నుంచి సహకారం పొందడం ద్వారా మంగళవారం మరో లక్షా 20వేల ఫుడ్ ప్యాకెట్లను విజయవాడకు పంపించారు. ఒంగోలుతోపాటు మార్కాపురం, కొండపి, దర్శి తదితర ప్రాంత రెవెన్యూ అధికారులు ఈ పనిలో నిమగ్నమయ్యారు. కలెక్టర్ అన్సారియా మంగళవారం నగరంలో వంట చేస్తున్న కల్యాణ మండపాల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఆహారం రుచి చూసి మరీ లారీలలో పంపించారు.


భోజనాల ప్యాకింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

తరలిన పారిశుధ్య కార్మికులు

వరద నీరు తగ్గాక అత్యవసర పారిశుధ్య పనుల కోసం ఒంగోలు కార్పొరేషన్ నుంచి 150 మంది కార్మికులను మంగళవారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్సులలో విజయవాడకు పంపించారు. మరికొన్ని ప్రాంతాల ప్రజలు వివిధ రూపాలలో తమవంతు సాయాన్ని అందించే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. బుధవారం కూడా మరికొన్ని ఆహార ప్యాకెట్లు పంపించే విధంగా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.


ఆహార పొట్లాలు, వాటర్ బాటిళ్లతో ఒంగోలు నుంచి విజయవాడకు బయల్దేరిన లారీలకు జెండా ఊపుతున్న ఎమ్మెల్యే జనార్దన్

సహాయక చర్యల్లో మంత్రి

జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి డాక్టర్ స్వామి సోమవారం సాయంత్రం విజయవాడలో జరిగిన సమీక్షకు హాజరయ్యారు. ప్రభుత్వ పెద్దల సూచనతో మంగళవారం సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు, కొండపల్లి, విజయవాడ నగరంలోని చిట్టినగర్ ప్రాంతాల్లో పర్యటించి బాధిత ప్రజలను ఓదార్చారు. కొండపల్లి, చిట్టినగర్‌లోని పునరావాస కేంద్రాలను సందర్శించారు. నష్టపోయిన పంటలను పరిశీలించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని బాధితులకు భరోసా ఇచ్చారు.

ఎమ్మెల్యే దామచర్ల ఆధ్వర్యంలో..

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చొరవ చూపి 30వేల ఆహార ప్యాకెట్లు, 20వేల బాటిళ్ల మంచినీరు, భారీగా బిస్కెట్ ప్యాకెట్లు విజయవాడకు పంపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం రాత్రి నుంచే వంట ప్రారంభించి ఆహారాన్ని ప్యాకింగ్ చేశారు. మంగళవారం ఉదయం మూడు లారీలలో వాటిని నింపారు. ఆ లారీలను ఎమ్మెల్యే జెండా ఊపి వరద ప్రాంతానికి పంపారు. అలాగే సహాయక చర్యల్లో పాల్గొనేందుకు పలువురు కార్యకర్తలను విజయవాడకు పంపారు. ఇక ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు నేతృత్వంలోనూ వేలాది ఆహార ప్యాకెట్లను విజయవాడలోని పారిశుధ్య కార్మికులకు అందించేందుకు పంపించారు.


దొడ్డవరంలోని సొసైటీ భవనం

దొడ్డవరం సొసైటీలో కుంభకోణం

అరకోటికిపైగా నిధులు హాంఫట్

- రసీదు పుస్తకం మాయం
- రుణ బకాయిలు, వాటా మూలధనం స్వాహా
- లాభాల నుంచి నష్టాల్లోకి పీఏసీఎస్
- విచారణకు ఆదేశించిన డీసీవో

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 3 : మద్దిపాడు మండలం దొడ్డవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ)లో భారీ కుంభకోణం జరిగింది. సొసైటీ నిధులు అరకోటికిపైగా స్వాహా చేశారు. ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) కూకట్ల శ్రీవాణి నిర్వాకంతో లాభాల్లో నడుస్తున్న సొసైటీ నష్టాల బాట పట్టింది. అడ్డగోలుగా నిధులు దిగమింగి సొసైటీని గుల్ల చేశారు. రైతుల నుంచి వసూలు చేసిన మొత్తాలకు సంబంధించి వంద రసీదులు ఉన్న పుస్తకాన్ని మాయం చేశారు. ఒకే నంబరు రసీదుతో ఇద్దరు ముగ్గురు రైతుల నుంచి డబ్బులు వసూలు చేసి కైంకర్యం చేశారు. రైతుల నుంచి వసూలు చేసిన రుణ బకాయిలు, షేర్ ధనాన్ని కూడా స్వాహా చేశారు. సొసైటీలో జరిగిన నిధుల దుర్వినియోగం, అక్రమాలు పీడీసీసీ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్/సూపర్‌వైజర్లు వి.చంద్రశేఖర్, డి.రామారావుల త్రైమాసిక తనిఖీ నివేదికలతో వెలుగులోకి వచ్చాయి. ఈ నివేదికలను పరిశీలించిన బ్యాంకు సీఈవో కోటిరెడ్డి విచారణ చేయించాలని డీసీవోను సిఫార్సు చేశారు. దీంతో డీసీవో సమగ్ర విచారణకు ఆదేశించారు. విచారణాధికారిగా ఒంగోలు సబ్ డివిజనల్ సహకారాధికారి మాలకొండయ్యను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రైతుల నుంచి వసూలు చేసిన సొమ్ము స్వాహా

సొసైటీ ద్వారా రైతులకు బట్వాడా చేసిన స్వల్పకాలిక వ్యవసాయ రుణాలు, కిసాన్ వికాస రుణ పథకం, సొసైటీ సొంత నిధులతో ఇచ్చిన రుణాల్లో అక్రమాలు జరిగాయి. ఈ రుణాలకు సంబంధించి రైతుల నుంచి వసూలు చేసి సీఈవో గోల్‌మాల్ చేశారు. ఆ మొత్తం కనీసం అరకోటికిపైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. సొసైటీలో వంద రసీదులు ఉన్న పుస్తకం గల్లంతైంది. దీంతో ఆ రసీదులతో ఎవరి నుంచి ఎంత మొత్తం వసూలు చేసింది తెలియకుండా పోయింది. రసీదు నెంబరు 106201 నుంచి 106300 వరకు ఉన్న పుస్తకం కనిపించడం లేదు. ఈ పుస్తకంలో నుంచి 106208 నెంబరు రసీదుతో పి.రాధ నుంచి రూ.11,060 వసూలు చేసి ఆ మొత్తాన్ని నగదు పుస్తకంలో నమోదు చేయకుండా దిగమింగారు.

- సొసైటీకి రక్షణకర్తగా ఉండాల్సిన సీఈవో అడ్డగోలుగా నిధులను డబుల్ రసీదులతో స్వాహా చేశారు.
- కేవీఆర్‌పీ రుణాలకు సంబంధించి 2023 అక్టోబరు 11న 292400 నంబరు రసీదుతో పి.సాంబశివరావు నుంచి రూ.లక్ష వసూలు చేశారు. అదే నంబరు రసీదుతో 2023 సెప్టెంబరు 29న రూ.లక్ష వసూలు చేసి మొత్తం రూ.2లక్షలను దిగమింగారు.
- కేవీఆర్‌పీ రుణాలకు సంబంధించి 2023 మార్చి 23న 244984 నంబరు రసీదుతో పి.సాంబశివరావు నుంచి రూ.23,625, అదే రసీదుతో జి.వి.సుబ్బమ్మ నుంచి 2023 అక్టోబరు 11న రూ.4,830 వసూలు చేసి ఆ మొత్తాన్ని కైంకర్యం చేశారు.
- పి.సాంబశివరావు నుంచి 281731 రసీదు నెంబరుతో రూ.75,500, అదే నెంబరు రసీదుతో మర్రిపూడి హరిబాబు నుంచి కూడా డబ్బులు వసూలు చేసి స్వాహా చేశారు. ఈ విధంగా రెండు రసీదులు పెట్టి రైతుల నుంచి వసూలు చేసిన మొత్తాలను మింగేశారు.

తనిఖీలు లేనందునే అక్రమాలు

బ్యాంకు అధికారులు సొసైటీలను నిబంధనల ప్రకారం సందర్శిస్తూ తనిఖీ నివేదికలు సమర్పించనందునే నిధుల స్వాహాపర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది. బ్యాంకు సూపర్‌వైజర్లు ప్రతి మూడు నెలలకు, మేనేజర్ కనీసం సంవత్సరానికి ఒకసారి, జోనల్ మేనేజర్లు ప్రతి ఆరు నెలలకు సొసైటీలను సందర్శించాలి. లావాదేవీలను పరిశీలించి తప్పులు ఉంటే ప్రత్యేక నివేదిక ద్వారా బ్యాంకు సీఈవోకు సమర్పించాలి. అయితే అటువంటి పరిస్థితి లేకపోవడంతో సొసైటీల్లో నిధుల దుర్వినియోగం ఎక్కువైంది.

కంభం చెరువు తూముకు లీకులు

- వృథాగా పోతున్న నీరు
- పట్టించుకోని అధికారులు
- ఇటీవల రూ.7లక్షలతో మరమ్మతులు
- అయినా కనిపించని ఫలితం
- ఆయకట్టు రైతుల్లో ఆందోళన

లోపలి పేజీల్లో..


కంభం చెరువు తూము నుంచి లీకవుతున్న నీరు

- గ్రేడ్లకు విరుద్ధంగా పంచాయతీ కార్యదర్శుల నియామకం కోసం సిఫార్సు లేఖలు
- గత ప్రభుత్వ తప్పిదాలను కొనసాగిస్తున్న కొందరు కార్యదర్శులు
- ఏ గ్రేడ్ కార్యదర్శులను ఆ గ్రేడ్ పంచాయతీల్లోనే నియమించాలని కూటమి ప్రభుత్వ ఆదేశం
- స్థానికంగా పరిస్థితి మరోవిధంగా ఉండటంతో అధికారుల్లో ఆందోళన

నిబంధనల ప్రకారం బదిలీలు జరిగేనా?

లోపలి పేజీల్లో..

62 మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

- 5న గురుపూజోత్సవ సభలో ప్రదానం

ఒంగోలు (విద్య), సెప్టెంబరు 3 : జిల్లాలో 62 మంది ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ జాబితాకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆమోదముద్ర వేశారు. ఈనెల 5న ప్రకాశం భవన్‌లోని మీకోసం హాలులో జరిగే గురుపూజోత్సవ కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ప్రదానం చేయనున్నారు. అవార్డులకు ఎంపికైన వారిలో పదిమంది హైస్కూలు హెచ్‌ఎంలు, 20మంది స్కూల్ అసిస్టెంట్లు, నలుగురు హైస్కూలు ప్లస్‌లో పనిచేస్తున్న పీజీటీలు, 25మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు (తెలుగు), ముగ్గురు సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఉర్దూ) ఉన్నారు.

హెచ్‌ఎంల విభాగంలో... టి.ఎల్.కాంతారావు (బండ్లమూడి), డి.గురుస్వామి (అల్లీనగరం), ఎం.సుధాకర్ (తర్లుపాడు), డి.జయవరప్రసాద్ (పిడికిటివారిపల్లి), జి.గురుప్రసాద్ (చందలూరు), టి.భిక్షాలు (గార్లపేట), వై.శ్రీనివాసరావు (మొహిద్దీన్‌పురం), కె.శ్రీనివాస్ (మూలగుంటపాడు), షేక్ అహ్మద్ (వైడిపాడు), ఎస్.గోపాలనాయక్ (కాకర్ల) ఎంపికయ్యారు.


డీఈవో కార్యాలయం

స్కూలు అసిస్టెంట్ విభాగంలో... కె.నరసింహారావు (దొనకొండ), కె.ప్రదీప్‌కుమార్ (గజ్జలకొండ), షేక్ ఖాజామొహిద్దీన్ (దిరిశవంచ), కె.సత్యనారాయణ (వైపాలెం), హెచ్.రాధాకృష్ణమూర్తి (ఆకవీడు), వి.మాలకొండయ్య (దొనకొండ, అర్ధవీడు), ఎన్.వెంకటరమణయ్య (శీలంవారిపల్లి), ఆర్.కొండానాయక్ (ముటుకుల), పి.రామాంజనేయులు (ఈతముక్కల), బి.ఆంజనేయులు (మాచవరం), టి.రామారావు (చిన్నారికట్ల), పి.సి.వెంకటేశ్వర్లు (ఓబులక్కపల్లి), జి.ఈశ్వరమ్మ(పీసీపల్లి), కె.సుజాత (అల్లీనగరం), పి.రాచయ్య (ముక్తినూతలపాడు), టి.రతన్‌బాబు (చిన్నారికట్ల), టి.పద్మాగాయత్రి (నాగంపల్లి), పి.రాహేలమ్మ (మీర్జాపేట), పీఎంకే ఆత్రేయ (చిలకపాడు), ఎం.రవీంద్రప్రసాద్ (మైనంపాడు) ఎంపికయ్యారు.

పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ) విభాగంలో.. వి.శ్రీనివాసరావు (హెచ్.నిడమానూరు), పి.మెర్సిన్‌బాబు (కరవది), సిహెచ్.మార్కండేయులు (కొణిజేడు), ఎం.నాగకుమారశర్మ (మైనంపాడు) ఎంపికయ్యారు.

ఎస్జీటీ (తెలుగు) విభాగంలో.. కె.వెంకటేశ్వరరావు (మార్కాపురం), కె.శ్రీనివాసులు (దోర్నాల), బి.శైలజ (చౌటపల్లి), కె.వి.శివనాగమణి (కురిచేడు), సిహెచ్.సునీతాదేవి (కోవిలంపాడు), కె. సుజాత (సిద్ధవరం), బి.శ్రీదేవి (మంగమూరు), ఎం.భాస్కర్ (అయ్యంబొట్లపల్లి), డి.అరుణ (అనుమలపల్లి), కె.మాల్యాద్రి (చెన్నుపాడు), ఆర్.తిరుపతయ్య (గన్నవరం), వి.శ్రీనివాసులురెడ్డి (ఊళ్లపాలెం), ఈ.సరోజనమ్మ (దర్శిగుంట్ల), ఆర్.వి.శేషుకుమారి (గురువారెడ్డిపాలెం), కె.శైలజ (దాసరివారిపాలెం), సీహెచ్.భాస్కర్ (తురిమెళ్ల), జి.రత్తమ్మ(డీపీజీపేట), ఎ.పిచ్చమ్మ (మిట్టపాలెం), దస్తగిరి (పాలూరివారిపల్లి), ఎం.నరసారెడ్డి (పునుగోడు), పి.సముద్రకుమారి (అయ్యపురాజుపాలెం), జి.సువార్త(రాచవారిపాలెం), కె.శివపార్వతి (ఒంగోలు), జి.రమాతులసి (పి.తక్కెళ్లపాడు), ఎం.రజిని (నందనవనం) ఎంపికయ్యారు.

సెకండరీ గ్రేడ్(ఉర్దూ) విభాగంలో : షేక్‌మల్లిక (ఫిర్దేస్‌నగర్), సయ్యద్ యాస్మిన్‌బాను (రావిపాడు), పఠాన్ జైనాబి(కనిగిరి) ఎంపికయ్యారు.

వరద బాధితులకు అండగా నిలుద్దాం

ఎమ్మెల్యే దామచర్ల
30వేల ఆహార పొట్లాలు తరలింపు
బయలుదేరిన టీడీపీ శ్రేణులు, అధికారులు
సహాయక చర్యల్లో పాల్గొనేందుకు
వెళ్లిన కార్పొరేషన్ సిబ్బంది


విజయవాడలో బాధితులకు ఆహారం అందజేస్తున్న ఎమ్మెల్యే జనార్దన్, టీడీపీ శ్రేణులు


విజయవాడకు వెళుతున్న పారిశుధ్య సిబ్బందితో మేయర్, కమిషనర్

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 3 : గత మూడు రోజులుగా కురిసిన భారీవర్షాలకు అతలాకుతలమైన విజయవాడ వరద బాధితులను ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని, ఆపదలో అండగా నిలవాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పిలుపునిచ్చారు. మంగళవారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో దామచర్ల సహకారంతో ఒంగోలు నియోజకవర్గం తరుపున విజయవాడ బాధితులకు 30వేల పులిహోర, పెరుగు అన్నం బాక్సులను సిద్ధం చేయించారు. ఈ సందర్భంగా ఆహారాన్ని తరలించే ప్రత్యేక వాహనాలను ఎమ్మెల్యే దామచర్ల నగరంలో జెండా ఊపి ప్రారంభించారు. అంతేగాకుండా ఆయన కూడా పార్టీ శ్రేణులతో కలిసి విజయవాడ బయలుదేరి వెళ్లారు. ముందుగా మీడియాతో మాట్లాడుతూ విపత్తుల సమసయంలో ప్రతి ఒక్కరూ బాధితులకు అండగా నిలవాలని కోరారు. ఇప్పటికే కలెక్టర్ తమీమ్ అన్సారీయా ఆదేశాలతో విజయవాడలోని బాధితులకు సోమవారం ఆహారం పంపిణీ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే తామంతా కూడా బాధితులకు అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రజలు కూడా ఈ సహాయంలో భాగస్వాములు కావాలని కోరారు. వ్యాపారులు, బిల్డర్లు, పారిశ్రామికవేత్తలు, ఇలా అన్ని వర్గాల వారు స్వచ్ఛందంగా కదలి రావాలని కోరారు. విజయవాడలో ప్రజలు తుఫాను దాటికి తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, వారు పూర్తిగా కోలుకునే వరకు చేయూత నివ్వాలని తెలిపారు. అదేవిధంగా విజయవాడలో సహాయక చర్యలు, ఆహారం పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఒంగోలు నియోజకవర్గ పార్టీ శ్రేణులు ఉత్సాహంతో ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ అభినందిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాత్రింబగళ్లు అక్కడే ఉంటూ, బాధితులకు ధైర్యం చెబుతూ అవసరమైన సహాయక చర్యలు ఎప్పటికపుడు పర్యవేక్షిస్తూ అండగా ఉంటున్నారన్నారు. తమ నాయకుడు చంద్రబాబు పిలుపుతో రాష్ట్రవ్యాప్తంగా తెలుగుతమ్ముళ్లు కదిలి వస్తున్నారని చెప్పారు. విజయవాడలో త్వరలోనే సాధారణ పరిస్థితి రావాలని ఆ భగవంతుని కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు.

కార్పొరేషన్ సిబ్బంది విజయవాడకు..

ఇదిలా ఉండగా విజయవాడలోని వరద బాధితుల సహాయక చర్యల్లో పాల్గొనేందుకు కమిషనరు కె.వెంకటేశ్వరరావు, కొందరు సిబ్బందిని నియమించారు. ఈ మేరకు సుమారు 105 మంది పారిశుధ్య కార్మికులను అలాగే శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు, మేస్త్రీలను విజయవాడకు పంపించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సుల్లో సిబ్బంది పాల్గొనేందుకు బయలుదేరగా, కమిషనరు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, పలువురు కార్పొరేటర్లు, ఎంపీ జానీబాషా, అధికారులు పాల్గొన్నారు.

శ్రీప్రతిభ ఆధ్వర్యంలో ఆహార పొట్లాల తరలింపు

ఒంగోలు(విద్య): విజయవాడలోని వరద బాధితులకు సాయం అందించేందుకు ఒంగోలులోని శ్రీప్రతిభ, శ్రీగురుదత్తా విద్యాసంస్థల యాజమాన్యం ముందుకు వచ్చింది. స్థానిక కళాశాల హాస్టల్‌లో 2వేల పులిహోర ప్యాకెట్లు తయారీ చేసి వాటిని స్థానిక డీఈవో కార్యాలయానికి అందజేసినట్లు విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆహారాన్ని తమ విద్యాసంస్థల బస్సుల్లో విజయవాడకు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల వైస్ చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈవో జయప్రకాష్‌నారాయణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఆహర ప్యాకింగ్‌ను పరిశీలిస్తున్న చైర్మన్ వెంకటేశ్వర్లు

శ్రీహర్షిణి విద్యాసంస్థల అధినేత చేయూత

విజయవాడ, రాజధాని పరిసర ప్రాంతాల్లో భారీ వర్షాలకు నీట మునిగి ఎంతో మంది ఆహారం లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఒంగోలులోని శ్రీహర్షిణి విద్యాసంస్థల అధినేత గోరంట్ల రవికుమార్ చేయూత అందించారు. బాధితులకు 2వేల ఆహర ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్ తన సొంత నిధులతో ఏర్పాటు చేసి మంగళవారం విజయవాడకు పంపించారు. కార్యక్రమంలో విజేత పబ్లిక్ స్కూలు కరస్పాండెంట్ రమణ, కళాశాల జీఎం శివరాం, డీన్ దాది అంజనేయులు, దుర్గా అంజనేయులు, బాలకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఆహర ప్యాకెట్లను పరిశీలిస్తున్న రవికుమార్

36వేల భోజనం ప్యాకెట్లు సరఫరా

సంతనూతలపాడు: సంతనూతలపాడు తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి, రెవెన్యూ బృందం మంగళవారం 36 వేల భోజనం ప్యాకెట్లను ఒంగోలులోని అధికారులకు అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వాటిని విజయవాడకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

శ్రీసరస్వతి విద్యాసంస్థల విరాళం

● మంత్రి లోకేష్‌కు రూ.7లక్షల చెక్కు అందజేత


మంత్రి లోకేష్‌కు చెక్కును అందజేస్తున్న రమణారెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 3: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు మేము సైతం అంటూ వివిధ స్వచ్ఛంద సంస్థలు ముందుకు ఆర్థిక సాయాన్ని అందిస్తున్నాయి. వరద బాధితులకు సాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందించిన పిలుపుతో ఒంగోలులోని శ్రీసరస్వతి విద్యాసంస్థల చైర్మన్ ఏవీ.రమణారెడ్డి స్పందించారు. ఈ సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో కలిసి విజయవాడలో విద్యాశాఖమంత్రి నారా లోకేష్‌ను కలిసి రూ.7లక్షల విరాళం చెక్కును అందజేశారు. వరద బాధితులకు సాయం అందించేందుకు ముందుకు వచ్చిన రమణారెడ్డిని మంత్రి లోకేష్, ఎమ్మెల్యే జనార్దన్ అభినందించారు. కార్యక్రమంలో శ్రీసరస్వతి విద్యాసంస్థల డైరెక్టర్లు గణేష్, శంకర్, సీఈవో ఎన్‌వీ.సురేష్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పూరిల్లు దగ్ధం


బాధితుడిని పరామర్శిస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు సెప్టెంబరు 3 : విద్యుదాఘాతంతో పూరిల్లు దగ్ధమైన సంఘటన అమ్మనబ్రోలు దళితకాలనీలో జరిగింది. స్థానికుడైన కాటూరి యోహాను నివసిస్తున్న పూరిల్లుకు మంగళవారం వేకువజామున విద్యుతాఘాతంలో మంటలు చెలరేగాయి. నిద్రలో ఉన్న యోహాను, అతని కుటుంబసభ్యులు మంటల ధాటికి ఒక్కసారిగి బయటకు పరుగులు తీశారు. అయితే మంటలు వ్యాపించి పూరిల్లు పూర్తిగా కాలిపోగా రూ.50వేల నగదు, ఇంట్లోని వస్తువులన్నీ బూడిదయ్యాయి. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. వీఆర్వో అలేఖ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. టీడీపీ మండల అధ్యక్షుడు మనోజ్‌కుమార్, కోశాధికారి సుబ్బయ్యనాయుడు బాధితుడిని పరామర్శించి ఆర్థికసాయం అందించారు. ప్రభుత్వపరంగా ఆదుకుంటామని చెప్పారు.

నూరుశాతం పన్నులు వసూలు చేయాలి

● కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 3: ఆస్తిపన్ను వసూలు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో నూరుశాతం వసూలు చేయాలని కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఆదేశించారు. మంగళవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన రెవెన్యూ సిబ్బంది, అడ్మిన్ సెక్రటరీలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ నాటికి ప్రతి ఒక్కరూ పన్నుల వసూలు కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించారు. దీర్ఘకాలికంగా పెండింగ్ ఉన్న బకాయిలు వసూలుతోపాటు, ఇంకా పన్ను విధించని గృహాలను గుర్తించి పన్నులు వసూలు చేయాలన్నారు. అలాగే కార్పొరేషన్ కాంప్లెక్స్‌ల్లో అద్దె వసూలు బాధ్యతలు అడ్మిన్ సెక్రటరీలు చూడాలని చెప్పారు. ప్రజలు కూడా పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కోరారు.

నువ్వు పంట పరిశీలన


పంటను పరిశీలిస్తున్న ఏవో పావని

సంతనూతలపాడు, ఆగస్టు 3: బొడ్డువారిపాలెంలో సాగు చేసిన నువ్వు పంటను మంగళవారం ఏవో పి.పావని పరిశీలించారు. అనంతరం పి.తక్కెళ్లపాడు, బొడ్డువారిపాలెం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించారు. మండలంలో 1,399 ఎకరాలు సాగులో ఉండగా 1,112 ఎకరాలు ఈ-పంటలో నమోదైనట్లు ఏవో తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విచారణకు సిద్ధం

కలిసే అవకాశమిస్తే చాలా నిజాలు చెబుతా..
సీఎం చంద్రబాబుకు మాజీ మంత్రి బాలినేని లేఖ

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

'ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్ తనపై మీకు చేసిన ఫిర్యాదులపై విచారణకు నేను సిద్ధంగా ఉన్నా, అలాగే మీరు కలిసే అవకాశమిస్తే చాలా నిజాలు మీ దృష్టికి తీసుకొస్తా'నని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఆ మేరకు ఆయన సీఎంకు లేఖ రాశారు. లేఖ ప్రతులను మంగళవారం మీడియాకు విడుదల చేశారు. తాను అధికారంలో ఉండగా, చట్టవిరుద్ధమైన పనులు చేయలేదు.. పైగా తన సొంతానికి ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదు.. ఎమ్మెల్యే జనార్దన్, రియాజ్ చేసిన ఆరోపణలన్నీ అభూతకల్పనలే. వారు మీ దృష్టికి తీసుకొచ్చిన అంశాలపై తాను ఎలాంటి విచారణకైనా సిద్ధమేనని ఆ లేఖలో పేర్కొన్నారు. అదేసమయంలో కొన్ని ముఖ్యమైన అంశాలను మీ దృష్టికి తీసుకురావాల్సి ఉందని, మీరు అనుమతిస్తే ఒంగోలు ప్రాంతంలో జరుగుతున్న అనేక చట్టవిరుద్ధ అంశాలను మీ దృష్టికి తీసుకొస్తానని బాలినేని వివరించారు.

మేమింతే..!

కొత్త కూరగాయల మార్కెట్‌లో
నిత్యం ట్రాఫిక్ స్తంభన
రోడ్లను ఆక్రమించిన వ్యాపారులు
వాహనదారుల అవస్థలు
పట్టించుకోని అధికారులు, ట్రాఫిక్ పోలీసులు


ఆక్రమణలతో కుచించుకుపోయిన రోడ్డు


రోడ్డును మూసేసిన లగేజీ వాహనాలు


దుకాణాలతో రోడ్డును పూర్తిగా ఆక్రమించేసిన వ్యాపారులు

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 3: ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా రోడ్లపైనే వ్యాపారం చేయడం నగరంలోని కొత్తకూరగాయాల మార్కెట్‌లో పరిపాటిగా మారింది. ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నా రోడ్లపైనే ఫ్రూట్‌స్టాల్స్ ఏర్పాటు చేసి అమ్మకాలు చేయడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయినా ట్రాఫిక్ పోలీసులు, కార్పొరేషన్ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. కొత్త కూరగాయల మార్కెట్‌లోని వ్యాపారులు తమ దుకాణాలను వదిలి ఏకంగా రోడ్ల మీద వ్యాపారాలు చేస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి మార్కెట్‌లోకి వెళ్ళి అద్దంకి బస్టాండుకు వెళ్లేందుకు మార్కెట్‌లో డివైడర్ వేసి రోడ్డు నిర్మించారు. అయితే ఉత్తరం వైపు ఉన్న రోడ్డు అంతా ఆక్రమించి వాహనాల రాకపోకలు లేకుండా చేస్తున్నారు. దీంతో నిత్య రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఒక రోడ్డులోనే వాహనాలు, పాదచారులు ప్రయాణించాల్సి వస్తోంది. దీనివల్ల ఈ మార్గంలో నిత్యం ట్రాఫిక్ స్తంభించి పోతోంది. డివైండర్లు వేసి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసిన రోడ్డు మొత్తం వ్యాపారుల చెరలోనే ఉంటుంది. ఇలా రోడ్లపైనే స్టాల్స్ ఏర్పాటు చేసి ఆక్రమణలకు పాల్పడుతున్నా సంబంధిత అధికారులు అసలు కన్నెత్తి చూడటం లేదు. రోడ్ల వెంట బండ్లపై వ్యాపారం చేసుకునే వారిపై మాత్రం ప్రతాపం చూపిస్తున్నారు. రోడ్డును ఆక్రమించి వ్యాపారం చేస్తున్నా వారికి కనిపించడం లేదు. మీడియాలో కథనాలు వస్తే హడావుడి చేసి తరువాత గాలికి వదిలేస్తున్నారు. ఇప్పటికైనా కొత్త కూరగాయల మార్కెట్‌లో రోడ్లపైన వ్యాపారం తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

కార్పొరేషన్ అధికారులతో కలిసి ఆక్రమణలు తొలగిస్తాం : ట్రాఫిక్ సీఐ

కొత్తకూరగాయల మార్కెట్‌లో రోడ్లపై ఉన్న ఆక్రమణలను కార్పొరేషన్ అధికారులతో కలిసి తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ పాండురంగారావు తెలిపారు. రోడ్లపైన వ్యాపారం చేస్తున్న వారికి నోటీసులు జారీ చేస్తున్నామని చెప్పారు. అదేవిధంగా వాహనాల రాకపోకలకు అడ్డు తగిలేలా రోడ్లు ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఘనంగా వాసవీక్లబ్ వారోత్సవాలు


నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న క్లబ్ కార్యవర్గం

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 3: వాసవి క్లబ్ వ్యవస్థాపకులు కె.చంద్రసేన గుప్త 105వ జయంతి సందర్భంగా జరుగుతున్న వారోత్సవాలలో భాగంగా మంగళవారం వృద్ధాశ్రమ సేవ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ ఒంగోలు, వాసవీ కేసీజీఎఫ్ యూత్ సంయుక్తంగా స్థానిక సీతారాంపురంలోని సమతా వేదిక మహిళా వృద్ధాశ్రమంలో నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. అనంతరం క్లబ్ అధ్యక్షులు నల్లమల్లి బదరీ నారాయణ మాట్లాడుతూ వారోత్సవాలలో భాగంగా పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు, గురుపూజోత్సవం వంటివి నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైస్‌ప్రెసిడెంట్ (మల్టీపుల్) జి.బ్రహ్మానందం, దర్శి మనోహర్, చంద్రశేఖర్, నూకల శ్రీనివాసరావు, పబ్బిశెట్టి గోవర్ధన్, అమరా సత్యనారాయణ, కె.పవన్‌కుమార్, పి.నందకుమార్, గుర్రం సునీల్‌కుమార్, భూమా శ్రీనివాసరావు, కార్యవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు.

సింగిల్ విండో ద్వారా మండపాలకు అనుమతులు : ఎస్ఐ

మద్దిపాడు, సెప్టెంబరు 3: వినాయక చవితి సందర్భంగా మండపాలను ఏర్పాటు చేసే వారికి సింగిల్ విండో సిస్టం ద్వారా అనుమతులు మంజూరు చేస్తున్నట్లు ఎస్సై శివరామయ్య తెలిపారు. మంగళవారం మద్దిపాడు పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వినాయక మండపం ఏర్పాటు చేసేవారు అగ్నిమాపక, పురపాలక, విద్యుత్, పోలీస్‌శాఖల నుంచి ఎన్‌వోసీ తీసుకోవాలని, ఇందుకోసం ఆయా శాఖల కార్యాలయాలకు వెళ్లకుండా సింగిల్ విండో సిస్టం విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఇందుకోసం 7995095800 నెంబరుకు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ పంపితే సింగిల్ విండో విధివిధానాలు నిర్వాహకులకు వస్తాయని, ఆ ప్రకారం వారు అనుమతులు పొందవచ్చని పేర్కొన్నారు.

6న కలెక్టరేట్ ఎదుట ధర్నా : సీపీఐ

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 3: నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6వతేదీన కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ నగర కార్యదర్శి పీవీఆర్.చౌదరి కోరారు. దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా మంగళవారం ఒంగోలులో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, శ్రీరామ శ్రీనివాసరావు, బి.హరికృష్ణ, పీవీ.కృష్ణారావు, ఎస్‌డీ.సర్దార్ పాల్గొన్నారు.

రేషన్‌డీలర్‌పై 6ఏ కేసు

నాగులుప్పలపాడు సెప్టెంబరు 3: బినిడమానూరు గ్రామంలోని 48 రేషన్ షాపుపై అధికారులు 6ఏ కేసు నమోదు చేశారు. మంగళవారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వంశీ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ సదరు రేషన్‌షాపులో తనిఖీలు నిర్వహించగా 32 బస్తాల బియ్యం నిల్వలలో తేడా గుర్తించారు. దీంతో డీలర్ ఊదరగుడి చిరంజీవిపై కేసు నమోదు చేసినట్లు ఆర్ఐ తెలిపారు.

ఆశావర్కర్ల సేవలు వెలకట్టలేనివి

నాగులుప్పలపాడు సెప్టెంబరు 3: ఆశాకార్యకర్తల అందిస్తున్న సేవలు వెలకట్ట లేనివని డాక్టర్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, హెల్ప్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అమ్మనబ్రోలు వైద్యశాల వద్ద ఆశా కార్యకర్తల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ నిత్యం ఇంటింటికి తిరుగుతూ ప్రజలను వ్యాధులపై అప్రమత్తం చేస్తూ ప్రభుత్వ వైద్య సేవలు ఇంటింటికి అందేలా చేస్తున్న ఆశాల కృషి అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్ప్ టీఐ మల్లేశ్వరి, ఎంపీహెచ్‌వో ఎం.శ్రీనివాసరావు, డీవీవీ సురేష్, ఎంపీహెచ్ఏ డి.రూన్సీరాణి, ఎంపీహెచ్ఎస్ శ్రీనివాసరావు, సిబ్బంది వెంకటేశ్వరమ్మ, దివ్య, నాగలక్ష్మి ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

అనాథలకు అన్నదానం అభినందనీయం


కేక్ కట్ చేసి అందజేస్తున్న డాక్టర్ రవీంద్ర

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 3: అనాథలకు అన్నదానం చేయటం అభినందనీయమని సినీ నటుడు, టీసీ సమైక్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు దన్నారపు మస్తాన్‌రావు పేర్కొన్నారు. ఒంగోలులోని లక్ష్మీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ అబ్బూరి రవీంద్రబాబు జన్మదినం సందర్భంగా స్థానిక సంతపేటలోని శివం శ్రీ కాశీనాయన అనాథ వృద్ధాశ్రమంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పశుసంవర్థకశాఖ మాజీ డిప్యూటీ డైరక్టర్ ఒంగోలు మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ శక్తికొద్దీ సమాజంలోని తోటి వారి కోసం సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ అబ్బూరి రవీంద్రబాబు, నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, హాస్పటల్ మేనేజర్ మాదాల రాజా, మోటుపల్లి వెంకటేశ్వర్లు, మల్లవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

ఉచిత ఇసుక తరలింపునకు వాహనాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 3: ఉచిత ఇసుక తరలించేందుకు వాహన యజమానులు తమ వాహనాల నంబర్లను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మైనింగ్‌శాఖ జిల్లా అధికారి జగన్నాథరావు, రవాణాశాఖ డిప్యూటి కమిషనర్ ఆర్.సుశీల కోరారు. మంగళవారం ఒంగోలులోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో లారీ, ట్రాక్టర్ల యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈనెల 11 నుంచి ఉచిత ఇసుక నూతన పాలసీ అమలులోకి రానుందని, ఈ మేరకు వాహనదారులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుంటే వారి ఫోన్లకు అలర్ట్ మెసెజ్‌లు వెళతాయన్నారు. మంగళవారం నుంచే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని వివరించారు.

పేద విద్యార్థినికి రోటరీ క్లబ్ చేయూత


ల్యాప్‌టాప్‌ను అందిస్తున్న గొల్లపూడి వెంకట్రావు, రఘుకిరణ్

చీమకుర్తి, సెప్టెంబరు 3: ఇంజనీరింగ్ చదువుచున్న పేద విద్యార్థినికి రోటరీ క్లబ్ ఆఫ్ చీమకుర్తి చేయూతనందించింది. క్లబ్ మాజీ అధ్యక్షుడు గొల్లపూడి వెంకట్రావు విద్యార్థిని ఉన్నత విద్యాభ్యాసానికి అవసరమయ్యే ల్యాప్‌టాప్‌ని బహూకరించారు. మంగళవారం చీమకుర్తిలో జరిగిన కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు చెరుకూరి రఘుకిరణ్, అధ్యక్షుడు కడవా రామకృష్ణ, గొల్లపూడి వెంకట్రావు చేతుల మీదుగా విద్యార్థిని తండ్రికి ల్యాప్‌టాప్‌ని అందజేశారు. కార్యక్రమంలో సెక్రటరీ కందుకూరి వెంకటసుధాకర్, మన్నం నాగరాజు, అంబటి వీరారెడ్డి, నాగెళ్ల సత్యం, ఆదినారాయణరెడ్డి, పోకూరి రామకృష్ణారెడ్డి, నారా హరిబాబు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 3 : వరద బాధితులను ఆదుకునేందుకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం ఒంగోలు నగరంలో విద్యార్థుల వద్ద నుంచి విరాళాలు సేకరించినట్లు జిల్లా కార్యదర్శి సీహెచ్.వినోద్ తెలిపారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ విరాళాలను సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ


మొక్కలను పంపిణీ చేస్తున్న మాధవరావు

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 3: మొక్కలను విరివిగా పెంచటం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని, కనుక అందువల్ల తమకు వీలైనన్ని మొక్కలను నాటాలని శ్రీ అభయ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మద్దాలి మాధవరావు పేర్కొన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో చీమకుర్తిలోని ఎస్‌కేఆర్ బధిరుల ఆశ్రమ పాఠశాలలో వన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు తమ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ అంజిరెడ్డి పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 3: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, గ్రో స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఒంగోలులోని వెంకటేశ్వరకాలనీలో మీకు తెలుసా? అనే పేరుతో హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ హేమలత, సూపర్‌వైజర్ లీలమ్మ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లకు, యూపీహెచ్ సిబ్బందితో మాట్లాడుతూ హెచ్ఐవీ సోకుండా తీసుకోవాలిసన జాగ్రత్తలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మేనేజర్ షేక్ పీరుబాషా, భవాని, వి.అరుణ, కె.మంగ పాల్గొన్నారు.

పేస్‌లో అవగాహన సదస్సు


శ్రావణకుమార్‌ను అభినందిస్తున్న శ్రీధర్

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 3: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ట్రిపుల్ ఈ విద్యార్థులకు మంగళవారం మేగ్నటిక్ ఫీల్డ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థి, బెంగళూరు నమస్తే క్రిడిట్‌లో పనిచేస్తున్న ఐ.శ్రావణకుమార్(సాఫ్ట్‌వేర్‌ఇంజనీర్) పాల్గొని మాట్లాడారు. పరిశ్రమల్లో మేగ్నటిక్ ఫీల్డ్ అవసరాలు, ఉపయోగాలు, విశిష్టతలపై అవగాహన కల్పించారు. కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఉద్యోగావకాశాలు అపారంగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, విభాగాధిపతి బి.నాగరాజు, కో ఆర్డినేటర్ బి.విజయచంద్ర, కో కన్వీనర్ బి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సిగరెట్ స్మగ్లింగ్‌ను అరికట్టాలి

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 3 : పొగాకు రైతుల జీవనోపాధిని రక్షించేందుకు, మన పరిశ్రమల భవిష్యత్తును సురక్షితంగా ఉంచేందుకు సిగరెట్ స్మగ్లింగ్, అక్రమ వ్యాపారంపై పటిష్టమైన చర్యలు తీసుకోవాలని పొగాకు బోర్డు వైస్‌చైర్మన్ గుత్తా వాసు కోరారు. మంగళవారం ప్రిన్సిపల్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్సీ సునీల్‌కుమార్ సిన్హాను ఢిల్లీలో బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. సిగరెట్ స్మగ్లింగ్, అక్రమ వ్యాపారం వల్ల జరిగే ముప్పుపై నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలని కోరారు. భారతీయ సిగరెట్ మార్కెట్‌లో అక్రమ సిగరెట్ మార్కెట్ వాటా 26.1శాతం కంటే ఎక్కువగా ఉందని, దీనివల్ల రైతులకు ఏటా రూ.1000 కోట్లపైగా నష్టం జరుగుతుందన్నారు. ఇంకొక వైపు 35 మిలియన్ కిలో గ్రాముల పొగాకుపై ఈ ప్రభావం చూపుతుందని, అందువల్ల స్మగ్లింగ్ సిగరెట్ అక్రమ వ్యాపారాన్ని నిరోధించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పటిష్టమైన నియంత్రణ చేయడం వల్ల వ్యవసాయం, దేశ ఆర్థికవ్యవస్థకు మేలు జరుగుతుందని వినతిపత్రంలో పేర్కొన్నారు.

పరీక్షల షెడ్యూల్ విడుదల

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 3 : భారీ వర్షాలు, సెలవుల కారణంగా నిలిచిపోయిన సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్-1 పరీక్షలను నిర్వహించేందుకు రాష్ట్ర విద్యా పరిశోధన మండలి మంగళవారం షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఆగస్టు 31న జరగాల్సిన పరీక్షను ఈనెల 6న, ఈనెల 2న జరగాల్సిన పరీక్షకు 9వ తేదీన నిర్వహిస్తున్నట్లు షెడ్యూల్‌లో పేర్కొన్నారు.

ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలి

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 3: వరద ముంపులో చిక్కుకున్న ప్రజలకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.లలితకుమారి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లో లక్షలాది ఎకరాల్లో వరి, పత్తి, మిరపతో పాటు పలురకాల పంటలు దెబ్బతినడంతో పాటు లంకప్రాంతాల్లో పసుపు పంట నీటమునిగిందన్నారు. అరటి తోటలు దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. మరో వైపు విజయవాడ పరిసర ప్రాంతాల్లో వరదలలో చిక్కుకొని తాగునీరు, ఆహారం కోసం పిల్లలు తల్లడిల్లిపోతున్నారని తెలిపారు. అందువల్ల ప్రభుత్వం సహాయక చర్యలు వేగవంతం చేయాలని ఆమె కోరారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


పతకాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 3: ఒంగోలులో జరిగిన ఇంటర్ స్టేట్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో స్థానిక హైదరాబాద్ పబ్లిక్ స్కూలు విద్యార్థులు సత్తా చాటారు. విద్యార్థులు నాలుగు బంగారు పతకాలు, రెండు సిల్వర్‌మెడల్స్ గెలుపొందారు. ఒంగోలు, గిద్దలూరు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ముత్తుముల అశోక్‌రెడ్డి చేతుల మీదుగా ఈ పథకాలను అందుకున్నారు. పతకాలు సాధించిన విజేతలను మంగళవారం స్కూలు ప్రతినిధులు అభినందించారు.

ఉత్తమ ప్రధానోపాధ్యాయునిగా కాంతారావు



చీమకుర్తి, సెప్టెంబరు 3: బండ్లమూడి హెచ్ఎం టీఎల్.కాంతారావు జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయుడు పురస్కారానికి ఎంపికయ్యారు. మంగళవారం ప్రభుత్వం అవార్డుల జాబితాను ప్రకటించింది. బండ్లమూడి జడ్పీ హైస్కూలు హెచ్ఎంగా స్కూలును అభివృద్ధిపథంలో నడిపించటానికి, విద్యార్థుల ప్రగతికి ఆయన చేసిన కృషికి గుర్తింపుగా అవార్డు లభించింది. కాంతారావుని పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు, పింఛన్లు ఇవ్వాలి

సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరారెడ్డి



ప్రచారం నిర్వహిస్తున్న వీరారెడ్డి

పొన్నలూరు (కొండపి), సెప్టెంబరు 3 : అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం రేషన్ కార్డులు, పింఛన్‌లు వెంటనే మంజూరు చేయాలని సీపీఐ కొండపి నియోజకవర్గ కార్యదర్శి కె.వీరారెడ్డి డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 6న పార్టీ ఆధ్వర్యంలో ఒంగోలులోని కలెక్టరేట్ వద్ద చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోపిన భారాలను తగ్గించాలని కోరారు. భూసమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల నిత్యావసరాలను ప్రభుత్వాలు పంపిణీ చేయాల్సి ఉన్నా ఇవ్వడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎం.శేషారెడ్డి, పార్టీ నాయకులు లాజరు, ఎన్.బాలకోటయ్య, సిహెచ్.అంకయ్య, మాల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన జనసేన నాయకులు



మొక్కలు నాటుతున్న జనసేన నాయకులు

ఎం.నిడమలూరు (టంగుటూరు), సెప్టెంబరు 3 : ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదినం సందర్భంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఎం.నిడమలూరులో క్లీన్ ఆంధ్ర, గ్రీన్ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని మంచి నీటి చెరువు కట్టపై మొక్కలు నాటారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ మిఠాయిలు పంచారు. జనసేన పార్టీ సీనియర్ నాయకుడు మేళం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ ఉపాధ్యక్షుడు సుబ్బారావు, ఎస్సీసెల్ నాయకుడు పి.సురేష్‌బాబు, ఇరు పార్టీల నాయకులు పి.మోహన్‌రావు, కె.వాసు, జి.మాలకొండయ్య. బి.ప్రదీప్, బి.హరిబాబు, ఎస్.బ్రహ్మానాయుడు, సాయి పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కొండపి, సెప్టెంబరు 3 : ఒంగోలుకు చెందిన చైల్డ్ ఫండ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కె.ఉప్పలపాడులోని జడ్పీ స్కూల్ విద్యార్థులకు హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ క్లస్టర్ లింక్ వర్కర్ పగడాల సరస్వతి, హెచ్‌ఎం వి.సుసన్నకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మర్రిపూడిలో సంక్షేమ వసతిగృహం

మంత్రి స్వామి ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

విద్యార్థుల వివరాలను సేకరించిన బీసీ సంక్షేమ అధికారి



మాట్లాడుతున్న జిల్లా బీసీ సంక్షేమ అధికారి

మర్రిపూడి, సెప్టెంబరు 3 : మర్రిపూడిలో సాంక్షేమ వసతిగృహం ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మంత్రి స్వామి ఆదేశాలతో అవసరమైన చర్యలు ప్రారంభించారు. అత్యంత కరువు పీడిత మండలం కావడంతో ఇక్కడి ప్రజలు ఉపాధి కోసం ఏటా ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లడం పరిపాటైంది. దీంతో పిల్లల చదువులు కుంటుపడుతున్నాయని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈనేపథ్యంలో ఇటీవల సాంఘిక సంక్షేమశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన స్వామి మర్రిపూడికి వచ్చారు. ఆ సందర్భంగా వసతి గృహం ఏర్పాటు ఆవశ్యకతను పలువురు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఆమేరకు మంగళవారం జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాసరావు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెబ్బా వెంకటేశ్వర్లు, ఎంఈవో ఈవీ రంగయ్యలతో సమావేశమయ్యారు. మర్రిపూడికి 5 కిమీ దూరానికిపైన ఉన్న గ్రామాల్లోని విద్యార్థుల వివరాలను సేకరించారు. మండలంలో 3,731 మంది విద్యార్థులుండగా వారిలో ఎస్సీలు 1,845, బీసీలు 876 మంది ఉన్నట్లు ఎంఈవో రంగయ్య నివేదించారు. ఈసందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు చేరెడ్డి నర్సారెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గొంటు హనుమారెడ్డి, ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ ఛైర్మన్ ఉప్పు సాయిబాబు, టీడీపీ నాయకులు ఉప్పు రమణయ్యలు బీసీ సంక్షేమ అధికారిని కలిసి వసతి గృహం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

నిబంధనల ప్రకారం బదిలీలు జరిగేనా?

గ్రేడ్లకు విరుద్ధంగా పంచాయతీ కార్యదర్శుల నియామకంపై సిఫార్సు లేఖలు

గత ప్రభుత్వ తప్పిదాలను కొనసాగిస్తున్న కొందరు కార్యదర్శులు

ఏ గ్రేడ్ కార్యదర్శులను ఆ గ్రేడ్ పంచాయతీల్లోనే నియమించాలని ప్రభుత్వ ఆదేశం

స్థానికంగా పరిస్థితి మరో విధంగా ఉండటంతో అధికారుల్లో ఆందోళన

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 3 : జిల్లాలో గ్రామపంచాయతీ కార్యదర్శుల బదిలీలపై సందిగ్ధం నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఎలాగైతే అడ్డగోలుగా బదిలీలను చేపట్టారో ఇప్పుడు కూడా అదేవిధంగా చేసేందుకు పంచాయతీ కార్యదర్శులు ప్రజాప్రతినిధులను తప్పుదారి పట్టిస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో నాలుగు గ్రేడ్లు ఉండగా వాటి ఆధారంగా కార్యదర్శులను నియమించాల్సి ఉంది. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో గ్రేడ్-1 పంచాయతీకి గ్రేడ్ 3, 4 కార్యదర్శులను 270 మందిని నియమించారు. అలా పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేశారు. దానిని సరిచేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు చేపట్టారు. ప్రస్తుత బదిలీల్లో ఏ గ్రేడ్ పంచాయతీ కార్యదర్శిని ఆ గ్రేడ్‌లోనే నియమించాలని పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతోపాటు టెలీకాన్ఫరెన్స్‌లో కూడా జిల్లా పంచాయతీ అధికారులకు పదేపదే ఈ అంశంపై దిశానిర్దేశం చేస్తున్నారు. కానీ క్షేత్రస్థాయికి వచ్చేసరికి లోగ్రేడ్‌లో ఉండే కార్యదర్శి మేజర్ పంచాయతీల్లో పనిచేసేందుకు తనకు అర్హత లేకపోయినా దానిని కప్పిపుచ్చి ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లి సిఫార్సులు చేయిస్తున్నారు. దీంతో ఆ శాఖ అధికారుల్లో ఆందోళన నెలకొంది. పంచాయతీ రాజ్ కమిషనర్ ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం గ్రేడ్-1 పంచాయతీల్లో గ్రేడ్-1 కార్యదర్శులు లేకపోతే గ్రేడ్-2 వారిని నియమించాలి. కానీ అందుకు భిన్నంగా గ్రేడ్-3, 4 కార్యదర్శులు ప్రస్తుత బదిలీల్లో గ్రేడ్-1 పంచాయతీలకు వెళ్లేందుకు ఒత్తిడి తెస్తున్నారు. ఆ మేరకు అధికార పార్టీ నాయకుల నుంచి సిఫార్సులు చేయిస్తున్నారు. దీంతో దిక్కుతోచని అధికారులు ఆ బదిలీల కసరత్తును చేపట్టని పరిస్థితి ఏర్పడింది. అయితే ప్రభుత్వం తాజాగా బదిలీలకు మరో 15 రోజులు గడువు పెంచడంతో పంచాయతీ అధికారులు ఈ విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది.

వణుకుతున్న మణికేశ్వరం

- ఇంటికి ఇద్దరికి విషజ్వరాలు
- మంచంపట్టిన రోగులు
- మేదరమెట్ల, అద్దంకి పట్టణాలకు వెళ్లి చికిత్స
- పట్టించుకోని వైద్యాధికారులు



జ్వరంతో బాధపడుతున్న వృద్ధురాలు అంజమ్మ, నాగాంజమ్మ, నొప్పితో బాధపడుతున్న ఏసురత్నం

అద్దంకిటౌన్, సెప్టెంబరు 3 : మండలంలో మణికేశ్వరం విషజ్వరాలతో వణుకుతోంది. 20 రోజులుగా గ్రామంలో ఇంటికి ఇద్దరు చొప్పున జ్వరంతో బాధపడుతున్నారు. అయినా వైద్యాధికారులు ఇటు తొంగిచూడడం లేదని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని తిప్ప మిద గత 20రోజుల నుంచి విషజ్వాలబారిన పడి తీవ్రమైన ఒంటి నొప్పులతో కొందరు మంచానికే పరిమితమయ్యారు. జ్వరాలు తగ్గినా కీళ్ల నొప్పితో నడవకలేక పోతున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సుమారు 50 మంది వరకు ఉన్నారని చెప్తున్నారు. వీరిలో కొందరు గ్రామంలోకి వచ్చే ఆర్ఎంపీతో వైద్యం చేయించుకోగా, మరికొందరు అద్దంకి, మేదరమెట్ల పట్టణాలలోని ప్రైవేట్ వైద్యశాలలకు వెళ్లి చికిత్స చేయించుకుంటున్నారు. వేలకు వేలు ఖర్చు చేస్తున్న జ్వరం తగ్గడంలేదని, రోజుల తరబడి ఇబ్బంది పడుతున్నామని పీడితులు వాపోతున్నారు. ప్రభుత్వ వైద్యాధికారులు పట్టించుకోవడం లేదని అంటున్నారు. గ్రామంలో ఉన్న ఆరోగ్య సిబ్బంది కూడా విషజ్వరాల పరిస్థితిపై వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లి వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ తమకెందుకులే అన్నట్లు వ్యవహరిస్తున్నారని పలువురు రోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చేసేది లేక బాధితులు ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. స్థోమత ఉన్న వారు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి వైద్యం పొందున్న పరిస్థితి ఉంది. తక్షణమే మణికేశ్వరంలో జిల్లా వైద్యాధికారులు పర్యటించాలని, వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి జ్వరాలు తగ్గేవరకూ సేవలందించాలని ప్రజలు కోరుతున్నారు.

వృథాగా పోతున్న నీరు

తూముల ద్వారా నీటి లీకేజీ

కంభం చెరువు నుంచి వృథాగా పోతున్న నీరు



తూము నుంచి బయటకు పోతున్ననీరు

కంభం, సెప్టెంబరు 3 : తుఫాన్ ప్రభావంతో మూడు రోజుల నుంచి కురిసిన వర్షాలకు కంభం చెరువుకు సుమారు 8 అడుగులమేర నీరు వచ్చింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే చిన్న కంభం తూము వద్ద నీరు వృథాగా పోతోంది. అధికారులు లీకేజీని అరికట్టలేక పోయారని రైతులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. తూముల ద్వారా లీకేజ్ అయితే నెలరోజుల్లోపు చెరువు ఖాళీ అవుతుందని ఆందోళన చెందుతున్నారు. సాగు చేసేందుకు నీరు లేక రైతులు ఇబ్బంది పడాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. ఇటీవల రూ.7లక్షలతో చిన్నకంభం తూము వద్ద మరమ్మతులు చేపట్టినా ఫలితం లేకపోవడం గమనార్హం. ఈ విషయంపై ఇరిగేషన్ డీఈ జాకీర్‌అహమ్మద్‌ను వివరణ కోరగా చిన్న కంభం తూము లోపల ఎక్కడో రంధ్రం ద్వారా నీరు లీకవుతుందని, దానిని పరిశీలించామని, ఆ రంధ్రాన్ని పూడ్చే ప్రయత్నం మన చేతిలో లేదని తెలిపారు. ఇటీవల జరిగిన మరమ్మతుల తూము పైభాగం వరకు మాత్రమే చేశామని, లోపల చేయలేదని తెలిపారు.

అద్దంకిలో ఆకతాయిల ఆగడాలు

అద్దంకి, సెప్టెంబరు 3 : అద్దంకి పట్టణంలో ఇటీవల కాలంలో ఆకతాయిల ఆగడాలు మరింత పెరిగాయి. చీకటి పడితే ఖాళీ ప్రదేశాలను అడ్డాగా చేసుకుని మద్యం తాగుతున్నారు. ఇదే సమయంలో అటువైపు వెళ్లే ప్రజలను రన్నింగ్ కామెంటరీ చేయడం సర్వసాధారణంగా మారింది. ప్రధానంగా దర్శి రోడ్డులో మూడు అంతస్తుల భవనం పక్కన కట్టకిందపాలెం రోడ్డులో ఉన్న ఖాళీ స్థలంలో ఉన్న బల్లలపై యువకులు తిష్ట వేస్తున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



మృతి చెందిన రైతు వెంకటేశ్వరరెడ్డి(ఫైల్)

తాళ్లూరు, సెప్టెంబరు 3: విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన ఘటన మంగళవారం మండలంలోని కొత్తపాలెంలో చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన కైపు వెంకటేశ్వరరెడ్డి(జగ్గు) ఉదయం పొలంలో పనులు చేసేందుకు వెళ్లాడు. కాలువ ఒడ్డున విద్యుత్ తీగ ఉండటంతో తీసేందుకు ప్రయత్నించగా షాక్‌కు గురై పడిపోయాడు. ఆయన భార్య పక్క పొలంలో ఉన్న రైతులకు తెలపడంతో వారువచ్చి సపర్యలు చేశారు. ఎంతకూ స్పృహ రాకపోవడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షలు చేసి విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడని తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి మృతుడు వెంకటేశ్వరరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైసీసీ మండల అధ్యక్షుడు తూము వెంకటసుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ పోశం మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు కరిముల్లా ఉన్నారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

డీలర్ల నియామకాలకు ప్రతిపాదనలు

తాళ్లూరు, సెప్టెంబరు 3 : తాళ్లూరు మండలంలో రేషన్ డీలర్ల నియామకాలకు తహసీల్దార్ పి.సింగారావు ప్రతిపాదనలు పంపారు. గత మూడు నెలలుగా వీరి నియామకాలు చేపట్టలేదు. ఐదు రేషన్ షాపుల డీలర్ల నియామకానికి మంగళవారం ప్రతి పాదనలు పంపారు. రేషన్ పరేషాన్ శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా కలెక్టర్ స్పందించి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో ఐదు రేషన్ షాపులకు నూతన డీలర్లను నియమించేందుకు ఒంగోలు ఆర్డీవోకు ప్రతిపాదనలు పంపారు. 14 రేషన్ షాపులకు చెందిన రేషన్ డీలర్లు రాజీనామా చేసినట్లు కలెక్టర్‌కు పంపిన నివేదికలో తహసీల్దార్ పేర్కొన్నారు. రెండు షాపులకు డీలర్ల నియామకం జరిగిందని తెలిపారు. మరో ఐదు షాపులకు డీలర్ల నియామకం కోసం స్థానిక కార్యాలయంలో వివరాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. మరో మూడు రేషన్ షాపులకు డీలర్ల నియామకం కోసం అభ్యర్థనలు కార్యాలయంలోఅందజేశారని తెలిపారు. రేషన్ పంపిణీలో కార్డుదారులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు వీఆర్వో, వీఆర్ఏలను నిమమించినట్లు కలెక్టర్‌కు తహసీల్దార్ నివేదిక పంపారు.

వరద బాధితులకు ఆహారం

మంత్రి డాక్టర్ స్వామి సూచనతో ముందుకొచ్చిన సీఫుడ్స్ కంపెనీలు

విజయవాడకు 25వేల భోజన ప్యాకెట్లు



ఆహార ప్యాకెట్లను, వాటర్ బాటిళ్లను పంపిస్తున్న కలెక్టర్, దేవి సీఫుడ్స్, జీవీఆర్ కంపెనీల ప్రతినిధులు

సింగరాయకొండ, సెప్టెంబర్ 3 : సింగరాయకొండలోని దేవి సీఫుడ్స్, జీవీఆర్, జరుగుమల్లి మండలంలోని మున్నంగి సీఫుడ్స్ కంపెనీలు విజయవాడ వరద బాధితుల తమవంతు సాయం అందించేందుకు ముందుకొచ్చాయి. రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి సూచనతో 25వేల ఆహార ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను అందజేశాయి. భోజనాన్ని ఒంగోలులో తయారు చేయించిన కంపెనీ ప్రతినిధులు కలెక్టర్ తమీమ్ అన్సారియా సమక్షంలో మంగళవారం విజయవాడకు తరలించారు. కష్టకాలంలో బాధితులను ఆదుకోవడానికి ముందుకొచ్చిన సీఫుడ్స్ కంపెనీల యాజమాన్యాన్ని మంత్రి డాక్టర్ స్వామి, కలెక్టర్ అభినందించారు.

ఆహారం ప్యాకింగ్‌లో టంగుటూరు డ్వాక్రా మహిళలు



ఆహారం ప్యాకింగ్ చేస్తున్న టంగుటూరు డ్వాక్రా మహిళలు

టంగుటూరు, సెప్టెంబరు 3 : డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు మంగళవారం ఒంగోలు నుంచి ఆహారం పంపించారు. ప్యాకింగ్‌లో టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అధికార ప్రతినిధి తోకల భారతి నేతృత్వంలో పలువురు వీవోఏలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



ఆశాను వివరాలు అడుగుతున్న వైద్యాధికారులు

టంగుటూరు, సెప్టెంబరు 3 : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారులు డాక్టర్ ప్రసాద్ బాబు, డాక్టర్ బాలాజీనాయక్ సూచించారు. స్థానిక వైద్యశాల ప్రాంగణంలో మంగళవారం ఆశా డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశాలు, ఏఎన్ఎంలు, ఎంఎంఎల్‌హెచ్‌పీలకు వైద్యాధికారులు పలు సూచనలు చేశారు. వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా చూడాలన్నారు. ఈనెల 17న డీ వార్మింగ్ డేను విజయవంతం చేయాలని కోరారు.

వ్యవసాయ కళాశాలలో లాం శాస్త్రవేత్తలు

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 3: సీఎస్‌పురం మండలం శీలంవారిపల్లిలోని కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలను గుంటూరు లాంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు ఏవీ రమణ, మునిరత్నం, పి. అనిల్‌కుమార్ మంగళవారం సందర్శించారు.డిజిటల్ తరగతి గదులు, హాస్టల్, కంప్యూటర్, ల్యాబ్స్ గురించి ఆరా తీశారు.





ముంపు ప్రాంతాలకు కదిలిన సాయం

● పులిహోర పొట్లాలు మంచినీటి ట్యాంకర్ల తరలింపు ● సబ్ కలెక్టర్ పర్యవేక్షణలో రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షణ



బాధితుల కోసం ఆహార పదార్థాలతో లారీ పంపుతున్న సబ్ కలెక్టర్

మార్కాపురం రూరల్, సెప్టెంబరు 3: స్థానిక కంభం రోడ్డులోని పద్మావతి శ్రీనివాస కల్యాణ మండపంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మార్కాపురం సబ్‌కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, తహసీల్దార్ చిరంజీవిల ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితుల కోసం 30 వేల పులిహోర పొట్లాలను తయారుచేసి లారీలలో మంగళవారం తరలించారు. పులిహోర పొట్లాల తయారీ, లారీలలో తరలింపును సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. విజయవాడ వరద బాధితుల కోసం మార్కాపురంలో 15వేల పులిహోర ప్యాకెట్లను తయా రు చేయించినట్లు తెలిపారు. అలాగే ఒంగోలులో కూడా మరో 15వేల పులిహోర ప్యాకెట్లను తయారు చేయిం చి లారీలలో విజయవాడ వరద బాధితుల కోసం తరలిస్తున్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు వరద బాధితుల కోసం ఆహార పంపిణీ కార్యక్రమాన్ని చేస్తున్నట్లు సబ్ కలెక్టర్ తెలిపారు. మార్కాపురం నుంచి బయలుదేరిన లారీలలో ఒక లారీలో 9856 పులిహోర ప్యాకెట్లు, మరొక లారీలో 5248 పులిహోర ప్యాకెట్లు తరలించారు. అలాగే ఒంగోలు నుంచి బయలుదేరిన వాహనాలలో ఒక లారీలో 5000, మరో లారీలో 9896 పులిహోర ప్యాకెట్లను తరలించినట్లు తెలిపారు. బయలుదేరిన నాలుగు లారీలకు ఒక్క లారీకి ఒక రెవెన్యూ అధికారిని ఇన్‌చార్జ్‌గా నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

విజయవాడకు నీటి ట్యాంకర్లు

పొదిలి : వరద బాధితులకు నీటి సరఫరా చేసేందుకు పొదిలి మున్సిపాలిటీ నుంచి మంగళవారం 20 మంచినీటి ట్యాంకర్లను పంపించారు. నాలుగు రోజులుగా విజయవాడలో వరద చిక్కుకొని ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. దీంతో అక్కడి ప్రజలు ఆహారం, నీళ్లు అందక ఇబ్బందులు పడుతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారాయణ ఆదేశాల మేరకు పొదిలి నుండి 20 నీటి ట్యాంకర్లను మంగళవారం విజమవాడకు పంపించినట్లు ఇన్‌చార్జ్ కమిషనర్ భూపాల్‌రెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు మీగడ ఓబులరెడ్డి తెలిపారు. మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి స్వయంగా మండలంలోని ట్యాంకర్లను సమకూర్చి పంపిస్తున్నట్లు చెప్పారు. విజయవాడ సిటీలో అవసరమైన ప్రాంతాలకు నీటి సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు.



నీటిట్యాంకులు పంపిస్తున్న టీడీపీ నాయకులు

అవీ..ఇవీ..

ముమ్మరంగా బర్లీ పొగాకు నాట్లు



పొగాకు మొక్కలు నాటుతున్న కూలీలు

తర్లుపాడు, సెప్టెంబరు 3: మండలంలో బర్లీ పొగాకు నాట్లను ముమ్మరంగా సాగుతున్నాయి. గతేడాది బర్లీ సాగు చేసిన రైతులకు కొంతమేర లాభాలు వచ్చాయి. దీంతో ఈ ఏడాది రైతన్నలు మరింత ఉత్సాహంతో అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. గతంలో ఎన్నడూ సాగు చేయని రైతులు కూడా ఈ ఏడాది బర్లీ పొగాకు నాటుతున్నారు. ఎకరాకు దాదాపు 16వేల మొక్కలు నాటుతున్నారు. మొక్క రూ.0.35పైసలు చొప్పున దూర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి నాటుతున్నారు. ఇప్పటికే మండలంలో సుమారు 750 ఎకరాలు బర్లీ పొగాకు నాట్లు వేశారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు పొలాలు పదును కావడంతో ప్రస్తుతం ముమ్మరంగా నాట్లు కొనసాగుతున్నాయి. వివిధ కంపెనీల సూపర్‌వైజర్లు గ్రామాల్లోకి వచ్చి రైతులకు క్వింటా రూ.15వేల చొప్పున కొనుగోలు చేస్తామని విస్తృతంగా ప్రచారం చేయడంతో రైతున్నలు బర్లీ పొగాకు సాగుపై మొగ్గు చూపుతున్నారు.

ఎరువులు, పురుగుమందులు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు



దుకాణ యజమానులతో మాట్లాడుతున్న మార్కాపురం ఏడీఏ బాలాజీనాయక్

కంభం, సెప్టెంబరు 3 : కంభం మండలంలో ఎరువులు, పురుగు మందులు ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయించినా, అనుమతిలేని పురుగు మందులను విక్రయించిన కఠిన చర్యలు తీసుకుంటామని మార్కాపురం సహాయ వ్యవసాయ విస్తరణా.దికారి బాలాజీనాయక్ హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం ఆయన వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎరువులు, పురుగుమందుల వ్యాపారులతో మాట్లాడారు. ఏ మందులు అమ్మినా తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి స్వరూపా, సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన ర్యాలీ



అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 3: ప్రతిఒక్కరూ నేత్రదానంపై అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.కె.పద్మావతి అన్నారు. స్థానిక కోర్టుకూడలిలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు పురస్కరించుకుని మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ.. నేత్రదానం మన అందరికీ ఆదర్శం కావాలన్నారు. ప్రతి ఒక్కరూ నేత్రదాన ఉద్యమంలో భాగస్వాములు కావాలన్నారు. మరణించిన వ్యక్తుల కళ్లను దానం చేస్తే మరో ఇద్దరికి కంటి చూపు లభిస్తుందన్నారు. వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రావణ్ ఆప్తమాలిక్ అసిస్టెంట్ షేక్ రబ్బాని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రపటాలు అందజేత



చిత్రపటాలు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

గిద్దలూరు, సెప్టెంబరు 3 : తొలి స్వాతంత్ర్య సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి భారతరత్న అవార్డు ఇవ్వాలని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫౌండేషన్ ప్రతినిధులు నారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, శివప్రసాద్‌లు కోరారు. ఆ మేరకు వారు నరసింహారెడ్డి చిత్రపటాలను తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, కమిషనర్ వెంకటదాస్‌లకు అందజేశారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 3: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీవో సుశీలాదేవి అన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సుశీలాదేవి మాట్లాడుతూ, తక్కువ పోషణతో ఎక్కువ పౌష్టికాహార విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐటీసీ ప్రథమ్ జిల్లా సమన్వయకర్త వెంకట్రావు, సూపర్‌వైజర్‌లు బుజ్జి, రవికుమారి, సలోమి, అరుణకుమారి, కృష్ణవేణి, వాసవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

కొళాయి వద్ద ఘర్షణలో మౌజన్‌పై దాడి



చికిత్సపొందుతున్న నూర్ అహ్మద్

మార్కాపురం, సెప్టెంబరు 3: ఇళ్ల వద్ద నీళ్లు పట్టుకునే విషయమై చోటుచేసుకున్న ఘర్షణలో మసీదులో పనిచేసే మౌజన్‌పై దాడి జరిగింది. ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు స్థానిక కోనేటి బజార్‌లో ఎదురెదురు గృహాల్లో నివాసముండే షేక్ నూర్ అహ్మద్ (నూర్), ఎమ్మార్కే బాషా కుటుంబ సభ్యుల మధ్య కొళాయి వద్ద నీళ్లు పట్టుకునే విషయంలో గొడవ జరిగింది., ఈ క్రమంలో వారిని వారించబోయిన నూర్ అహ్మద్‌ను ఎమ్మార్కే బాషా కుటుంబ సభ్యులు ముగ్గురు కలిసి కర్రలతో దాడి చేశారు. దీంతో నూర్ అహ్మద్‌కు ముఖం, తలపై గాయాలయ్యాయి. ఈ మేరకు టౌన్ పీఎస్‌ఐ రాజమోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఆశ కార్యకర్తలు

గిద్దలూరు, సెప్టెంబరు 3 : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశ వర్కర్లు పట్టణ ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా చేశారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ షరీఫ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆశవర్కర్ల యూనియన్ ప్రతినిధులు విశ్రాంతమ్మ, రాజమణి మాట్లాడుతూ కనీస వేతనం అమలు చేయాలని, పనిభారం తగ్గించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రిటైర్డ్‌మెంట్ జీవో విడుదలయ్యే వరకు 60 ఏళ్లు నిండిన ఆశవర్కర్ల రిటైర్మెంట్‌ను ఆపాలని కోరారు. కార్యక్రమంలో ఆశవర్కర్ల యూనియన్ ప్రతినిధులు సరోజ, కళ్యాణి, శైలజ, అంజలి, సీఐటీయూ నాయకులు నరసింహులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

గిద్దలూరు, సెప్టెంబరు 3 : పట్టణంలోని స్ప్రింగ్ బోర్డు పాఠశాల విద్యార్థులు ఇంటర్ స్టేట్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలలో ప్రతిభ కనపరిచారు. ఒంగోలులో జరిగిన కరాటే చాంపియన్‌షిప్ పోటీలలో స్ప్రింగ్‌బోర్డు పాఠశాలకు చెందిన అబ్దుల్‌మసద్, రంగగణేష్‌లు కుమితే విభాగంలో బంగారు పతకాలు సాధించారు. కటాస్ విభాగంలో జయశ్రీ, పర్వాని, వనజాక్షి, లేహ్య రజత పతకాలు, ఉదయ్, హంసిని, సుమయ్య, విరాట్, వైభవ్, మన్విత్‌లు కాంస్య పతకాలు సాధించారు. టీమ్ కటాస్ విభాగంలో మహేష్, అల్కేస్, దీక్షిత్‌లు బంగారు పతకాలు సాధించగా జయంత్, గణేష్, రామ్‌చరణ్‌లు రజత పతకాలు సాధించారు. వీరందరిని పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ జె.వి.నారాయణ, ప్రిన్సిపాల్ శ్వేత అభినందించారు.

విద్యార్థుల కుటుంబాలకు ఆర్థిక సాయం

మార్కాపురం, సెప్టంబర్ 3: పెద్దారవీడు మండలం కొత్తపల్లి గ్రామంలో ఈ నెల 1న నీటికుంటలో పడి మృతిచెందిన ముగ్గురు చిన్నారుల కుటుంబాలకు ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. ట్రస్ట్ వైస్‌ఛైర్మన్, బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున నగదును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ముందుగా విద్యార్థుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు గొట్టం శ్రీనివాసరెడ్డి, బీజేపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీ కృష్ణారావు, పెద్దారవీడు, పెద్దదోర్నాల మండలాల బీజేపీ అధ్యక్షులు బొచ్చు కోటిరెడ్డి, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగా గురువు నారాయణరెడ్డికి అవార్డు

గిద్దలూరు, సెప్టెంబరు 3 : గిద్దలూరుకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురువు నారాయణరెడ్డికి అల్లూరి సీతారామరాజు అవార్డు లభించింది. హైదరాబాద్‌కు చెందిన అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు అవార్డు అందజేశారు. వివిధ సేవా కార్యక్రమాలు చేస్తున్న నారాయణరెడ్డిని నిర్వాహకులు సన్మానించారు.

ఉపాధ్యాయుల క్రీడా పోటీలు



ఉపాధ్యాయుల క్రీడల పోటీలు ప్రారంభిస్తున్న ఎంఈవో

ఎర్రగొండపాలెం(పుల్లలచెరువు),సెప్టెంబరు 3: దేశ మాజీ రాష్ట్రపతి డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణమూర్తి జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని, ఎర్రగొండపాలెంలో ఉపాధ్యాయులకు క్రీడాపోటీలను ఎంఈవో పి.ఆంజనేయులు ప్రారంభించారు. సోమవారం ఎర్రగొండపాలెంలోని హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు క్రీడాపోటీల్లో భాగంగా కబడ్డీ, క్రికెట్, షటిల్, షాట్‌పుట్, పరుగుపందెం, లాంగ్ జంప్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడల ప్రాధాన్యత తెలిసే విధముగా ఉపాధ్యాయులే నేడు పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏంఈవో మల్లానాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

● జిల్లా విజిలెన్స్ అధికారి ఝాన్సీరాణి

కొనకనమిట్ల, సెప్టెంబరు 3 : మండల పరిషత్ సమావేశపు హాలులో ఉపాధి హామీ సిబ్బంది, ఆడిట్‌కు వచ్చిన డీఆర్‌పీలు గ్రామాలలో ప్రజలతో మమేకమై సమన్వయంతో చేయాలని జిల్లా విజిలెన్స్ అధికారి ఝాన్సీరాణి అన్నారు. ముఖ్యంగా గ్రామాలలో ఆడిట్ సమయంలో సమావేశాలు నిర్వహించినప్పుడు ప్రోటోకాల్ సమస్య రాకుండా చూడాలన్నారు. సంబంధిత సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు సభ్యుల విషయంలో అందరికీ, సమావేశ వివరాలు తెలియజేసి సిబ్బంది అందరు కలిసి ఆడిట్ పూర్తిచేయాలని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఒంగోలు ఏపీడీ వెంకటస్వామి, ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి, ఏపీవో బులెన్‌రావు, ఎస్ఆర్‌పీ మూర్తి, క్లస్టర్ టీపీ అచ్చిరెడ్డి, పలువురు డీఆర్‌పీలు, టీఏలు, పలువురు ఎఫ్ఏలు పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంభం చెరువు తూముకు లీక్

తూముల నుంచి వృథాగా పోతున్న నీరు

కంభం, సెప్టెంబరు 3 : తుఫాన్ ప్రభావంతో మూడు రోజుల నుంచి కురిసిన వర్షాలకు కంభం చెరువుకు సుమారు 8 అడుగులమేర నీరు వచ్చింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే చిన్నకంభం తూము వద్ద నీరు వృథాగా పోతోంది. అధికారులు లీకేజీని అరికట్టలేక పోయారని రైతులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. తూముల ద్వారా లీకేజ్ అయితే నెలరోజుల్లోపు చెరువు ఖాళీ అవుతుం దని ఆందోళన చెందుతు న్నారు. సాగు చేసేందుకు నీరు లేక రైతులు ఇబ్బంది పడాల్సి వస్తుందని పేర్కొం టున్నారు. ఇటీవల రూ.7లక్షలతో చిన్నకంభం తూము వద్ద మరమ్మతులు చేపట్టినా ఫలితం లేకపోవడం గమనార్హం. ఈ విషయంపై ఇరిగేషన్ డీఈ జాకీర్‌అహమ్మద్‌ను వివరణ కోరగా చిన్నకంభం తూము లోపల ఎక్కడో రంధ్రం ద్వారా నీరు లీకవుతుందని, దానిని పరిశీలించామని, ఆ రంధ్రాన్ని పూడ్చే ప్రయత్నం మనచేతిలో లేదని తెలిపారు. ఇటీవల జరిగిన మరమ్మతుల తూము పైభాగం వరకు మాత్రమే చేశామని, లోపల చేయలేదని తెలిపారు.



చెరువు తూము నుంచి లీకవుతున్న నీరు

పంటనష్టంపై నివేదికను సిద్ధం చేయండి

అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే ముత్తుముల



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 3 : ఇటీవల కురిసిన వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటల వివరాలను సేకరించి రైతులకు పంట నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో వ్యవసాయ, ఉద్యానవన, పట్టుపరిశ్రమల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మూడు రోజులుగా కురిసిన వర్షాల కారణంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో వరదలు, పంట పొలాల్లో నీటి నిలువలు ఉన్నాయన్నారు. వాటిని లేకుండా చూడాలన్నారు. రైతులకు సంబంధించి ఏఏ పంటలు దెబ్బతిన్నాయని, పూర్తి వివరాలను అధికారులు సేకరించాలని, సూచించారు. ఉద్యానవన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, ప్రభుత్వం నుంచి రైతులకు అందే రాయితీలపై కూడా క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు బాలాజీనాయక్, సెరీకల్చర్ డీపీవో పాండు రంగారెడ్డి, ఉద్యానవనశాఖ హెచ్‌వోలు శ్వేత, విష్ణుప్రియ, రెవెన్యూ ఏఎస్‌వో మున్వర్ పాల్గొన్నారు.

వరద బాధితులకు లక్ష విరాళం



చెక్కును అందజేస్తున్న ప్రైవేటు పాఠశాలల ప్రిన్సిపాల్‌లు

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 3 : విజయవాడ వరద బాధితుల కోసం లక్ష రూపాయల విరాళాన్ని గిద్దలూరు నియోజకవర్గ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ అందజేసింది. మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్రదేవికి లక్ష రూపాయల చెక్కును నియోజకవర్గ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ నాయకులు పి.సుధీర్ కుమార్‌రెడ్డి, జింకా చంద్రశేఖర్, కె.గణేష్ యాదవ్, షేక్ అచ్చుకట్ల ఖాజావలి, పి.మణి చైతన్య చెక్కును అందజేశారు.

అన్నా క్యాంటీన్‌కు రూ.30వేల విరాళం

గిద్దలూరు టౌన్ : పట్టణానికి చెందిన సిరి రెస్టారెంట్ యజమానులు రూ.30వేల విరాళాన్ని అన్నా క్యాంటీన్‌కు అందజేశారు. మంగళవారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి విరాళానికి సంబంధించిన చెక్కును అందించారు. సిరి రెస్టారెంట్ యజమానులు మారుడి రవికుమార్‌రెడ్డి, బాలిరెడ్డి, సంపత్ గార్మెంట్స్ యజమాని జిల్లెల్ల సంపత్‌కుమార్‌రెడ్డి కలిసి రూ.30వేల చెక్కును ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఖాదర్‌వలి, కమతం శ్రీను పాల్గొన్నారు.

గంటవానిపల్లె సమస్యలు పరిష్కరించాలి

● ఎంపీడీవోకు వినతిపత్రం అందజేసిన గ్రామస్థులు



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

పెద్దదోర్నాల, సెప్టెంబరు 3 : మండలంలోని గంటవానిపల్లె గ్రామస్థులు తమ గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీవో నాసర్‌రెడ్డికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. గ్రామానికి వెళ్లేందుకు కనీసం ప్రధాన రహదారి కూడా సక్రమంగా లేదని, దశాబ్దాల నాడు తీగలేరుపై చిన్నపాటి వంతెన నిర్మించారని, వర్షం కురిస్తే తీగలేరు ప్రవాహంతో గ్రామానికి రాకపోకలు నిలిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత నెల 30వ తేదీ నుంచి నల్లమల ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి తీగలేరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గ్రామం నుంచి బయటకు వెళ్లలేక పోతున్నామన్నారు. ఉన్నది ఒక్కటే మార్గమని ఆ మార్గం తీగలేరు గుండా ప్రయాణించాల్సి ఉందన్నారు. విద్యార్థులు పాఠశాలకు, అత్యవసర సమయంలో రోగులు దోర్నాలకు వెళ్లలేని పరిస్థితులు నెలకొందన్నారు. అంతేగాక గ్రామంలో మురికినీటి కాలువలు లేకపోవడంతో వాననీరు ప్రధాన రహదారులపై చేరడంతో ఈగలు, దోమలు వృద్ధి చెందుతాయన్నారు. మురికికంపుతో అల్లాడుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించాలని సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

ఎండైనా, వానైనా తిప్పలే



వర్షంలో బస్సుకోసం వేచి ఉన్న విద్యార్థులు(ఫైల్)

పొదిలి, సెప్టెంబరు 3 : పట్టణంలో బస్సులకోసం వేచి ఉండే విద్యార్థులు, ప్రజలు నిలువనీడ కోసం ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఎండైనా, వానైనా వారికి తిప్పలు తప్పడం లేదు. ఇటీవల కురిసిన వర్షానికి తలదాచుకోవడానికి నీడలేక ఇలా వానలో విద్యార్థులు తడిసి ముద్దయ్యారు. అధికారులు, నాయకులు చొరవ తీసుకొని పెద్దబస్టాండ్ కూడలి, చిన్నబస్టాండ్ ప్రాంతాల్లో బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సాగులో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి

వ్యవసాయాధికారి నీరజ

త్రిపురాంతకం సెప్టెంబరు 3 : అధిక వర్షాల కాలంలో పంటలకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.నీరజ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి, పత్తి, మొక్కజొన్న పంటలను ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. వరి నారుమడి దశ నుండి దుబ్బు దశలో ఉన్నందున వర్షపు నీటిని మడుల నుంచి బయటకు పంపాలని, ఎకరానికి 30 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్‌ను పైపాటుగా వేయాలన్నారు. పాముపొడ తెగులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రోపికొనజోల్ 1 మిల్లీ లీటరును లేదా వాలిడమైసిన్ 2 మిల్లీ లీటర్లను నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. మొక్కజొన్నలో కాండము తొలిచే పురుగు ఉధృతి ఎక్కువయ్యే అవకాశం ఉన్నందున దాని నివారణకు ఎకరానికి 400 మిల్లీ లీటర్ల ప్రోఫినోఫాస్, ప్రోపికొనెజాల్ 200 మిల్లీలీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పత్తి పంట పూత దశలో ఉన్నందున పైరు పెరుగుదలకు ఎకరానికి 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ వేయాలన్నారు. పూత రాలకుండా నివారణకు బోరాక్స్ 1.5 గ్రాములను 1 లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. అధిక తేమను తట్టుకోవడానికి నీటిలో కరిగే ఎరువులు 19.19.19 లేదా 17.17.17 పిచికారీ చేయాలన్నారు.



రైతులకు సూచనలిస్తున్న ఉద్యానాధికారి శ్వేత

కంభం : ప్రస్తుతం నారు మడులలో ఉన్న మిరప, కూరగాయలకు నారుకుళ్లు తెగులు సోకే అవకాశం ఉందని ఉద్యానవన శాఖాధికారిణి శ్వేత తెలిపారు. నారుమడుల మీద నీరు నిలువ ఉండకుండా కాలువల ద్వారా పొలం బయటకు వెళ్లే విధంగా ఏర్పాటు చేసుకో వాలన్నారు. కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా మంకోజబ్ లేదా రిడోమిల్ వంటి శిలీంద్రనాశినులను నారు మీద పిచికారి చేయాలన్నారు. పొలాల్లో నీరు ఎక్కువగా ఉండడం వలన వేరుకు ఎటువంటి గాలి సోకదని, ద్వారా భూమి నుంచి ఎటువంటి పోషకాలను తీసుకోలేక పసుపురంగుకు మారి చనిపోయే అవకాశం ఉంటుందన్నారు. కాబట్టి 19-19-19 లీటరు నీటికి 10 గ్రాములు, సూక్ష్మపోషకాల మిశ్రమం 5 గ్రాములు లీటరు నీటికి కలిపి అన్ని పంటలపై పిచికారి చేసుకోవాలన్నారు. బొప్పాయి మొక్కలకు మొదళ్ల దగ్గర కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా డిడోమిల్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పోయడం వలన వేరుకుళ్లు రాకుండా ఉంటుందన్నారు.

పొదిలి : దుకాణదారులు గుర్తింపు పొందిన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని వ్యవసాయాధికారి షేక్ జైన్‌లుబ్దీన్ అన్నారు. అన్నదాతల అవసరాలను దృష్టిలో ఉంచుకొని నాశిరకం విత్తనాలు విక్రయించవద్దన్నారు. ఏదో ఒక లైసెన్స్ మాత్రమే తీసుకొని ఎరువులు, పురుగుమందులు, విత్తనాలను విక్రయిస్తున్నారన్నారు. అలాకాకుండా రెండిటికి లైసెన్స్‌లు ఉండాలన్నారు. లైసెన్స్‌తోపాటు రిజిస్ట్రేషన్, అప్లికేషన్, పరిమిషన్ అనుమతులు ఉండాలన్నారు. కాదని ఎలాంటి అనుమతులు లేకుండా ఎరువులు, పురుగుమందులు అమ్మితే దుకాణాన్ని సీజ్ చేస్తామన్నారు. అన్నదాతలు కూడా పంట సాగు చేసే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాధారంగా సాగుచేసే పంటలైన కంది, పత్తి, సజ్జ తేలికపాటి నేలల్లో 50, 60 మిమీ, బరువైన నేలల్లో 60, 70 మిమీ వర్షపాతం నమోదైన తరువాత సాగుచేస్తే మంచి దిగుబడులు వస్తాయన్నారు. అదేవిధంగ రైతులు మేలైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలన్నారు. రైతులు పంటసాగుకు ముందే నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలని సూచించారు.



రైతులకు సలహాలు ఇస్తున్న ఏవో నీరజ

డీలర్ల నియామకాలకు ప్రతిపాదనలు

తాళ్లూరు, సెప్టెంబరు 3: తాళ్లూరు మండలంలో రేషన్ డీలర్ల నియామకాలకు తహసీల్దార్ పి.సింగారావు ప్రతిపాదనలు పంపారు. గత మూడు నెలలుగా వీరి నియామకాలు చేపట్టలేదు. ఐదు రేషన్ షాపుల డీలర్ల నియామకానికి మంగళవారం ప్రతి పాదనలు పంపారు. రేషన్ పరేషాన్ శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా కలెక్టర్ స్పందించి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో ఐదు రేషన్ షాపులకు నూతన డీలర్లను నియమించేందుకు ఒంగోలు ఆర్‌డీవోకు ప్రతిపాదనలు పంపారు. 14 రేషన్ షాపులకు చెందిన రేషన్ డీలర్లు రాజీనామా చేసినట్టు కలెక్టర్‌కు పంపిన నివేదికలో తహసీల్దార్ పేర్కొన్నారు. రెండు షాపులకు డీలర్ల నియామకం జరిగిందని తెలిపారు. మరో ఐదు షాపులకు డీలర్ల నియామకం కోసం స్థానిక కార్యాలయంలో వివరాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. మరో మూడు రేషన్ షాపులకు డీలర్ల నియామకం కోసం అభ్యర్థనలు కార్యాలయంలోఅందజేశారని తెలిపారు. రేషన్ పంపిణీలో కార్డుదారులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు వీఆర్‌వో, వీఆర్ఏలను నిమమించినట్లు కలెక్టర్‌కు తహసీల్దార్ నివేదిక పంపారు.

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 3: సీఎస్‌పురం మండలంలో నలుగురు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు విద్యాశాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. శీలంవారిపల్లె జడ్పీహెచ్‌లో పనిచేస్తున్న ఎన్.వెంకటరామయ్య, కోవిలంపాడు పాఠశాలలో పనిచేస్తున్న సీహెచ్ సునీత, దర్శిగుంటలో పనిచేస్తున్న ఇ.సరోజనమ్మ, డీజీపేటలో పనిచేస్తున్న జి.రత్తమ్మ ఎంపికయ్యారు. ఈమేరకు విద్యాశాఖ అధికారులు మంగళవారం వారి పేర్లను ప్రకటించారు.

దొనకొండ: దొనకొండ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఫిజికల్ డైరెక్టర్ కె.నర్సింహారావు జిల్లా ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఈసందర్భంగా నర్సింహారావును ఉపాధ్యాయ సిబ్బంది, పలువురు గ్రామస్థులు అభినందించారు.

పంటలలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

కురిచేడు, సెప్టెంబరు 3: అధిక వర్షాలకు పంటలు దెబ్బతినకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. దర్శి వ్యవసాయ పరిశోధనా విభాగం శాస్త్రవేత్త వరప్రసాద్ శాస్త్రవేత్తలతో కలసి మంగళవారం కురిచేడు మండలంలో రైతులు సాగుచేసిన పంటలను పరిశీలించారు. పడమరవీరాయపాలెం గ్రామంలో రైతులు సాగు చేసిన వరి నారు మళ్లను పరిశీలించారు. దేకనకొండ గ్రామంలో పత్తి పంటను పరిశీలించారు. పూతదశలో ఉన్న పత్తిలో తెల్లదోమ, రసం పీల్చు పురుగులు ఎక్కువగా ఆశించే అవకాశం ఉందన్నారు. ఈసందర్భంగా రైతులకు పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో ఏడీఏ బాలాజీ నాయక్, ఉద్యాన శాస్త్రవేత్త శివ, మండల వ్యవసాయాధికారి మధుబాబు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పలుకురాళ్ళ తండాలో పోలేరమ్మ కొలుపులు

ముండ్లమూరు, సెప్టెంబరు 3: మండలంలోని కెల్లంపల్లి పంచాయతీ పరిధిలోగల పలుకురాళ్ళ తండాలో గ్రామ దేవత పోలేరమ్మ అమ్మవారికి మంగళవారం కొలుపు లు నిర్వహించారు. మూడు రోజులుగా పోలేరమ్మ అమ్మవారికి పూజలు నిర్వహించి చివరి రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో భక్తులందరూ ఇళ్ల దగ్గర పొంగళ్ళు పెట్టి నైవేద్యాన్ని తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు.

ధర్నాను జయప్రదం చేయాలి

పామూరు, సెప్టెంబరు 3: వివిధ సమస్యలపై ఈనెల 6న ఒంగోలులో కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి పి.ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఇందుకుసంబంధించిన పోస్టర్లను మంగళవారం స్థానిక జీవైఆర్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వసంస్థలను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం యోచిస్తుందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో వజ్రాల సుబ్బారావు, ఆకుల మోహన్‌రావు, ప్రసాద్, వెంకటరెడ్డి, ఫ్రాన్సిస్, నారాయణ, సుధాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలను సందర్శించిన లాం శాస్త్రవేత్తలు

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 3: సీఎస్‌పురం మండలం శీలంవారిపల్లిలోగల కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలను గుంటూరు లాంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు డాక్టర్ ఏవీ రమణ, డాక్టర్ పి.మునిరత్నం, పి.అనిల్‌కుమార్ మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి పలుసూచనలు చేశారు. డిజిటల్ తరగతి గదులు, హాస్టల్ వసతులు, కంప్యూటర్, ల్యాబ్స్, పంట పొలాలు, స్పోర్ట్స్, విద్యార్థులకు మౌలిక వసతులు గురించి ఆరా తీశారు.

కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కదిరి పార్థసారథి, డీన్ డాక్టర్ నున్నా త్రిమూర్తులు, డాక్టర్ పి.వీరన్న గౌడ్, డాక్టర్ రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచుకోని గ్రామ సచివాలయాలు

- చాలీచాలని భవనాల్లో కొనసాగుతున్నవైనం
- ఇబ్బందులు పడుతున్న సిబ్బంది



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ముండ్లమూరులోని గ్రామ సచివాలయం

ముండ్లమూరు, సెప్టెంబరు 3: మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో లక్షల రూపాయలు వెచ్చించి గ్రామ సచివాలయాలు నిర్మించారు. ఇవి నిర్మించి సంవత్సరాలు దాటినా ప్రారంభానికి నోచుకోలేదు. చాలీచాలని పంచాయతీ భవనాలు, అద్దె భవనాల్లో సచివాలయాలు కొనసాగుతున్నాయి. దీంతో కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది, వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

మండలంలో 17 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. 2020లో వైసీపీ ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసింది. వీటిని నూతన భవనాలు మంజూరుచేయగా ముండ్లమూరు, పోలవరం, ఈదర, వేములబండ-2, శంకరాపురం, నూజెండ్లపల్లిలలో పూర్తయ్యాయి. అయితే, ఇవి ఇంతవరకు ప్రారంభానికి నోచుకోలేదు. ఉమామహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల, సింగనపాలెం గ్రామాల్లో నిర్మించిన సచివాలయాలు అసంపూర్తిగా ఉన్నాయి. మండల కేంద్రమైన ముండ్లమూరులో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే ప్రస్తుతం సచివాలయం కొనసాగుతోంది. ఆ గదులు ఇరుకుగా ఉండటంతో సిబ్బంది పనులు చేయటానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లక్షలాది రూపాయల నిధులు వెచ్చించి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సచివాలయం నిర్మించారు. భవనం పూర్తయి సంవత్సరన్నర దాటిపోయింది. ఇంతవరకు ప్రారంభించకపోవటంతో నిరుపయోగంగా ఉంది. వేముల-2 పంచాయతీలో నిర్మించిన గ్రామ సచివాలయం రమణారెడ్డిపాలెంలో ఉంది. భవనం పూర్తయి ప్రారంభోత్సవానికి ఎదురుచూస్తుంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన కొత్తలో మాత్రం పసుపుగల్లు, పెద ఉల్లగల్లు, కెల్లంపల్లి, మారెళ్ళ గ్రామాల్లో మాత్రమే సచివా లయాలు నిర్మించి ప్రారంభించారు. ఆ తరువాత నిర్మించిన సచివాలయా లు ప్రారంభానికి నోచుకోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారలు స్పం దించి పూర్తయిన గ్రామ సచివాలయ భవనాలను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వరద బాధితుల వేదన వర్ణనాతీతం

- సహాయక కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



వరద బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, సెప్టెంబరు 3: ప్రకృతి విలయం విజయవాడ వాసులను కుదిపేసిందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మంగళవారం పర్యటించి పలు సహాయక చర్యలు చేపట్టారు. వరద ముంపునకు గురైన భవానిపురం, సింగ్‌కాలనీ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఆయన పర్యటించిన ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. గత మూడు రోజులుగా వారు పడుతున్న ఇబ్బందులు వర్ణణాతీతంగా ఉన్నాయన్నారు. వైసీపీ ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారని విమర్శించారు. వరద ఉధృతి తగ్గినా కూడా ఇంకా మోకాలి లోతు నీళ్ళల్లో రోడ్లు, ఇళ్ళల్లో నీటితో జనం ఉన్నారన్నారు. తాను, తన స్నేహితుల సహకారంతో వారికి ఆహారం అందించామన్నారు. ప్రత్యేక మంచినీటి ట్యాంకర్లు తీసుకువచ్చి ప్రతి ఇంటికి మంచినీరు అందించినట్టు డాక్టర్ ఉగ్ర తెలిపారు. వారి ఆకలితీర్చే వరకూ, అవసరాలు తీరేవరకు వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. పరిస్థితి చక్కబడే వరకూ వరద సహాయక చర్యల్లో పాల్గొంటామని చెప్పారు. సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు తమను మానటరింగ్ చేస్తూ సూచనలు చేస్తున్నారని చెప్పారు. కనిగిరి ప్రాంతానికి చెందిన వారు కూడా అక్కడక్కడ ఉన్నారని చెప్పారు. వారిని ఆ పరిస్థితిలో చూసి బాధేసిందన్నారు. వారికి అండగా నిలబడతానన్నారు. ఎమ్మెల్యే వెంట కనిగిరి ప్రాంతానికి చెందిన టీడీపి నాయకులు ఉన్నారు.

అలాగే, మధువన్ గ్రూఫ్‌ఆప్ హోటల్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా భోజనం ప్యాకెట్లను కనిగిరి ఏఎంసీ మాజీ ఛైర్మన్ దారపనేని చంద్రశేఖర్, కాకొల్లు నాగేశ్వరరావు అందజేస్తున్నారు.

విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న దర్శి తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, నగర పంచాయతీ ఛైర్మన్ పిచ్చయ్య తదితరులు

దర్శి, సెప్టెంబరు 3: వరద బాధితుల కోసం దర్శి తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం విరాళాల సేకరణ చేశారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో తిరిగి విరాళాలు సేకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదలతో కృష్ణా, గుంటూరు జిల్లాలు జలమయం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణా నది పొంగటంతో విజయవాడ నీట మునిగి లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారని పేర్కొన్నారు. బాధితులను ఆదుకునేందుకు తమవంతు సహకారంగా కార్యాలయ సిబ్బంది ఒకరోజు వేతనాన్ని విరాళంగా ఇస్తున్నట్లు చెప్పారు. అలాగే, ప్రజల నుంచి విరాళాలు సేకరించి సహాయ నిధికి పంపుతామన్నారు. తొలిరోజు లక్షా 57వేల రూపాయలు విరాళాలు వచ్చినట్టు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ దేవప్రసాద్, దర్శి నగర పంచాయతీ ఛైర్మెన్ పిచ్చయ్య, కమిషనర్ వై.మహేశ్వరరావు, జీవీ రత్నం, తదితరులు పాల్గొన్నారు.

కురిచేడులో.. కురిచేడు, సెప్టెంబరు 3: విజయవాడలో వరద ఉధృతికి ఎంతోమంది ఇబ్బందులు పడుతున్నారని, వారిని ఆదుకునేందుకు అందరూ ముందుకు రావాలని తహసీల్దార్ రజనీకుమారి కోరారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో విరాళాలు సేకరించారు. తన వంతుగా రూ.5 వేలు విరాళం ఇచ్చినట్లు ఆమె తెలిపారు. సిబ్బంది కూడా అందజేశారు. మండల వాసులు కూడా సహృదయంతో విజయవాడవాసులను ఆదుకునేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

తాళ్లూరులో.. తాళ్లూరు, సెప్టెంబరు 3: విజయవాడ వరద బాధితులకు తహసీల్దార్ పి.సింగారావు ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది రూ.20 వేలు సమకూర్చారు. మంగళవారం కార్యాలయంలో సమావేశం ఏర్పాటుచేసి సిబ్బంది నుంచి విరాళాలు సేకరించారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది సేకరించిన నగదును ప్రభుత్వ సహాయనిధికి అందజేస్తామని సింగారావు తెలిపారు.

కనిగిరిలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

- పలుచోట్ల వన్‌వే
- వాహనదారులకు తీరిన కష్టాలు



పార్కింగ్ మార్కింగ్‌తో వాహనాల రాకపోకలకు అనుకూలంగా ఉన్న స్టేట్‌బ్యాంకు రోడ్డు

కనిగిరి, సెప్టెంబరు 3: కనిగిరి పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఎస్ఐ త్యాగరాజు పర్యవేక్షణలో వాహనాల మళ్లింపుతో పాటు వన్‌వేకు శ్రీకారం చుట్టారు. దీంతో ట్రాఫిక్ రద్దీగా ఉండే ప్రధాన రోడ్లలో కొంతమేర వాహనదారులకు ఇక్కట్లు తప్పాయి. పట్టణంలోని స్టేట్ బ్యాంకు, తీగలగొంది, వైఎస్సార్ (ఎండ్లూరి సాల్మనరాజు) రోడ్లల్లో నిత్యం వాహనాలు రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. రోడ్లకు ఇరువైపులా షాపులు ఉండటంతో వాహనాలు ఎక్కడికక్కడ పార్కింగ్ చేస్తున్నారు. దీంతో పోలీసులు పార్కింగ్ మార్కింగ్ వేసి 15రోజులకు ఓవైపు నిబంధనలు విధించి ఆంక్షలు జారీ చేశారు. తీగలగొంది, వైఎస్సార్ రోడ్డులలో వన్‌వే నిబంధనలు పెట్టారు. దీంతో ఓవైపునే వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతోపాటు వాహనాలు పార్కింగ్ కూడా ఓవైపు ఉండటంతో వాహనాల రాకపోకలకు అనుకూలంగా ఏర్పడింది. చెప్పులబజారు, నగరికంటి బసవయ్య సెంటరులో కూడా వన్‌వే ఏర్పాటుతో పాటు పార్కింగ్ ఆంక్షలు విధిస్తే వ్యాపారస్థులకు, వాహనదారులకు ఇబ్బందులు తొలగుతాయని పలువురు కోరుతున్నారు. భారీ వాహనాలను పగటిపూట పట్టణంలోకి ప్రవేశించకుండా ఆంక్షలు విధిస్తే ట్రాఫిక్ సమస్యకు కొంతమేర చెక్ పడుతుందని స్థానికులు భావిస్తున్నారు. ఆంక్షలు ఉల్లంఘించిన వారిపై జరిమానా విధిస్తామని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

ఆక్రమణ స్థలం పరిశీలన



ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న తహీసీల్దార్ సింగారావు

తాళ్లూరు, సెప్టెంబరు 3: పాములకాలనీ వాసులు తాము ఎంతో కాలంగా నివాస ముంటున్న స్థలాన్ని ఎస్సీ కాలనీ చెందిన వ్యక్తి ఆక్రమించారన్న ఫిర్యాదు మేరకు తహసీల్దార్ పి.సింగారావు మంగళవారం పరిశీలించారు. ఆ భూమికి చెందిన పట్టా తనకు ఇచ్చారని ఆక్రమణదారుడు చూపించారు. ఆక్రమణదారునికి ఎస్సీ కాలనీలో నాలుగు ఇళ్లు ఉన్నాయని, అతను చూపే పట్టా నకిలీదని పాముల కాలనీవాసులు తహసీల్దార్‌కు తెలిపారు. ఆ పట్టా ఈ స్థలానికి చెందినది కాదని వీఆర్‌వో తెలిపారు. రికార్డులను పరిశీలించి తగున్యాయం చేస్తామని తహసీల్దార్ కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ బాబురావు, వీఆర్‌వో నాగలక్ష్మి, విలేజ్ సర్వేయర్ మల్లికార్జున పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం బదిలీలు జరిగేనా?

- గ్రేడ్లకు విరుద్ధంగా పంచాయతీ కార్యదర్శుల నియామకంపై సిఫార్సు లేఖలు
- గత ప్రభుత్వ తప్పిదాలను కొందరు కొనసాగిస్తున్న వైనం
- ఏ గ్రేడ్ వారిని ఆ గ్రేడ్ పంచాయతీల్లోనే నియమించాలని ప్రభుత్వ ఆదేశం

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 3: జిల్లాలో గ్రామ పంచాయతీ కార్యదర్శుల బదిలీలపై సందిగ్ధం నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఎలాగైతే అడ్డగోలుగా బదిలీలను చేపట్టారో ఇప్పుడు కూడా అదేవిధంగా చేసేందుకు పంచాయతీ కార్యదర్శులు ప్రజాప్రతినిధులను తప్పుదారి పట్టిస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో నాలుగు గ్రేడ్లు ఉండగా వాటి ఆధారంగా కార్యదర్శులను నియమించాల్సి ఉంది. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో గ్రేడ్-1 పంచాయతీకి గ్రేడ్ 3, 4 కార్యదర్శులను 270 మందిని నియమించారు. అలా పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేశారు. దానిని సరిచేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చర్యలు చేపట్టారు.

ప్రస్తుత బదిలీల్లో ఏ గ్రేడ్ పంచాయతీ కార్యదర్శిని ఆ గ్రేడ్‌లోనే నియమించాలని పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతోపాటు టెలీకాన్ఫరెన్స్‌లో కూడా జిల్లా పంచాయతీ అధికారులకు పదేపదే ఈ అంశంపై దిశా నిర్దేశం చేస్తున్నారు. కానీ క్షేత్రస్థాయికి వచ్చేసరికి లోగ్రేడ్‌లో ఉండే కార్యదర్శి మేజర్ పంచాయతీల్లో పనిచేసేందుకు తనకు అర్హత లేకపోయినా దానిని కప్పిపుచ్చి ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లి సిఫార్సులు చేయిస్తున్నారు. దీంతో ఆ శాఖ అధికారుల్లో ఆందోళన నెలకొంది.

పంచాయతీరాజ్ కమిషనర్ ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం గ్రేడ్-1 పంచాయతీల్లో గ్రేడ్-1 కార్యదర్శులు లేకపోతే గ్రేడ్-2 వారిని నియమించాలి. కానీ అందుకు భిన్నంగా గ్రేడ్-3, 4 కార్యదర్శులు ప్రస్తుత బదిలీల్లో గ్రేడ్-1 పంచాయతీలకు వెళ్లేందుకు ఒత్తిడి తెస్తున్నారు. ఆ మేరకు అధికార పార్టీ నాయకుల నుంచి సిఫార్సులు చేయిస్తున్నారు. దీంతో దిక్కుతోచని అధికారులు ఆ బదిలీల కసరత్తును చేపట్టని పరిస్థితి ఏర్పడింది.

అయితే ప్రభుత్వం తాజాగా బది లీలకు మరో 15 రోజులు గడువు పెంచడంతో పంచాయతీ అధికారులు ఈ విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది.



దర్గాలో పూల చాదర్‌ను అందజేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో దర్గాలో ప్రార్థనలు

పామూరు, సెప్టెంబరు 3: పామూరు మేజర్ పంచాయతీ పరిధిలోని గోపాలపురం గ్రామంలోగల శ్రీహజరత్ సయ్యద్ కరిముల్లాషా ఖాదరీ కాలేషాపీర్ మస్తాన్ వలి స్వామి దర్గాలో అమావాస్య సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు (ఫాతేహాలు) దర్గా ప్రధాన ముజావర్ సయ్యద్ గౌస్‌బాషా నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ నాయకుడు పులి నాయభ ఆధ్వర్యంలో స్వామి వారికి గంధం, పూల చాదర్‌ను సమర్పించి మొక్కులు చెల్లించారు హిందూ ముస్లిం భక్తులు పాల్గొని ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సీఐ ఎం.భీమానాయక్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గాలో ప్రతి అమావాస్య సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు, ప్రతి శుక్రవారం దాతల సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ముజావర్, దర్గా నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాల్లో దేవరపు మాల్యాద్రి, పాలపర్తి రమణయ్య, మస్తాన్, షేక్ ఖాజారహంతుల్లా, మాచర్ల రహిమాన్, హజిమలాన్, సత్తార్, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ భీమా నాయక్

పామూరు, సెప్టెంబరు 3: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సీఐ ఎం.భీమానాయక్ అన్నారు. విద్యపై శ్రద్ధపెట్టి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. మంగళవారం స్థానిక ఒమేగ డిగ్రీ కళాశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాలకు కొందరు విద్యార్థులు అలవాటుపడి తమ జీవితాలను సర్వనాశనం చేసుకుంటున్నారని చెప్పారు. వ్యవనాలకు దూరంగా ఉండి విద్యలో రాణిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో తప్పని సరిగా హెల్మెట్‌లను వాడి ప్రమాదాల నుంచి రక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మూర్తి మహాలక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



వెంకటేశ్వర రెడ్డి(ఫైల్)

తాళ్లూరు, సెప్టెంబరు 3: విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన ఘటన మంగళవారం మండలంలోని కొత్తపాలెంలో చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన కైపు వెంకటేశ్వరరెడ్డి(జగ్గు) ఉదయం పొలంలో పనులు చేసేందుకు వెళ్లాడు. కాలువ ఒడ్డున విద్యుత్ తీగ ఉండటంతో తీసేందుకు ప్రయత్నించగా షాక్‌కు గురై పడిపోయాడు. ఆయన భార్య పక్క పొలంలో ఉన్న రైతులకు తెలపడంతో వారువచ్చి సపర్యలు చేశారు. ఎంతకూ స్పృహ రాకపోవడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షలు చేసి విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడని తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మృతుడు వెంకటేశ్వరరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైసీసీ మండల అధ్యక్షుడు తూము వెంకటసుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ పోశం మధుసూదన్ రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు కరిముల్లా, తదితరులు ఉన్నారు. అలాగే, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

మోసపోయిన రైతులకు న్యాయం చేయండి

ముండ్లమూరు, సెప్టెంబరు 3: మోసపోయిన రైతులకు న్యాయం చేయాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణను ఆదేశించారు. ముండ్లమూరు మండలంలోని పలుగ్రామాలకు చెందిన రైతులు తాళ్లూరు మండలం కొత్తపాలెంకు చెందిన దారం నాగార్జునరెడ్డి చేతిలో మోసపోయారు. సదరు వ్యక్తి ట్రాక్టర్లు ఇప్పిస్తానని నమ్మబలకడంతో లక్షలాది రూపాయలు ఇచ్చి మోసపోయారు. సోమవారం బాధితులు జిల్లా ఎస్పీ దామోదర్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. న్యాయం చేయాలని వేడుకున్నారు. స్పందించిన ఎస్పీ వెంటనే దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణను విచారించి మోసపోయిన బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు.

ఈక్రమంలో ముండ్లమూరు మండలంలోని పసుపుగల్లు, వేంపాడు, వేముల, లక్ష్మీనగర్ గ్రామాలకు చెందిన పలువురు డీఎస్పీని కలసి జరిగిన మోసం గురించి వివరించారు. వెంటనే డీఎస్పీ ముండ్లమూరు ఎస్ఐ నాగరాజును దీనిపై విచారించాలని ఆదేశించారు. ఏడాదిన్నరకు పైగా మండలంలో పలువురు రైతులకు ట్రాక్టర్లతో పాటు రొటోవేటర్లు తక్కువ ధరకే ఇప్పిస్తానని లక్షలాది రూపాయలు నాగార్జునరెడ్డి వసూలు చేశారని ఎస్పీకి తాడి నారాయణరెడ్డి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

డంపింగ్ యార్డులుగా కనిగిరి రోడ్లు



గార్లపేట రోడ్డులో డంప్ చేసిన చెత్త

కనిగిరి, సెప్టెంబరు 3: కనిగిరి పట్టణం చెత్త కుప్పలతో దర్శనమిస్తుంది. పారిశుధ్య చర్యలకు శాశ్వతంగా చర్యలు చేపడుతున్నామని మున్సిపాల్టీ పాలకులు, అధికారులు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా ఉంది. కనిగిరి మున్సిపాల్టీ పరిధిలో 20 వార్డులు ఉన్నాయి. దాదాపు ఆరు (1, 2, 20, 17, 18, 19) వార్డులలో సేకరించిన చెత్తను గార్లపేట రోడ్డులోని సాయిబాబా థియేటర్ పక్కనే డంపింగ్ చేస్తున్నారు.

గతంలో శివనగర్ కాలనీలోని శివారులో చెత్తను డంపిగ్ చేసేవారు. ఆ ప్రాంతంలోని వాటర్‌ప్లాంట్ నిర్వాహకుల పలుకుబడితో శివనగర్ నుంచి గార్లపేట ప్రధాన రోడ్డు వెంబడి జనావాసాల మధ్యకు మార్చారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సేకరించిన చెత్తను తొలగించకపోవటంతో టన్నులకొద్దీ పేరుకుపోయింది. నాలుగు రోజులుగా పడుతున్న వర్షాలతో దుర్వాసన వస్తుందని స్థానికులు వాపోతున్నారు. గతంలో ఈ ప్రాంతంలో చెత్తకుప్ప లేదని, ఊరికి దూరంగా ఉన్నదానిని ఇళ్ళ వద్దకు మార్చటం ఎంతవరకు సబబని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
బుధవారం 4 సెప్టెంబరు 2024



శాంతించిన కృష్ణమ్మ



కొల్లూరు : వరద నీటిలో ఉన్న పెసర్లంక, ఆవులవారిపాలెం, గాజుల్లంక గ్రామాల ఏరియల్ వ్యూ



కొల్లిపర: బొమ్మువానిపాలెం దగ్గర పడవపై గ్రామం నుంచి బయటకు వస్తున్న బాధితులు



కొల్లూరు : వరద ఉధృతికి వాలిపోయిన అరటి తోట



సోమవారం అర్ధరాత్రి కరకట్టను పరిశీలిస్తున్న రెవెన్యూ శాఖ, విద్యుత్‌శాఖ మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ తదితరులు



కొల్లూరు కరకట్ట వద్ద పడవల ద్వారా మంచినీరు, ఆహార పొట్లాల సరఫరాను పరిశీలిస్తున్న మంత్రులు, అనగాని, గొట్టిపాటి కలెక్టర్, వెంకట మురళి, ఎంపీ కృష్ణప్రసాద్ ఎమ్మెల్యే ఆనందబాబు



పెనుమూడి శిబిరంలో ఉన్న మహిళలతో మాట్లాడుతున్న మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్

తగ్గుముఖం పడుతున్న ఉధృతి


- ఊపిరి పీల్చుకుంటున్న ప్రజలు
- వెలుగు చూస్తోన్న 'కన్నీటి' కష్టాలు
- కరకట్టకు గండ్లు, లీకులపై తొలుత ఆందోళన
- కలిసొచ్చిన సమన్వయం.. చర్యలతో తప్పిన గండం
- అర్ధరాత్రి దాటాక కరకట్టలను పరిశీలించిన మంత్రులు
- బ్యారేజి దిగువున ముంపులోనే లంకలు.. అల్లాడుతున్న ప్రజలు

మహోగ్రంగా ముంచుకొస్తోన్న కృష్ణమ్మ శాంతించింది. వర్షాలకు తోడు, పొంగి పొర్లుతున్న వాగులతో నిండుగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ ఉధృతి మంగళవారం మధ్యాహ్నం కొంతమేర తగ్గింది. నాగార్జున సాగర్ జలాశయం ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో మంగళవారం మధ్యాహ్నం నుంచి రాత్రికి సగానికి సగం పడిపోయింది. వరద ప్రవాహం సుమారు 2 లక్షల క్యూసెక్కులకుపైగా తగ్గింది. దీంతో నదీ పరివాహక గ్రామాలు, ప్రకాశం బ్యారేజి దిగువ లంకల్లోని ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఇప్పుడిప్పుడే పరిస్థితులు కొలిక్కి వస్తున్నాయి. ప్రమాదకర పరిస్థితుల నుంచి బాధితులు ఇప్పుడిప్పుడే తెరుకుంటున్నారు. సోమవారం అర్ధరాత్రి నుంచి మంత్రులు, జిల్లా స్థాయి అధికారులు కరకట్ట వెంబడి జాగ్రత్తలు తీసుకుంటూ ఎక్కడా గండి పడకుండా, లీకులు సంభవించకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు. ఇదే సమయంలో వరద ఉధృతి తగ్గడం.. బుధవారానికి ప్రవాహం ఇంకా తగ్గవచ్చన్న జలవనరుల శాఖ అంచనా నేపథ్యంలో అధికారులు, ప్రజాప్రతినిధుల్లో టెన్షన్ తగ్గింది. లంకల్లో ఒక్క రోజులోనే మూడు అడుగుల మేర నీరు తగ్గుముఖం పట్టింది. కలిసి నడిచిన అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, చేయిచేయి కలిపిన గ్రామస్థుల కారణంగా పెనుగండం తప్పిందని భావించారు. అయితే ప్రవాహం తగ్గడంతో ఇప్పడిప్పుడే నష్ట పరిణామాలు వెలుగుచూస్తున్నాయి. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేయాల్సి ఉంది. ప్రజలు తేరుకుంటున్నా వరద కారణంగా ఇళ్లు, పశుపక్షాదులు, పంటలకు జరిగిన నష్టంపై ఆందోళన చెందుతున్నారు.

తెనాలి, బాపట్ల, నరసరావుపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ ఎప్పుడు కరకట్టను కోసేస్తుందోనని.. ఎక్కడ గండిపడుతుందోనని.. ఎప్పుడు ఏ ఊరిపై వరద ప్రవాహం పడుతుందోనని బిక్కు బిక్కుమంటూ ఉన్న ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఎప్పుడు.. ఎక్కడ.. ఎలాంటి ముప్పు ముంచుకొస్తుందోనని ఆందోళన చెందినా ఆ పరిస్థితి లేకుండా పోయింది. పట్టపగ్గాలు లే కుండా.. ప్రవాహ ఉధృతితో పరుగులు పెడు తున్న కృష్ణమ్మ శాంతించింది. మంగళవారం నాగార్జున సాగర్ జలాశయం వద్ద వరద తగ్గు ముఖం పట్టింది. దీంతో అటు ప్రజలు, ఇటు అధికారులు, మంత్రులు, ఇతర ప్రజాప్రతిని ,ధులు ఊపిరి పీల్చుకున్నారు. మంగళవారం సాయంత్రం నుంచి ప్రమాదకర పరిస్థితుల నుంచి బాధితులు తెరుకుంటున్నారు. నదీ తీరం వైపు వెళ్లకుండా ఎక్కడికక్కడ పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు చర్యలు తీసుకుం టున్నారు. బుధవారానికి వరద ప్రవాహం ఇంకా తగ్గవచ్చని అంచనా. సోమవారం వరకు 11.43 లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తే, అదే రోజు రాత్రి నుంచి వరద ఉధృతి తగ్గుతూ వస్తోంది. ప్రకాశం బ్యారేజి దగ్గర మంగళవారానికి 6.74 లక్షల క్యూసెక్కులకు వరద ప్రవాహం తగ్గింది. అటు పులిచింతల నుంచి కూడా మంగళవారం సాయంత్రం వరకు 4.20 లక్షల వరకు వరద నీటిని బ్యారేజికి విడుదల చేసినా, దానిని కూడా 3.87 లక్షల క్యూసెక్కులకు తగ్గించారు. అటు మునేరు, పాలేరు, కీసర వంటి వాగుల నుంచి కూడా వరద తగ్గిపోయింది. వర్షాలు కూడా లేకపోవడంతో వాగుల నుంచి ప్రస్తుతం లక్ష క్యూసెక్కుల లోపే వరద నీరు బ్యారేజికి చేరుతోంది. బుధవారానికి వరద మరింత తగ్గిపోతుందని, ఆందోళన చెందాల్సిన పనిలేదని అధికారులు చెప్తున్నారు. అమరావతి, అచ్చంపేట, రెంటచింతల మండలాల్లోని లంక గ్రామాల్లో పరిస్థితులు ఇప్పుడి ప్పుడే అదుపులోకి వస్తున్నాయి. లంక గ్రామాల్లో ముంపు అంత వేగంగా తగ్గడంలేదు. ప్రకాశం బ్యారేజి దిగువున తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర, కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలోని కరకట్టకు లోపల ఉన్న ఊళ్లన్నీ వరద ముంపులోనే ఉన్నాయి. కొల్లిపర, కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని లంక గ్రామాల్లోని ఇళ్లు నాలుగు రోజులుగా నీటిలో నానిపోయి ఉన్నాయి. ఏ ఇల్లు ఎప్పుడు కూలుతుందోనని పాత ఇళ్ల వారు భయపడుతున్నారు. ఇప్పుడిప్పుడే ముంపు నుంచి కొన్ని గ్రామాలు, లంకలు, అందులోని ఇళ్లు బయటపడుతున్నా నీరు బయటకు పోయిన తర్వాత మట్టి కూడా పేరుకుని, దానిని శుభ్రం చేసుకోవడం కష్టతరమని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఆయా మండలాల పరిధిలో చాలాచోట్ల ఇంకా రహదారులు బయటపడలేదు. పలు ప్రాంతాల్లో ఇంకా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాకపోవడంతో విష సర్పాలు, దోమలతో ప్రజలు అల్లాడుతున్నారు. నీటిలో మూడు రోజులుగా చిక్కుకుపోయిన గ్రామాల వారికి అధికారులు ఆహారం, తాగునీటి డబ్బాలను మంగళవారం కూడా సరఫరా చేశారు. అయితే ఇవి అందరికీ సక్రమంగా చేరడంలేదని పలువురు ఆవేదన చెందుతున్నారు. జనం పరిస్థితి ఇలా ఉంటే.. మూగజీవాల కష్టాలు వర్ణనాతీతమే. వరద ఉధృతికి చాలా ఊళ్లలోని వాములు కొట్టుకుపోయాయి. మంగళవారం కూడా రోడ్లపైనా నీరు ప్రవహిస్తుండడంతో ఇళ్లలో నుం చి ప్రజలు బయటకు రాలేకపోయారు. పశువులను మెరకల్లో కట్టేసే పరిస్థితిలేదు. వరదల కా రణంగా గుంటూరు జిల్లాలోని 11 మండలాలు వరద, వర్ష ప్రభావానికి గురికాగా 75,153 మంది ప్రజలు ఇబ్బందులు పడగా 35,345.2 హెక్టార్లలో నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథ మిక అంచనా వేశారు.

లీకులు.. పోటుతోఆందోళన..

కరకట్టలకు సమాంతరంగా సాగుతున్న నీటి ప్రవాహం ఓ వైపు.. లీకులతో నీటి చెమ్మలు కరకట్టలపైకి ఎగతన్నడం.. లీకుల గుర్తింపు.. మరోవైపు అమావాస్య ప్రభావంతో సముద్రంలో పోటుతో.. ఎప్పటికి వరద ముంపు తగ్గుతుందోనని ప్రజల నుంచి ప్రజాప్రతినిధులు వరకు కలవరపడ్డారు. కట్టలకు గండిపడే అవకాశం ఉంది అప్రమత్తంగా ఉండాలనే ముందస్తు హెచ్చరికలు.. గంటగంటకు పెరుగుతున్న నీటి ప్రవాహం నేపథ్యంలో కరకట్టలకు తాత్కాలిక మరమ్మతులతో ముప్పు తప్పింది. ఈ కృతువులో ఆయా గ్రామాల ప్రజలు, అధికారు లు రాత్రి పగలు అన్న తేడా లేకుండా భాగస్వాములయ్యారు. రేపల్లె ప్రాంతంలో 2009 నాటి పరిణామాలు సంభవించే ప్రమాదం ఉందన్న ఆందోళన నెలకొన్నా.. ముప్పు తప్పేలా అందరూ కలిసికట్టుగా జాగ్రత్తలు తీసుకున్నారు. సోమవారం అర్ధరాత్రి దాటే వరకు కూడా కరకట్టల వద్దే అధికారులు ఉండగా మంత్రులు అనగాని, సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు కరకట్టల పరిస్థితిని పరిశీలించారు. బ్యారేజీ ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో అధికారులతో పాటు ప్రజలు పెను గండం తప్పినట్లైందని ఊపిరి పీల్చుకున్నారు. రావి అనంతవరం, పెదపులివర్రు తదితర ప్రాంతాల వద్ద లీకులను గుర్తించిన వెంటనే పూడ్చేశారు. రైతుల సహకారం తీసుకుని, అధికారులను సమన్వయ పరిచి ఇసుక బస్తాలు, కంకరను తరలించి కరకట్టను ఎక్కడికక్కడ తాత్కాలికంగా పటిష్ఠ పరిచే పనులను చేపట్టడంతో గండం గట్టెక్కారు.



తాగునీరు కోసం పై అంతస్తులో నిలబడి ఎదురుచూస్తున్న తిప్పలకట్ట గ్రామస్థులు


మరో 48 గంటలు అప్రమత్తంగా ఉండాలి

వరద పరిస్థితిపై అన్ని శాఖల అధికారులతో రేపల్లె ఎంపీడీవో కార్యాలయంలో మంత్రులు, కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ డూడీ, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుతో సమీక్షించారు. అధి కారులు సకాలంలో స్పందించి కృషి చేయడం వల్లే ఎక్కడా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మరో 48 గంటల పాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నదిలో వరద ఉధృతి పూర్తిగా తగ్గేవరకు అధికారులు అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలు తీసుకోవాలన్నారు. వరద ఉధృతికి కరకట్ట బలహీనపడిన ప్రాంతాలను పరిశీలించి కరకట్ట బలోపేతానికి కృషి చేయాలన్నారు. లంక గ్రామాల్లో 1000 మంది లైన్‌మన్లను పంపించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామన్నారు. బురద, చెత్తను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని బాపట్ల కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. జల దిగ్బంధంలో చిక్కుకున్న 24 గ్రామాల్లోని 24 వేల మందికిపైగా జనం ఇబ్బందులు పడకుండా జనరేటర్లు, విద్యుత్ దీపాలు, ఆహార పదార్థాలు, లైఫ్ జాకెట్లు, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచామన్నారు. నాలుగు చోట్ల కరకట్ట బలహీనపడి లీక్ అవుతున్నా గ్రామస్తుల సహకారంతో యుద్ధ ప్రాతిపదికన నివారించగలిగామన్నారు. రేపల్లె మండలం పెనుమూడిలోని పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని మంత్రులు సందర్శించి బాధితులకు అందుతున్న సేవల గురించి ఆరా తీసి అధికారులకు పలు సూచనలు చేశారు. సోమవారం అర్ధరాత్రి కరకట్టను పరిశీలించి బలహీనంగా ఉన్న ప్రాంతాలను ఇసుకగోతాలతో పటిష్ఠం చేయాలని మంత్రులు అధికారులకు సూచించారు.

బాధితులకు అండగా ఉంటాం

- మంత్రి మనోహర్

వరద బాధితులను ప్రభుత్వ పరంగా అన్ని విధాలా ఆదుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కొల్లిపర మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన మంత్రి ముంపు గ్రామాల్లో మూడో రోజు కొనసాగుతున్న సహాయక చర్యలను పరిశీలించారు. కరకట్ట కోతలపై అప్రమత్తంగా ఉండాలని అధికారులకు తెలిపారు. ప్రవాహం తగ్గే వరకు కరకట్టను పరిశీలిస్తూ ఉండాలని ఆదేశించారు. నదికి వరద ఉధృతి తగ్గేవరకు ప్రజలకు అండగా ఉంటామన్నారు. వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి బి.రాజశేఖర్ కొల్లిపర మండలం అత్తలూరివారిపాలెం, వల్లభాపురం, దంతలూరు, అత్తోట గ్రామాల్లోని పంటలను డైరెక్టర్ ఢిల్లీరావు, శాస్త్రవేత్తలతో కలిసి పరిశీలించారు.



కొల్లూరు కరకట్ట దిగువున తగ్గని వరద ఉధృతి



రేపల్లె : పల్లెపాలెంలో తగ్గిన వరద ఉధృతి



కొల్లూరు: పోతార్లంకలో నీట మునిగిన విష్ణాలయం

మిర్చి యార్డులో.. కలకలం

- సెక్రెటరి, సిబ్బందితో బృందం భేటీ
- చెక్‌లిస్టు ప్రకారం ఫైళ్లు కావాలని ఆదేశాలు
- త్వరలో అవినీతి, అక్రమాలు నిగ్గు తేలే అవకాశం
- అప్పటి పాలకులు, అధికారుల గుండెల్లో గుబులు
- కమీషన్ వ్యాపారుల వాంగ్మూలాల నమోదుకు చర్యలు

గుంటూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో విజిలెన్స్ అధికారుల బృందం తనిఖీలకు రావడం కలకలం సృష్టించింది. ఆంధ్రజ్యోతి ముందే చెప్పిన విధం గా మంగళవారం ఉదయం ప్రాంతీయ నిఘా కార్యాలయం అధి కారులు యార్డు పరిపాలన భవనానికి చేరుకుని సెక్రెటరి ఐ వెంకటేశ్వరరెడ్డితో భేటీ అయ్యారు. తొలుత యార్డు కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం 2014-19 మధ్య జరిగిన వ్యవహారాలకు సంబంధించి తమకు ఫైళ్లు, డాక్యుమెంట్లు అందజేయాలని ఒక చెక్‌లిస్టును అందజేశారు. ఉదయం, మధ్యాహ్నం కూడా విజిలెన్స్ అధికారులు మిర్చియార్డులోనే ఉండి సమగ్రంగా వివరాలు సేకరించడం ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ దృష్టి సారించిందన్న సమాచారం యార్డు వర్గాల్లో మంగళవారం అంతా చర్చనీయాంశంగా మారింది. టీడీపీ మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, మిర్చియార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు ఇటీవలే విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ హరీష్‌కుమార్‌గుప్తాని కలిసి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై డీజీ విచారణకు ఆదేశించడంతో ప్రాంతీయ కార్యాలయం సీఐ ఏ శ్రీహరిరావు, తహసీల్దార్ కే నాగమల్లేశ్వరరావు, మరో ముగ్గురు సిబ్బందితో ఒక టీమ్‌ని నియమించారు. ఆ మేరకు విజిలెన్స్ బృందం తొలుత యార్డు పరిపాలన భవనానికి చేరుకుని తమ విచారణని ప్రారంభించింది. 2019 జూన్, జూలై, ఆగస్టులో 5 లక్షల మిర్చి టిక్కీలను ఈ-నామ్‌లో నమోదు చేయలేదు. వీటి విలువ రూ.కోట్లలోనే ఉంటుంది. అప్పట్లో ఆరోపణలు రాగా దీనిపై మొక్కుబడి విచారణ జరిపి ఏ ఒక్క అధికారిపై చర్యలు తీసుకోకుండా మూసేశారని విజిలెన్స్‌కు ఫిర్యాదు అందింది. ఈ వ్యవహారంలో అప్పటి సెక్రెటరితో పాటు 10 మంది సూపర్‌వైజర్ల పాత్ర ఉన్నట్లు ఆరోపణలున్నాయి. దీనికి సంబంధించిన రికార్డులను విజిలెన్స్ అధికారులు కోరారు. ప్రధానంగా 2023లో కేవలం రెండు నెలల వ్యవధిలో జరిగిన కమీషన్ వ్యాపారుల 400 రెన్యువల్స్, 180 వరకు జరిగిన పార్టనర్‌షిప్ డీడ్‌లకు సంబంధించి భారీగా నగదు చేతులు మారినట్లు విజిలెన్స్‌కు ఫిర్యాదు అందడంతో దీనికి సంబంధించిన ఫైళ్లను తమకు పంపాలని ఆదేశించారు. కమీషన్, ఎక్స్‌పోర్టు లైసెన్సులు ఏ విధంగా ఇస్తారు. వాటి విధి విధానాలను తెలియజేయాలని కోరారు. అలానే యార్డులో వేమెన్ల వ్యవస్థ గురించి, మచ్చుకాయల మాఫియా గురించి వాకబు చేశారు. యార్డులో గేట్ల వద్ద ఏర్పాటు చేసిన వే్బ్రిడ్జిలలో ఒక్కటి కూడా పని చేయకపోవ డంపై ఆశ్చర్యానికి గురయ్యారు. యార్డులోకి వచ్చే సరుకుకు సక్రమంగా అకౌంటబిలిటీ లేకపో వడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నదని గుర్తించారు. లైసెన్సులను వేరే వ్యక్తులకు లీజుకు ఇవ్వడం వంటి వివరాలు కూడా వివిధ వర్గాల నుంచి సేకరించారు. జీఎస్‌టీ రూపంలో ఆదాయానికి పడిన గండి గురించి వివరాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారులు మాట్లాడుతూ తాము ఫైళ్లన్నింటిని తెప్పించుకుని క్షుణ్ణంగా పరిశీలించి ఆ తర్వాత వ్యాపారులు, ఉద్యోగుల వాంగ్మూలాలు నమోదు చేస్తామన్నారు. చివరిగా అవినీతి, అక్రమాలపై ప్రభుత్వానికి నివేదిక పంపుతామని చెప్పారు.



మిర్చియార్డులో తనిఖీలకు వచ్చిన విజిలెన్స్ అధికారులు

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

- అవార్డు గహీతలకు రేపు బాపట్లలో పురస్కారాలు

బాపట్ల, సెప్టెంబరు 3: గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయిలో ఉత్త మ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన వారి జాబితాను జిల్లా విద్యాశాఖాధికారి కె.నారాయణ రావు మంగళ వారం ప్రకటించారు. గురువారం ఉదయం బాపట్లలోని అన్నం సతీష్ ప్రభాకర్ కాపు కల్యాణ మండపంలో జరిగే వేడుకల్లో ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేసి, సత్కరించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన 15 మంది వివరాలు.. బీ బధిరిరెడ్డి(అక్కాయపాలెం హైస్కూల్, వేటపాలెం మండలం), పి.సాంబశివరావు(ప్యాపర్రు హైస్కూల్ అమర్తలూరు మండలం), కె.పద్మావతి (కుంకులమర్రు హైస్కూల్, కారం చేడు మండలం), ఇ.శామ్యూల్ (బాపట్ల మున్సిపల్ హైస్కూల్), పి.పూర్ణచంద్ర రావు(జాండ్రపేట గవర్నమెంట్ హైస్కూల్, చీరాల), పి.జ్యోతినిర్మల(చక్రాయపాలెం హైస్కూ ల్ అద్దంకి మండలం), పివి.రామారావు (బాలికల ఉన్నత పాఠశాల, వేటపాలెం), కె.రామయ్య(రాజీవ్‌నగర్ కాలనీ స్కూల్, అద్దంకి మండలం), టి.పద్మావతి (బాలవారిపాలెం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, నిజాంపట్టణం మండలం), ఎం.ధనలక్ష్మి (ఎంపీయూ పీఎస్, సివిల్‌స్ట్రీట్ అద్దంకి మండలం), ఎస్.నరసింహారెడ్డి(ఎం పీపీ ఎస్ స్వర్ణపాలెం, కారంచేడు మండలం), పి.శ్రీనివాసరావు (ఎంపీ పీఎస్ కుంకులమర్రు, కారంచేడు మండలం), జి.శ్రీనివాసరావు(ఎంపీయూపీఎస్ చెన్నుపల్లి, బల్లికురవ మండలం), షేక్.జాన్‌బాషా(ఎంపీపీఎస్, ద్రోణాదుల మార్టురు మండలం), ఎ.ఉమామహేశ్వరరావు (బాపట్ల, ఏవీవీ స్కూల్, డ్రాయింగ్ మాస్టర్)లను ఎంపిక చేశారు. వీరంతా 5వ తేది ఉదయం కల్యాణ మండలంలో ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని డీఈవో సూచించారు.

వరద బాధితులకు బాసటగా..

ప్రత్యక్ష సహాయ కార్యక్రమాల పర్యవేక్షణలో మంత్రి డాక్టర్ స్వామి

జిల్లా నుంచి భారీగా ఆహార పొట్లాలు

మంచినీరు, ఇతర ఆహార పదార్థాలు సరఫరా

కలెక్టర్ నేతృత్వంలో రెండు రోజుల్లో లక్షా 25వేల ప్యాకెట్లు

ఎమ్మెల్యే జనార్దన్ ఆధ్వర్యంలో 30వేల పార్సిల్స్

ఒంగోలు, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): మూడు నాలుగు రోజుల పాటు ఎడతెరపి లేని వర్షం బెజవాడ నగరాన్ని ముంచెత్తింది. అదేసమయంలో ఎగువన కురిసిన భారీవర్షాలతో ఒకవైపు కృష్ణమ్మ, మరోవైపు బుడమేరు ఉగ్రరూపం దాల్చి చాలా ప్రాంతాలను ముంచెత్తాయి. లక్షలాది మంది వరదనీటిలో రోజులు తరబడి చిక్కుకొని తినడానికి తిండి లేక, తాగడానికి నీరు లేక అల్లాడుతున్నారు. స్వయంగా రంగంలోకి దిగిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నా స్థానికంగా ఆహారం దొరికే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో సమీప జిల్లాల నుంచి ఆహారం, మంచినీరు, ఇతరత్రా పంపించాలన్న సంకేతాలు ప్రభుత్వం నుంచి అందాయి. దీంతో కలెక్టర్ అన్సారియా తక్షణం స్పందించారు. అందుబాటులో ఉన్న అధికారులతో సమీక్షించి వెంటనే నగరంలోని రెండు కళ్యాణ మండపాలను తీసుకొని ఆదివారం రాత్రి నుంచి వంట ప్రారంభింపజేశారు. సోమవారం మధ్యాహ్నం 25వేలు, రాత్రికి మరో 50వేల ప్యాకెట్ల పలావు, పులిహోర, పెరుగన్నం, అలాగే 50వేల మంచినీటి ప్యాకెట్లు, వేలాది బిస్కెట్ ప్యాకెట్లు విజయవాడకు పంపించారు.



వరద బాధితులతో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ స్వామి

కలెక్టర్ ప్రత్యేక చొరవతో..

జిల్లా తరఫున జేసీ గోపాలకృష్ణ, డీఎస్‌ఓ ఉదయభాస్కర్ మరి కొంత మంది రెవెన్యూ సిబ్బంది కూడా అక్కడికి వెళ్లి సహాయక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. జిల్లా నుంచి 35 బోట్లను పంపించారు. సోమవారం సాయంత్రం నుంచి నగరంలోని ప్రధానమైన హోటళ్ల నిర్వాహకులు, అలాగే జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని పరిశ్రమాధిపతులు, ఇతరత్రా వర్గాల వారు అధికారులను సంప్రదించి వారి నుంచి సహకారం పొందడం ద్వారా మంగళవారం మరో లక్షా 20వేల ఫుడ్ ప్యాకెట్లను విజయవాడకు పంపించారు. ఒంగోలుతోపాటు మార్కాపురం, కొండపి, దర్శి తదితర ప్రాంత రెవెన్యూ అధికారులు పనిలో నిమగ్నం కాగా కలెక్టర్ అన్సారియా మంగళవారం నగరంలో వంట చేస్తున్న కళ్యాణ మండపాల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఆహారం రుచి చూసి మరి లారీలలో పంపించారు.

వాయు

గుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న భారీ వరద నీటితో అతలాకుతలమైన విజయవాడ వాసులకు బాసటగా జిల్లా ప్రజానీకం నిలుస్తున్నారు. ఇప్పటికే లక్షలాది మంది మునకలోనే ఉండిన నేపథ్యంలో వారికి ఆహారం, మంచినీరు అందించేందుకు యంత్రాంగంతో పాటు దాతలు ముందుకొచ్చారు. ప్రభుత్వం తరఫున మంత్రి డాక్టర్ స్వామి ప్రత్యక్షంగా విజయవాడలోని పలు ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. అదేసమయంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రత్యేక చొరవ చూపి జిల్లా యంత్రాంగం ద్వారా వివిధ వర్గాల సహకారంతో వేలాది ఫుడ్ ప్యాకెట్లు, మంచినీరు, ఇతర ఆహార పదార్థాలు అక్కడకు పంపిస్తున్నారు. అలాగే మంగళవారం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చొరవ తీసుకొని భారీగా ఫుడ్ ప్యాకెట్లు పంపించారు.

సహాయక చర్యలలో మంత్రి

ఇక జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి డాక్టర్ స్వామి సోమవారం సాయంత్రం విజయవాడలో జరిగిన సమీక్షకు హాజరయ్యారు. ప్రభుత్వ పెద్దల సూచనలతో మంగళవారం సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ఇబ్రహీం పట్నం మండలం మూలపాడు, కొండాపల్లి, విజయవాడ నగరంలోని చిట్టినగర్ ప్రాంతంలో పర్యటించి బాధిత ప్రజలను ఓదార్చారు. కొండపల్లి చిట్టినగర్‌లోని పునరావాస కేంద్రాలను సందర్శించారు. నష్టపోయిన పంటలను పరిశీలించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని బాధితులకు భరోసా ఇచ్చారు.



ఆహారం ప్యాకింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఎమ్మెల్యే దామచర్ల ఆధ్వర్యంలో..

మరోవైపు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చొరవ చూపి 30వేల ఆహార ప్యాకెట్లు, 20వేల బాటిళ్ల మంచినీరు, భారీగా బిస్కెట్ ప్యాకెట్లు విజయవాడకు పంపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం రాత్రి నుంచే వంట ప్రారంభించి ఆహారాన్ని ప్యాకింగ్ చేశారు. మంగళవారం ఉదయం మూడు లారీలలో వాటిని నింపారు. ఆ లారీలను ఎమ్మెల్యే జెండా ఊపి వరద ప్రాంతానికి పంపారు. అలాగే సహాయక చర్యలలో పాల్గొనేందుకు పలువురు కార్యకర్తలను విజయవాడకు పంపారు. ఇక ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు నేతృత్వంలోనూ వేలాది ఆహార ప్యాకెట్లను విజయవాడలోని పారిశుధ్య కార్మికులకు అందించేందుకు పంపించారు

తరలిన పారిశుధ్య కార్మికులు

మరోవైపు వరద నీరు తగ్గాక అత్యవసర పారిశుధ్య పనుల కోసం ఒంగోలు కార్పొరేషన్ నుంచి 150 మంది కార్మికులను మంగళవారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్సులలో విజయవాడకు పంపించారు. మరికొన్ని ప్రాంతాల ప్రజలు వివిధ రూపాలలో తమవంతు సాయాన్ని అందించే పనిలో ఉన్నట్లు తెలుస్తుండగా బుధవారం కూడా మరికొన్ని ఆహార ప్యాకెట్లు పంపించే విధంగా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నారు.

మేమున్నాం..

వరద బాధితుల కోసం ముందుకొచ్చిన విద్యాశాఖ కార్యాలయ ఉద్యోగులు

10 వేల ఆహార, 10వేల వాటర్ బాటిళ్లు సిద్ధం

ప్రత్యేక వాహనాల్లో తరలింపు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 3: విజయవాడలో వరద ముంపు బాధితులకు మేమున్నామంటూ జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఉద్యోగులు ముందుకొచ్చారు. డీఈఓ డి.సుభద్ర ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడకు పది వేల పులిహోర ప్యాకెట్లు, పదివేల వాటర్ బాటిళ్లను ప్రత్యేకంగా స్కూల్ బస్సులను ఏర్పాటు చేసి తరలించారు. డీఈఓ కార్యాలయంలో పనిచేసే అధికారులు, ఉద్యోగులందరూ కలిసి ముంపు బాధితులకు తమవంతు సహాయపడ్డారు. ఇందుకు వివిధ విద్యాసంస్థల యాజమాన్యాలు కూడా సహకారం అందించాయి. తరలించిన ఆహారం ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను విజయవాడలోని స్టేడియంలో అక్కడి అధికారులకు అందజేశారు.



విజయవాడకు పంపేందుకు సిద్ధం చేసిన వాటర్ బాటిల్స్

ఆపన్నుల కోసం మేము సైతం..

బాధితులకు చేయూతగా అద్దంకి, పర్చూరు నేతలు

లంక, ముంపు గ్రామాల్లో మంత్రి రవికుమార్ సేవలు

విజయవాడలో ఎమ్మెల్యే ఏలూరి

అద్దంకి, పర్చూరు నుంచి భారీగా ఆహార పొట్లాలు, పాలప్యాకెట్లు

చనిపోయిన విద్యుత్ ఉద్యోగి కుటుంబానికి అండగా ఉంటాం : మంత్రి రవికుమార్

సోలార్ లైట్ల పంపిణీ

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

వరద బాధితులకు చేయూత కార్యక్రమాల్లో మంత్రి, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నిమగ్నమయ్యారు. అంతే కాక వారు బాధ్యతలు వహిస్తున్న నియోజకవర్గాల నుంచి బాధితులకు ఆహార పొట్లాలు, పాల ప్యాకెట్లు, నీళ్ల బాటిళ్లతో పాటు ఇతరత్రా అవసరమైన ఆహార పదార్థాలను భారీగా సరఫరా చేస్తున్నారు. మంత్రి గొట్టిపాటి మూడు రోజుల నుంచి బాపట్లలోనే ఉంటూ ముంపునకు గురైన లంక గ్రామాల్లో రేయింబవళ్లు తిరుగుతూనే అద్దంకి నుంచి భారీగా విజయవాడకు ఆహార పొట్లాలు పంపించారు. అలాగే ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విజయవాడలోని కొన్ని వరద ముంపు ప్రాంతాల్లో బాధితులకు సహాయక చర్యల బాధ్యతలు తీసుకొని పనిచేస్తున్నారు.గడిచిన రెండు రోజుల్లోనే ఈ రెండు నియోజకవర్గాల నుంచి లక్షమందికి పైగా అవసరమైన ఆహారాన్ని విజయవాడ బాధితులకు సరఫరా చేశారు.

ముంపు గ్రామాల్లోనే రవికుమార్

రవికుమార్ సొంత బాపట్ల జిల్లాలోని బాపట్ల, రేపల్లె ప్రాంతాల్లో ఉన్న వరద, ముంపు, లంక గ్రామాల్లో సేవలందించే కార్యక్రమాల్లో ఉన్నారు. మంగళవారం తెల్లవారుజామున 3 గంటల వరకు ఆయన అటు ముంపు గ్రామాల్లోను ఇటు పునరావాస కేంద్రాల్లోను పర్యటిస్తూ బాధితులకు అవసరమైన చేయూతనిస్తూ కనిపించారు. మంత్రి, రేపల్లె ఎమ్మెల్యే అయిన సత్యప్రసాద్‌తో పాటు బాపట్ల, వేమూరు ఎమ్మెల్యేలను కలుపుకొని ఆయన అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. ముంపు గ్రామాల్లో ఎదురైన విద్యుత్ సమస్యలు దృష్టిలో ఉంచుకొని తాత్కాలిక వెలుగు కోసం సోలార్ లైట్ల పంపిణీకి శ్రీకారం పలికారు. సోమ, మంగళవారాల్లో 1500 లైట్లు ఆయన తెప్పించి ఆయా ప్రాంతాలకు పంపారు.





విజయవాడ ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలను సమీక్షిస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే ఏలూరి

ఉద్యోగి కుటుంబానికి అండగా

విజయవాడలో వరద ముంపు ప్రాంతాల్లో బాధ్యతలు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తూ మృతి చెందిన కుటుంబానికి మంత్రి రవికుమార్ అండగా నిలిచారు. మాజీ మంత్రి దేవినేని ఉమా ద్వారా విషయం తెలుసుకున్న గొట్టిపాటి మృతి చెందిన ఉద్యోగి భార్యతో ఫోన్‌లో మాట్లాడి ఆమెకు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాక సంస్థ ద్వారా వచ్చే సాధారణ ఆర్థిక చేయూతకు తోడు రూ.10 లక్షల తక్షణ సాయంగా అందించేందుకు ఏర్పాట్లు చేశారు.

ఏలూరి సేవలు

సోమవారం నుంచి పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వరద ప్రాంతాల్లో బాధితులను ఆదుకునే కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. సితార సెంటర్‌లో సేవా కార్యక్రమాల బాధ్యతలు చేపట్టిన ఆయన మూడు ప్రాంతాల బాధితుల కోసం ని యోజకవర్గం నుంచి భారీగా ఆహార పొట్లాలను అక్కడకు తెప్పించుకున్నారు. ఆయన సూచనలతో నియోజకవర్గానికి చెం దిన ఎన్ఆర్ఐలు, మరికొందరు నేతలు ముందుకు వచ్చి ఒక్కరోజులోనే 50వేల మందికి సరిపడా ఆహారాన్ని సిద్ధం చేశారు. మంచినీళ్ల బాటిల్స్ తెప్పించుకున్న ఏలూరి తాను బాధ్యతలు తీసుకున్న ప్రాంతంలో బాధితులకు అందజేస్తున్నారు.

దొడ్డవరం సొసైటీలో కుంభకోణం

అరకోటికిపైగా నిధులు స్వాహా

వంద రసీదుల పుస్తకాలు గల్లంతు

రుణ బకాయిలు, షేర్ ధనం స్వాహా

లాభాల నుంచి నష్టాల్లోకి పీఏసీఎస్

విచారణకు ఆదేశించిన డీసీవో

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 3 : మద్దిపాడు మండలం దొడ్డవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ)లో భారీ కుంభకోణం జరిగింది. సొసైటీ నిధులు అరకోటికిపైగా స్వాహా చేశారు. ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈవో) కూకట్ల శ్రీవాణి నిర్వాకంతో లాభాల్లో నడుస్తున్న సొసైటీ నష్టాలబాట పట్టింది. అడ్డగోలుగా సొసైటీ నిధులు దిగమింగి సొసైటీని గుల్ల చేశారు. రైతుల నుంచి వసూలు చేసిన మొత్తాలకు సంబంధించి వంద రసీదులు ఉన్న పుస్తకాన్ని మాయం చేశారు. ఒకే నంబరు రసీదుతో ఇద్దరు ముగ్గురు రైతుల నుంచి డబ్బులు వసూలు చేసి కైంకర్యం చేశారు. రైతుల నుంచి వసూలు చేసిన రుణ బకాయిలు, షేర్ ధనాన్ని కూడా స్వాహా చేశారు. సొసైటీలో జరిగిన నిధులు దుర్వినియోగం, అక్రమాలు పీడీసీసీ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్/సూపర్‌వైజర్లు వి.చంద్రశేఖర్, డి.రామారావుల త్రైమాసిక తనిఖీ నివేదికలతో వెలుగులోకి వచ్చాయి. ఈ నివేదికలను పరిశీలించిన బ్యాంకు సీఈవో కోటిరెడ్డి విచారణ జరపించాలని డీసీవోకు సిఫార్సు చేశారు. దీంతో డీసీవో సమగ్ర విచారణకు ఆదేశించారు. విచారణాధికారిగా ఒంగోలు సబ్ డివిజనల్ సహకారాధికారి బీసీహెచ్ మాల కొండయ్యను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. రెండు నెలల్లో విచారణ పూర్తి చేసి నివేదికను అందజేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.



దొడ్డవరం సొసైటీ కార్యాలయం

రశీదు పుస్తకం గల్లంతు

సొసైటీలో వంద రసీదులు ఉన్న పుస్తకం గల్లంతైంది. సొసైటీలో నగదు లావాదేవీలకు ఈ రసీదు పుస్తకమే ఆధారం. అది మాయమైపోవడంతో ఆ రసీదులతో ఎవరి నుంచి ఎంత మొత్తం వసూలు చేసింది తెలియకుండా పోయింది. రసీదు నెంబరు 106201 నుంచి 106300 వరకు ఉన్న పుస్తకం కనిపించడం లేదు. ఈ పుస్తకంలో నుంచి 106208 నెంబరు రసీదుతో పి.రాధా నుంచి రూ.11,060 వసూలు చేసి ఆ మొత్తాన్ని నగదు పుస్తకంలో నమోదు చేయకుండా దిగమింగారు.

అర కోటికిపైగా స్వాహా

సొసైటీ ద్వారా రైతులకు బట్వాడా చేసిన స్వల్పకాలిక వ్యవసాయ రుణాలు, కిసాన్ వికాస రుణ పథకం, సొసైటీ సొంత నిధులతో ఇచ్చిన రుణాల్లో అక్రమాలు జరిగాయి. ఈ రుణాలకు సంబంధించి రైతుల నుంచి వసూలు చేసిన రూ.22.75 లక్షలను సీఈవో గోల్‌మాల్ చేశారు. రైతుల నుంచి వసూలు చేసిన డబ్బులను సొసైటీ రికార్డుల్లో, నగదు పుస్తకాల్లో నమోదు చేసి బ్యాంకులో జమచేయాల్సి ఉండగా, సొంతానికి వాడుకున్నారు. ఆ మొత్తం కనీసం అరకోటికిపైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

డబుల్ రసీదులతోనూ స్వాహా

సొసైటీ నిధులకు రక్షణకర్తగా ఉండాల్సిన సీఈవో అడ్డగోలుగా సొసైటీ సొమ్మును డబుల్ రసీదులతో స్వాహా చేశారు.

- కేవీఆర్‌పీ రుణాలకు సంబంధించి 2023 అక్టోబరు 11న 292400 నంబరు రసీదుతో పి. సాంబశివరావు నుంచి రూ.లక్ష వసూలు చేశారు. అదే నంబరు రసీదుతో 2023 సెప్టెంబరు 29న రూ.లక్ష వసూలు చేసి ఈ మొత్తం రూ.2లక్షలను సీఈఓ స్వాహా చేశారు.

-కేవీఆర్‌పీ రుణాలకు సంబంధించి 2023 మార్చి 23న 244984 నంబరు రసీదు పి.సాంబశివరావు నుంచి రూ.23,625, అదే రసీదుతో జి.వి.సుబ్బమ్మ నుంచి 2023 అక్టోబరు 11న రూ. 4,830 వసూలు చేసి ఆ మొత్తాన్ని దిగమింగారు.

-పి.సాంబశివరావు నుంచి 281731 రసీదు నెంబరుతో రూ.75,500, అదే నెంబరు రసీదుతో మర్రిపూడి హరిబాబు నుంచి కూడా డబ్బులు వసూలు చేసి మింగేశారు. ఈ విధంగా రెండు రసీదులు మెయింటైన్ చేసి రైతుల నుంచి వసూలు చేసిన ఆ మొత్తాలను సీఈవో స్వాహా చేశారు.

తనిఖీలు లేనందునే స్వాహాలు

బ్యాంకు అధికారులు సొసైటీలను నిబంధనల ప్రకారం సందర్శిస్తూ తనిఖీ నివేదికలు సమర్పించనందునే నిధుల స్వాహాపర్వం యథేచ్ఛగా కొనసాగుతుంది. బ్యాంకు సూపర్‌వైజర్లు ప్రతి మూడు నెలలకు, మేనేజర్ కనీసం సంవత్సరానికి ఒకసారి, జోనల్ మేనేజర్లు ప్రతి ఆరు నెలలకు సొసైటీలను సందర్శించి లావాదేవీలను పరిశీలించి తప్పులు ఉంటే ప్రత్యేక నివేదిక ద్వారా బ్యాంకు సీఈవోకు సమర్పించాలి. అయితే అటువంటి పరిస్థితి లేకపోవడంతో సొసైటీల్లో నిధులు దుర్వినియోగం ఎక్కువైంది.

జిల్లాలో 62 మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 3 : జిల్లాలో 62 మంది ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. ఈ జాబితాకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆమోదముద్ర వేశారు. ఈ నెల 5న ప్రకాశం భవన్‌లోని మీకోసం హాలులో జరిగే గురుపూజోత్సవ కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ప్రదానం చేయనున్నారు. అవార్డులకు ఎంపికైన వారిలో పది మంది హైస్కూలు హెచ్‌ఎంలు, 20మంది స్కూలు అసిస్టెంట్లు, నలుగురు హైస్కూలు ప్లస్‌లో పనిచేస్తున్న పీజీటీలు, 25మంది సెకడరీ గ్రేడ్ టీచర్లు(తెలుగు), ముగ్గురు సెకండరీ గ్రేడ్ టీచర్లు(ఉర్దూ) ఉన్నారు.

హెచ్‌ఎంల విభాగంలో... టి.ఎల్.కాంతారావు(బండ్లమూడి), డి.గురుస్వామి(అల్లీనగరం), ఎం.సుధాకర్ (తర్లుపాడు), డి.జయవరప్రసాద్(పిడికిటివారిపల్లి), జి.గురుప్రసాద్(చందలూరు), టి.బిక్షాలు(గార్లపేట), వై.శ్రీనివాసరావు(మొహిద్దీన్ పురం), కే.శ్రీనివాస్(మూలగుంటపాడు), షేక్ అమ్మద్(వైడిపాడు), ఎస్.గోపాలనాయక్(కాకర్ల)లు ఎన్నికయ్యారు.

- స్కూలు అసిస్టెంట్ విభాగంలో... కే.నరసింహరావు(దొనకొండ), కే.ప్రదీప్‌కుమార్(గజ్జలకొండ), షేక్ ఖాజామొహిద్దీన్(దిరిశవంచ), కే.సత్యనారాయణ(వైపాలెం), హెచ్.రాధా కృష్ణమూర్తి(ఆకవీడు), వి.మాలకొండయ్య(దొనకొండ, అర్ధవీడు), ఎస్.వెంకటరమణయ్య(శీలంవారిపల్లి), ఆర్ కొండానాయక్(ముటుకుల), పి.రామాజాంనేయులు(ఈతముక్కల), బి.అంజనేయులు(మాచవరం), టి.రామారావు(చిన్నారికట్ల), పిసి.వెంకటేశ్వర్లు(ఓబులక్కపల్లి), జి. ఈశ్వరమ్మ(పీసీపల్లి), కే.సుజాత(అల్లీనగరం), పి.రాచయ్య(ముక్తినూతలపాడు), టి.రతన్‌బాబు (చిన్నారికట్ల), టి.పద్మాగాయత్రి(నాగంపల్లి), పి.రాహేలమ్మ (మీర్జాపేట), వీఎంకే ఆత్రేయ(చిలకపాడు), ఎం.రవీంద్రప్రసాద్(మైనంపాడు)లు ఎంపికయ్యారు.

- పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ) విభాగంలో.. వి.శ్రీనివాసరావు(హెచ్.నిడమానూరు), పి మెర్సీన్‌బాబు (కరవది), సిహెచ్.మార్కండేయులు(కొణిజేడు), ఎం.నాగకుమారశర్మ (మైనంపాడు)లు ఎంపికయ్యారు.

- ఎస్జీటీ (తెలుగు) విభాగంలో: కే.వెంకటేశ్వరరావు(మార్కాపురం), కే.శ్రీనివాసులు(దోర్నాల), బి. శైలజ(చౌటపల్లి), కేవి.శివనాగమణి(కురిచేడు), సిహెచ్.సునీతాదేవి (కోవిలంపాడు), కే. సుజాత(సిద్దవరం), బి.శ్రీదేవి(మంగమూరు), ఎం.భాస్కర్(అయ్యంబొట్లపల్లి),డి. అరుణ (అనుమలపల్లి), కే.మాల్యాద్రి(చెన్నుపాడు), ఆర్.తిరుపతయ్య(గన్నవరం), వి.శ్రీనివాసులురెడ్డి(ఊళ్ళపాలెం), ఈ.సరోజనమ్మ (దర్శిగుంట్ల), ఆర్‌వి.శేషకుమారి(గురువారెడ్డిపాలెం), కే.శైలజ(దాసరివారిపాలెం), సీహెచ్.భాస్కర్(తురిమెళ్ళ), జి.రత్తమ్మ(డీపీజీపేట), ఎ.పిచ్చమ్మ(మిట్టపాలెం), ఎస్‌కే.దస్తగిరి(పాలూరివారిపల్లి), ఎం.నరసారెడ్డి(పునుగోడు), పి సముద్రకుమారి(అయ్యపురాజుపాలెం), జి.సువార్త(రాచవారిపాలెం), కే.శివపార్వతి(ఒంగోలు), జి.రమాతులసి(పి.తక్కెళ్లపాడు), ఎం.రజిని(నందనవనం)లు ఎంపికయ్యారు.

సెకండరీ గ్రేడ్(ఉర్దూ) విభాగంలో: షేక్‌మల్లిక(ఫిర్‌దేస్‌నగర్), సయ్యద్ యాస్మిన్‌బాను(రావిపాడు), పఠాన్ జైనాబి(కనిగిరి)లు ఎంపికయ్యారు.

ముక్తేశ్వరంలో జోరుగా పారిశుధ్య పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బల్లికురవ, సెప్టెంబరు 3 : మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో మంగళవారం నుంచి పారిశుధ్య పనులు జోరుగా సాగుతున్నాయి. అదుపులోకి రాని విష జ్వరాలు అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్పంచ్ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి బాజీ పర్యవేక్షణలో గ్రామంలో వీధుల వెంట కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. దోమల నివారణకు ఫాగింగ్‌తోపాటు ఎబేట్‌ను పిచికారీ చేశారు. జ్వరాలు, పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్లపై మురుగు నిల్వ ఉండకుండా చూడాలని కోరారు. మరోపక్క వైద్య శిబిరంలో ఆరోగ్య సిబ్బంది సేవలందిస్తున్నారు. ముక్తేశ్వరం గ్రామాన్ని మంగళవారం ఇన్‌చార్జి ఎంపీడీవో రాంబాబు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన పంచాయతీ అధికారులతో మాట్లాడుతు వీధులు, కాలువలు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. మరోసారి రోగాలు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి ఆదేశించారు.

వణుకుతున్న మణికేశ్వరం

- ఇంటికి ఇద్దరికి విష జర్వాలు
- మంచంపట్టిన రోగులు
- మేదరమెట్ల, అద్దంకి పట్టణాలకు వెళ్లి చికిత్స
- పట్టించుకోని వైద్యాధికారులు


జ్వరంతో బాధపడుతున్న వృద్ధురాలు అంజమ్మ, నాగాంజమ్మ, నొప్పితో బాధపడుతున్న ఏసురత్నం

అద్దంకిటౌన్, సెప్టెంబరు 3 : మండలంలో మణికేశ్వరం విష జర్వాలతో వణుకుతోంది. 20 రోజులుగా గ్రామంలో ఇంటికి ఇద్దరు చొప్పున జ్వరంతో బాధపడుతున్నారు. అయినా వైద్యాధికారులు ఇటు తొంగిచూడడం లేదని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని తిప్పమీద గత 20రోజుల నుంచి విషజర్వాలబారిన పడి తీవ్రమైన ఒంటి నొప్పిలతో కొందరు మంచానికే పరిమితమయ్యారు. జ్వరాలు తగ్గినా కీళ్ల నొప్పితో నడవకలేక పోతున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సుమారు 50 మంది వరకు ఉన్నారని చెప్తున్నారు. వీరిలో కొందరు గ్రామంలోకి వచ్చే ఆర్‌ఎంపీతో వైద్యం చేయించుకోగా, మరికొందరు అద్దంకి, మేదరమెట్ల పట్టణాలలోని ప్రైవేట్ వైద్యశాలలకు వెళ్లి చికిత్స చేయించుకుంటున్నారు. వేలకు వేలు ఖర్చు చేస్తున్న జ్వరం తగ్గడంలేదని, రోజుల తరబడి ఇబ్బంది పడుతున్నామని పీడితులు వాపోతున్నారు. ప్రభుత్వ వైద్యాధికారులు పట్టించుకోవడం లేదని అంటున్నారు. గ్రామంలో ఉన్న ఆరోగ్య సిబ్బంది కూడా విషజ్వరాల పరిస్థితిపై వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లి వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ తమకెందుకులే అన్నట్లు వ్యవహరిస్తున్నారని పలువురు రోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చేసేది లేక బాధితులు ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. స్థోమత ఉన్న వారు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి వైద్యం పొందున్న పరిస్థితి ఉంది. తక్షణమే మణికేశ్వరంలో జిల్లా వైద్యాధికారులు పర్యటించాలని, వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి జ్వరాలు తగ్గేవరకూ సేవలందించాలని ప్రజలు కోరుతున్నారు.


భవానీపురంలో వరద ప్రాంతాల్లో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

సహాయక చర్యల్లో ఎమ్మెల్యేలు

చీరాల, సెప్టెంబరు 3 : విజయవాడలో వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మంగళవారం బాధితులకు అందుతున్న సహాయక చర్యలను పర్యవేక్షించారు. భవానీపురం, గొల్లపూడి ప్రాంతాల్లో సహాయక చర్యలను పర్యవేక్షించారు. స్థానికులకు మనోధైర్యం కల్పించారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో ఎవరికీ ఇబ్బంది లేకుండా సహాయక చర్యలు జరుగుతున్నట్లు చెప్పారు. ఆయనతోపాటు కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర కూడా ఉన్నారు. ఎమ్మెల్యే కొండయ్య, టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్ర నాథ్‌ల చొరవతో వాడరేవు నుంచి విజయవాడకు తరలించిన ఐదు బోట్లు మంగళవారం సహాయక చర్యల్లో కొనసాగాయి.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు


ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్ఐ

బల్లికురవ, సెప్టెంబరు 3 : బల్లికురవ నాలుగు రోడ్ల కూడలిలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ జీవీ చౌదరి హెచ్చరించారు. మంగళవారం ఆటో డ్రైవర్లకు ఎస్ఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ విజువల్ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా ప్రజలందరూ రోడ్లపై వాహనాలను నిలపకుండా ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా సహకరించాలన్నారు. అలాగే ఆటోలను రోడ్లపై అడ్డదిడ్డంగా ఉంచకుండా వరుస క్రమంలో నిలపాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలను ఉంచాలన్నారు. ప్రమాదాలు జరగకుండా పరిమిత మోతాదులోనే ప్రయాణికులను ఎక్కించాలన్నారు. ఆటోలకు త్వరలో సీరియల్ నెంబర్లను కేటాయిస్తామని, అందరూ పేర్లు, ఆధార్ వివరాలను అందించాలన్నారు. రోడ్లపై ఎక్కడికక్కడ వాహనాలను నిలపకుండా ప్రజలు సహకరించాలని ఎస్ఐ కోరారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ఏడుగురు జూదరుల అరెస్టు

బల్లికురవ, సెప్టెంబరు 3 : మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై మంగళవారం బల్లికురవ ఎస్ఐ జీవీ చౌదరి సిబ్బందితో కలిసి దాడి చేశారు. జూదం ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద రూ.7040ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్నవారిని కోర్టులో హాజరు పరుస్తామని ఎస్ఐ తెలిపారు. ఎవరైనా పేక ముక్క ఆడినా, ప్రోత్సహించినా చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

అద్దంకిలో ఆకతాయిల ఆగడాలు

- బెంబేలెత్తుతున్న ప్రజలు
- కట్టడి చేయాలని పోలీసులకు విజ్ఞప్తి

అద్దంకి, సెప్టెంబరు 3 : అద్దంకి పట్టణంలో ఇటీవల కాలంలో ఆకతాయిల ఆగడాలు మరింత పెరిగాయి. చీకటి పడితే ఖాళీ ప్రదేశాలను అడ్డాగా చేసుకుని మద్యం తాగుతున్నారు. ఇదే సమయంలో అటువైపు వెళ్లే ప్రజలను రన్నింగ్ కామెంటరీ చేయడం సర్వసాధారణంగా మారింది. ప్రధానంగా దర్శి రోడ్డులో మూడు అంతస్తుల భవనం పక్కన కట్టకిందపాలెం రోడ్డులో ఉన్న ఖాళీ స్థలంలో ఉన్న బల్లలపై యువకులు తిష్ట వేస్తున్నారు. పొద్దుపోయే వరకు అక్కడే ఉంటున్నారు. అనంతరం మోటార్ సైకిళ్లపై పట్టణంలో చక్కర్లు కొడుతున్నారు. దీంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే దాడికి దిగుతున్నారు. ఇటీవల భవానీ సెంటర్‌కు చెందిన ఆర్‌ఎంపీ అటు వైపు గా వెళ్తూ యువకుల వికృత చేష్టలను ప్రశ్నించారు. దీంతో యువకులంతా తిరగపడి దాడి చేసేంత పని చేశారు. రోజూ ఈ ప్రాంతంలో ఇదే పరిస్థితి అని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. చీకటి పడితే మహిళలు, విద్యార్థినులు అటువైపు వెళ్లాలంటే భయపడుతున్నారు. పలు శివారు ప్రాంతాలలో కూడా ఇటీవల యువకుల సిట్టింగ్‌లు మరింత పెరిగాయి. పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి ఆకతాయిల ఆగడాలకు ముకుతాడు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

బాలుర వసతి గృహంలో విద్యార్థుల ఇక్కట్లు


తలుపులు లేని గదులు, విరిగిన ఫ్యాన్లు

సంతమాగులూరు, సెప్టెంబరు 3 : సంతమాగులూరులోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం అధ్వానంగా మారింది. ఈ వసతి గృహాన్ని 20ఏళ్ల కిందట నూతన భవనంలోకి మార్చారు. ప్రస్తుతం 40 మంది విద్యార్థులు దూరప్రాంతాల నుంచి వచ్చి ఉంటున్నారు. వసతి గృహంలో ఉన్న మరుగుదొడ్లకు తలుపులు లేకపోగా, కొన్ని విరిగిపోయాయి. విద్యార్థుల పడక గదుల తలుపులు, కిటికీలు ఊడిపోయాయి. విద్యుత్ స్విచ్ బోర్డులు పాడై వైర్లు వేలాడుతున్నాయి. సీలింగ్ ఫ్యాన్లు విరిగిపోయి మూలనపడ్డాయి. రెండేళ్లుగా బోరింగ్ మోటార్ మరమ్మతుకు నోచుకోలేదు. దీంతో తాగునీటికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. శిథిలావస్థకు చేరిన చేతి బోరింగు నీరే దిక్కయింది. వసతుల లేమితో తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నామని విద్యార్థులు వాపోతున్నారు. ఈ వసతి గృహంలో వార్డెన్ మున్నంగి నాగేశ్వరరావు, కామాటిగా చెన్నుపల్లి కనకదుర్గ, ఔట్ సోర్సింగ్‌లో వాచ్‌మన్‌గా పని చేస్తున్న రవి, వంట మాస్టర్‌గా నాగరాజు పనిచేస్తున్నారు. వంట మాస్టర్ నాగరాజు ఇటీవల పనిలో లేరు. వాచ్‌మన్ రవే వంట చేస్తున్నారు. వసతిగృహంలోని సమస్యలను పై అధికారులకు తెలియజేసినా స్పందించడం లేదని విద్యార్థులు, సిబ్బంది అంటున్నారు. ఇప్పటికైనా వసతి గృహ సమస్యలపై అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లు


అమ్మకానికి సిద్ధంగా ఉన్న భారీ ప్రతిమలు

గణనాథుల విగ్రహాలు సిద్ధం

ఇంకొల్లు, సెప్టెంబరు 3 : వినాయకచవితి పండుగకు ఇంకొల్లులో వినాయక విగ్రహాలు అమ్మకానికి సిద్ధమవుతున్నాయి. ఈనెల 7వ తేదీన జరిగే పండుగకు వివిధ రూపాలలో ఉన్న గణనాథుల విగ్రహాలు కొలువుదీరనున్నాయి. పలు ఆకృతులు, రంగురంగులతో బొజ్జ గణపయ్య ప్రతిమలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. పలు గ్రామాల్లో చవితి నిర్వాహకులు ముందుగానే పెద్ద బొమ్మలకు ఆర్డర్‌లు ఇచ్చారు. సుమారు 80 భారీ విగ్రహాలకు ఆర్డర్లు వచ్చినట్లు తయారీదారులు చెప్తున్నారు.

వానొస్తే అండర్‌పాస్‌లో సమస్య

- రాకపోకలకు ఇబ్బందులు
- గ్రామస్థుల ఆవేదన


వర్షపు నీటితో ఇబ్బంది పడుతున్న ద్విచక్రవాహదారులు

చినగంజాం, సెప్టెంబరు 3 : వానొస్తే రైల్వే అండర్ పాస్ వద్ద సమస్యలు తలెత్తుతున్నాయి. ఉప్పుగుండూరు రైల్వేస్టేషన్ సమీపంలోని ఉత్తర గేటు వద్ద నూతనగా నిర్మించిన రైల్వే అండర్‌పాస్‌లో వర్షపు నీరు నిలవడంతో ప్రయాణించడం పెద్ద సమస్యగా మారిందని పెదగంజాం గ్రామస్థులు ఆవేదన వెల్లబుచ్చుతున్నారు. పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పెదగంజాం, ఎస్టీకాలని, బుచ్చిగుంట, పల్లెపాలెం, ఆవులదొడ్డిపాతగొల్లపాలెం, ఆవులదొడ్డికొత్తగొల్లపాలెం, కాటంవారిపాలెం, కోడూరివారిపాలెం గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం పనుల నిమిత్తం ఈ అండర్‌పాస్ ద్వారానే బంగోలు, ఉప్పుగుండూరు తదితర గ్రామాలకు ప్రయాణిస్తూ ఉంటారు. అండర్‌పాస్‌లో విద్యుత్ లైట్లు లేకపోడం, వర్షపు నీరు నిలబడటం వలన ప్రయాణం నరకయాతనగా ఉందని గ్రామస్థులు అంటున్నారు. రహదారి సైతం దెబ్బతినడంతో ప్రాణాలు బిగబెట్టుకొని ప్రయాణించవలసి వస్తుందని వాహనచోదకలు తెలిపారు. అండర్‌పాస్‌లో ప్రయాణించేటప్పుడు ద్విచక్రవాహదారులు అదుపు తప్పి గాయాల పాలవుతున్నారు. అండర్‌పాస్‌లో నిలిచిన వర్షపునీటిలో ప్రయాణించడం వలన ద్విచక్ర వాహనాల్లోని ఇంజన్‌లోనికి వర్షపు నీరు చేరి వాహనాలు ఆగిపోవడం వలన గమ్యస్థానాలకు చేరాలంటే ఇబ్బందులు పడవలసి వస్తుందని ద్విచక్రవాహనాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2024 ఫిబ్రవరి 26వ తేదీన జరిగిన రైల్వే అండర్ పాస్ ప్రారంభోత్సవ సభలో అండర్‌పాస్‌ని ఆర్‌వీఎన్‌ఎల్ వారు రైల్వే వారికి అప్పగిస్తే, వర్షపునీరు నిలబడ కుండా సెన్సార్ మెటార్లు ఏర్పాటు చేస్తామని, వాహనచోదకులకు ఎటువంటి ఇబ్బందులు కలుగవని బాపట్ల ఏడీఈఎన్ హామీ ఇచ్చినట్లుల గ్రామస్థులు తెలిపారు. హామీ ఇచ్చి ఆరు నెలలైనా చర్యలు లేవన్నారు. రైల్వే అండర్‌పాస్‌లో మెటార్లు, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేయాలని రైల్వే అధికారులను పెదగంజాం గ్రామస్థులు కోరుతున్నారు.

రాత్రి ప్రయాణం భయమే - కిలారి వెంకటరావు, పెదగంజాం

పగలు ఏదో ఒక విధంగా వెళ్తున్నప్పటికీ రాత్రి వేళ ప్రయాణించాలంటే భయంగా ఉంది. రైల్వే ఉన్నాతాధికారులు స్పందించి అండర్‌పాస్‌లో విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయాలలి. వర్షపునీరు నిల్వలేకుండా చేయాలి. అండర్‌పాస్‌లో నిలిచిన నీటిలో ప్రయాణించేటప్పుడు దిచక్రవాహనాల్లోని ఇంజన్‌లోనికి నీరు చేరి వాహనాలు ఆగిపోయి ఇబ్బంది పడుతున్నారు.

వరద బాధితులకు భోజనాలు

- మంత్రి గొట్టిపాటి సహకారంతో అద్దంకి నుంచి 40వేల మందికి ఆహారం
- విజవాయడకు తరలిన వాహనాలు


వరదబాధితుల కోసం సిద్ధం చేస్తున్న ఆహార ప్యాకెట్లు

అద్దంకి, సెప్టెంబరు 3 : వరద బాధితుల ఆకలి తీర్చేందుకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నడుంబిగించారు. అద్దంకిలో భోజనాలను తయారు చేయించి ప్యాకింగ్ చేసి వాహనాలలో విజయవాడకు పంపారు. పట్టణంలోని నాగులపాడు రోడ్డులో కామేపల్లి కల్యాణ మండపంలో సోమవారం, మంగళవారం సుమారు 65వేల మందికి భోజనాలు తయారు చేయించి పంపారు. సోమవారం రాత్రి 25వేల మందికి పంపగా, మంగళవారం ఉదయం 20వేల మందికి, సాయంత్రం మరో 20వేల మందికి ఆహార ప్యాకెట్లను తయారు చేయించి విజయవాడకు పంపించారు. పలువురు టీడీపీ నేతలు నిత్యం పర్యవేక్షిస్తూ భోజనాలు తయారు చేయిస్తున్నారు.


తెలుగుయువత పంపుతున్న వాటర్ బాటిళ్లు

తెలుగుయువత ఆధ్వర్యంలో వాటర్‌బాటిళ్లు

అద్దంకి, సెప్టెంబరు 3 : వరదబాధితుల కోసం తెలుగుయువత ఆధ్వర్యంలో మంగళవారం వాటర్‌బాటిళ్లను విజయవాడకు పంపారు. విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పిలుపు మేరకు అద్దంకి మండలంలోని నాగులపాడు తెలుగు యువత, వీవీఆర్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో విప్పర్ల పవన్‌కుమార్, వడ్లమూడి జానకి రామయ్య, కొల్లి సాంబయ్య 10వేల వాటర్‌బాటిళ్లను రెండు ట్రాలీ ఆటోలలో విజయవాడకు పంపారు.

ఏలూరి అండ

- 45వేల మందికి ఆహార పొట్లాలు, నీళ్ల బాటిళ్లు
- క్యాంప్ కార్యాలయం నుంచి తరలించిన టీడీపీ శ్రేణులు
- అక్కడే ఉండి బాధితులకు ధైర్యం నింపుతున్న ఎమ్మెల్యే


ఆహార పొట్లాలతో బయలుదేరిన వాహనాలు

మార్టూరు, సెప్టెంబరు 3 : ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయం నుంచి మంగళవారం మధ్యాహ్నం 45వేల మందికి సరిపడా ఆహారప్యాకెట్లను విజయవాడ వరదబాధితులకు పంపించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు దగ్గరుండి ఆహారాన్ని వాహనాలల్లో తరలించారు. విజయవాడలో వరదముంపు ప్రాంతాలను పర్యవేక్షించాల్సిందిగా ఎమ్మెల్యే ఏలూరికి ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. దీంతో ఏలూరి అక్కడే ఉండి పర్యవేక్షిస్తున్నారు. మరోపక్క క్యాంప్ కార్యాలయం నుంచి భోజనం ప్యాకెట్లు తీసుకోవాలని స్థానిక నేతలకు ఏలూరి సూచించడంతో మంగళవారం పెద్ద ఎత్తున ఆహార ప్యాకెట్లను విజయవాడకు తీసుకెళ్లారు. నాయకులు, అనుచరులు, ఎన్‌ఆర్ఐ టీడీపీ నాయకులు స్వయంగా ఏలూరి ఆదేశాలను పాటిసూ ప్రత్యేక సిబ్బందితో ఆహారపొట్లాలను సిద్ధం చేశారు. తెలుగుయువత సహకారంతో డబ్బాల్లో, ప్యాకెట్లలో ఆహారాన్ని నింపారు. అలాగే పెద్ద ఎత్తున నీళ్ల బాటిళ్లను సాయంత్రం విజయవాడకు పంపించారు. ఎమ్మెల్యే పిలుపుతో విజయవాడ వరద బాధితులకు సహాయక చర్యలు అందించేందుకు ఏలూరి సేన సిద్ధమయ్యారు.


అద్దంకిలోని గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న నాయకులు

గురుకుల పాఠశాల పరిశీలన

అద్దంకిటౌన్, సెప్టెంబరు 3 : అద్దంకిలోని గిరిజన గురుకుల పాఠశాలను మంగళవారం ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం, ఆంధ్రప్రదేశ్ అంబేడ్కర్ యువజన సంఘం బాపట్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థి గదులను, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మంచి భోజనం తయారు చేసి శుభ్రమైన వాతావరణంలో పిల్లలకు పెట్టాలని సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నక్కా కాంతారావు కోరారు. కార్యక్రమంలో సభ్యులు పులిపాటి హేబేలు, వీరయ్య, సతీష్, బాబు, జోసి పాల్గొన్నారు.


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

టీచర్లకు సర్దుబాటు కౌన్సెలింగ్

పంగులూరు, సెప్టెంబరు 3 : పంగులూరులో మంగళవారం టీచర్లకు సర్దుబాటు కౌన్సెలింగ్ నిర్వహించారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో మిగులుగా ఉన్న ఎస్‌జీటీని బూదవాడ మెయిన్ పాఠశాలకు, నూజెళ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో అదనంగా ఉన్న ఎస్‌జీటీలు ఇద్దరిని కశ్యాపురానికి, అలాగే ప్రాథమిక పాఠశాలకు ఒకరిని సర్దుబాటు చేయగా, బైటమంజులూరు ప్రాథమికోన్నత పాఠశాలలో మిగులుగా ఉన్న వారిని కొండమంజులూరు ప్రాథమిక పాఠశాలకు సర్దుబాటు చేశారు. తూర్పు కొప్పెరపాడు ప్రాథమిక ఉన్నత పాఠశాల నుంచి పంగులూరు మెయిన్‌కు సర్దుబాటు చేసినట్లు ఎంఈవో నాగభూషణం తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో-2 వీరాంజనేయులు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

అటు దుర్గంధం.. ఇటు దోమలు

- వసతుల లేమితో గిరిజన సంక్షేమ పాఠశాల విద్యార్థులు


గిరిజన సంక్షేమ రెసిడెన్సియల్ వసతి గృహం


పర్చూరు, సెప్టెంబరు 3 : చాలీచాలని ఇరుకు గదులు.. అరకొర వసతులు.., వసతి గృహం చుట్టూ దుర్గంధం.., దోమలబెడద.. వెరసి సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పర్చూరులోని గిరిజన సాంఘిక సంక్షేమ రెసిడెన్సియల్ పాఠశాల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. కనీసం విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు కూడా లేకపోవటం, ఉన్న అరకొరగా ఉండటంతో విద్యార్థులు నానా ఇక్కట్లు పడుతున్నారు. పర్చూరు మండల పరిధిలోని ఉప్పుటూరు ఎస్సీ బాలికల వసతి గృహం పరిస్థితి ఇదే విధంగా ఉంది. వసతి గృహం చుట్టూ మరుగునీరు, చిల్లచెట్లు ఉండటంతో దోమలతో వారు అల్లాడుతున్నారు. అలాగే నాగులపాలెం బాలయోగి సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం ప్రాంగణంలో మురుగునీరు ముందుకు కదలని దుస్థితి ఉంది. మరో పక్క ప్రాంగణంలో చిల్లచెట్లు, నాచుపేరుకు పోవటంతో సమస్య మరింత తీవ్రతరంగా మారింది.

రోజు రోజుకు పెరుగుతున్న జ్వరపీడితులు

ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో దోమల బెడతతో రోజు రోజుకు జ్వరపీడితులు పెరుగుతుండంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. పారిశుధ్య సమస్య దోమలతో ఎలాంటి ప్రాంణాంతకర వ్యాధులు వ్యాప్తి చెందుతాయోనని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం అయినందున వైరల్ ఫీవర్స్‌తోపాటు, టైఫాయిడ్, డెంగ్యూ, చికున్ గున్యా ప్రభలుతున్న తరుణంలో వారిలో మరింత ఆందోళన నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సంక్షేమ వసతి గృహాల ప్రాంగణాల్లో మురుగునీరు నిల్వలేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


పాఠశాల వద్ద నిల్వ ఉన్న మురుగు నీరు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
జిల్లా వార్తలు
బుధవారం 4 సెప్టెంబరు 2024



నిత్యావసరాల ధరలపై 6న ఆందోళన : సీపీఐ

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 3 : నిత్యావసరాల ధరలు తగ్గించాలని కోరుతూ ఈ నెల 6వ తేదీన దేశవ్యాప్తంగా ఆందోళన చేపట్టనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య వెల్లడించారు. మంగళవారం నెల్లూరులోని ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నిత్యావసరాలు, పెట్రో ధరలు తగ్గించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్ఠపరచాలని ఈ ఆందోళన చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం గాంధీబొమ్మ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించి, అక్కడ ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆందోళన పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు మాల కొండయ్య, సయ్యద్ సిరాజ్, నందిపోగు రమణయ్య, మున్వర్ తదితరులు పాల్గొన్నారు.

అది చాలయ్యా.. మాకు!

- మా చేతుల్లో ప్రాణం పోసుకున్న ప్రతిమలు ప్రతి ఇంటా పూజలందుకుంటున్నాయ్ !
- ఆదాయం లేకున్నా.. సంప్రదాయం కొనసాగింపు
- ఏటా 35వేలకుపైగా ప్రతిమల తయారీ
- పర్యావరణహితులు.. వెంగారెడ్డిపాళెం కుమ్మర్లు

వారంతా కుమ్మరులు. పెద్దలతరం నుంచి కుండలు చేయడమే వృత్తి. సిల్వర్, స్టీల్, రాగి పాత్రలు మార్కెట్‌లోకి రావడంతో కుండలకు ప్రాధాన్యం తగ్గింది. ఇంకేముంది.. తరాలనాటి వృత్తి గిట్టుబాటు కాదని ప్రత్యామ్నాయం వైపు అడుగులేశారు. ఎంత దూరం వెళ్లినా.. ఏ వృత్తిలో ఉన్నా 'చవితి'నాడు మాత్రం సొంతూరిలో వాలిపోతారు. పండక్కి నెల రోజుల ముందు నుంచే వినాయక ప్రతిమలు తయారు చేసి, జిల్లా నలుమూలలకు తరలించి విక్రయిస్తారు. 'గిట్టుబాటు కాకున్నా మా చేతుల్లో ప్రాణం పోసుకున్న బొమ్మలు కొన్ని వందల ఇళ్లలో పూజలందుకుంటున్నాయ్. అది చాలయ్య మాకు' అంటున్నారు వెంగారెడ్డిపాళెంలోని పర్యావరణహితులు.

- సంగం





ప్రతి ఇంటా మా వినాయకులు ఎంతో సంతృప్తి!



సంక్రాంతి పండుగ వస్తే పల్లెల్లో ఎంత సందడిగా ఉంటుందో వినాయక చవితి వచ్చిందంటే మా గ్రామంలో కూడా అంతే సందడిగా ఉంటుంది. బొమ్మలను తయారు చేయించుకోవడానికి ఎక్కడెక్కడ నుంచో వెతుక్కుంటూ వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల రాకతో మా గ్రామం నిండుగా ఉంటుంది. మా చేతుల్లో రూపుదిద్దుకున్న మట్టి గణపతులు వందల ఇళ్లలో కొలువై పూజింపబడుతున్నాయని ఎంతో సంతృప్తినిస్తుంది. దీంతోనే పెద్దగా ఆదాయం లేకపోయినా కూలి గిట్టుబాటుకే తయారు చేసి ఇస్తున్నాం.

- వెంకట రమణయ్య, తయారీదారుడు

ప్రోత్సహిస్తే మరిన్ని చేస్తాం



కొన్నేళ్లుగా మట్టి గణపతులను తయారుచేసి విక్రయిస్తున్నాం. మా గ్రామం నుంచి 25వేల నుంచి 30 వేల ప్రతిమలను జిల్లా నలుమూలలకు తరలిస్తున్నాం. ప్రభుత్వ పరంగా ప్రోత్సాహం అందిస్తే మరిన్ని ప్రతిమలను ఉత్పత్తి చేసి సరఫరా చేస్తాం.

- మన్నేపల్లి శ్రీనయ్య, వెంగారెడ్డిపాళెం

● జిల్లా నలుమూలలకు తరలింపు



గ్రామంలో రూపుదిద్దుకున్న గణనాథులను 'చవితి'కి ముందుగానే నెల్లూరు, బుచ్చిరెడ్డిపాళెం, కావలి, కోవూరు, ఆత్మకూరు ప్రాంతాలకు తరలించి విక్రయిస్తారు. కొంతమంది వ్యాపారులు గ్రామానికే వచ్చి హోల్‌సేల్‌గా కొనుగోలు చేస్తుంటారు. అలాగే గ్రామస్థులే ఆయా ప్రాంతాలకు వెళ్లి ప్రజలకే విక్రయిస్తుంటారు. అయితే, ఖర్చులు పెరుగుతుండటంతో గిట్టుబాటు కావడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చిన ఆదాయంతోనే సంతృప్తి పొందుతూ తమ తాతలనాటి సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నట్లు వారు చెబుతున్నారు.



సంగం మండలంలోని వెంగారెడ్డిపాళెం ఓ కుగ్రామం. ఒకప్పుడు 25 కుటుంబాలకుపైగా కుమ్మర్లు ఉండేవారు. కులవృత్తి గిట్టుబాటు కాకపోవడంతో ఆ వృత్తిని నమ్ముకుని ఉన్నది రెండు కుటుంబాలే. మిగిలినవారు వ్యవసాయ, దినసరి కూలీలుగా మారిపోయారు. డిమాండు, గిట్టుబాటుకాక ఎప్పుడో కులవృత్తిని వదిలేసినా, ఆదాయం లేకున్నా తరతరాలుగా మట్టి గణపతులు తయారు చేస్తూ గ్రామం లో పది కుటుంబాలు ఆదర్శంగా నిలుస్తున్నాయి.

● నెల రోజుల ముందే హడావుడి

ప్రతి ఏడాది వినాయక చవితికి నెల ముందు నుంచే ఆ పది కుటుంబాలు మట్టి వినాయక ప్రతిమల తయారీలో నిమగ్నమవుతాయి. స్థానికంగా మట్టి లభించకపోయినా దూరప్రాంతం నుంచి తెచ్చుకుని బొమ్మల తయారీకి అనువుగా మట్టిని సిద్ధం చేసుకుంటారు. అర అడుగు నుంచి ఒకటిన్నర అడుగు ఎత్తున వివిధ ఆకారాల్లో ప్రతిమలను తయారు చేస్తారు. మొదట్లో చేతులతోనే మట్టి గణపతులను తయారు చేసేవారు. ఇప్పుడు అచ్చుల ఆధారంగా మట్టి గణపతులను రూపొందిస్తున్నారు. అలా తయారు చేసిన వాటిని వారం రోజులపాటు నీడలో ఆరబెట్టి సహజమైన రంగులతో సుందరంగా తీర్చిదిద్దుతారు. ఒక్కో ప్రతిమను రూ.20 నుంచి 70లకు విక్రయిస్తారు. హోల్‌సేల్ వ్యాపారులకు ఈ ధరలో తగ్గింపు ఉంటుంది. ముందుగా ఆర్డర్ ఇస్తే 10 అడుగుల భారీ మట్టి విగ్రహాలను తయారు చేయగల నైపుణ్యం కలిగిన కళాకారులు ఈ గ్రామంలో ఉన్నారు. కానీ ధర ఎక్కువ కావడంతో ఎవరూ ముందుకు రావడం లేదు.

అమ్మకానికి వినాయక ప్రతిమలు సిద్ధం

ఇలాగైతే ముప్పే!

- నత్తనడక 'సోమశిల' అప్రాన్ పనులు
- సీఎం చంద్రబాబు ఆదేశాలు బేఖాతరు



సోమశిల ప్రాజెక్టు ముందు 11, 12 క్రస్ట్‌గేట్ల నుంచి నీరు సరఫరా చేసే డైవర్షన్ కెనాల్ ఇది. రెండేళ్ల క్రితం వచ్చిన వరదకు ఈ ప్రాంతం ధ్వంసమై రూపురేఖలు కోల్పోయింది. అప్రాన్, కాలువ మధ్య రక్షణ గోడ కొట్టుకుపోయింది. ఈ రెండు గేట్ల నుంచి వరద వదిలితే నీరంతా అప్రాన్‌లోకి చేరుతుంది. దీంతో జలాశయం ముందు భాగం మరింత దెబ్బతింటుంది. ఈ పనులు అత్యవసరంగా చేయాలని నిపుణలు సూచించారు. అయితే ఇంతవరకు ఆ ఊసే లేదు. ప్రస్తుతం కాలువలో కొంత మేర నీటి ప్రవాహం కొనసాగుతోంది. ఆ నీటిని నియంత్రణ చేస్తూ కాలువలో గట్టు ఏర్పాటు చేసి రక్షణ గోడ పనులు చేయాల్సి ఉంది.

అనంతసాగరం, ఆగస్టు 3 : సోమశిలకు ఎగువ నుంచి వరద రాక మొదలైంది. నీటి నిల్వ 40 టీఎంసీలకు చేరువైంది. మరోవైపు వచ్చే నెల నుంచి తుఫాన్లు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి.



అప్రాన్‌లో కాంక్రీట్ పనులు చేయక కనిపిస్తున్న కొండచరియలు

అయితే వర్షాలకు ముందే సోమశిలను సమగ్రాభివృద్ధి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేసినా ఫలితం కనిపించడం లేదు. దీంతో జలాశయం మనుగడ ప్రశ్నార్థకమవుతోంది. గత వైసీపీ హయాంలో పాలకులు సోమశిల ప్రాజెక్టును పూర్తిగా విస్మరించారు. వరుసగా రెండేళ్లపాటు కొనసాగిన వరద నష్టాన్ని పూడ్చలేక పోయారు. ఈ క్రమంలో డ్యాం పరిస్థితి దయనీయంగా మారింది. అనంతరం అధికారంలోకి వచ్చిన టీడీపీ సోమశిల అభివృద్ధిపై దృష్టి సారించింది. ఇటీవల సీఎం చంద్రబాబు డ్యాంను సందర్శించి వైసీపీ హయాంలో ఆగిన పనులు వెంటనే పూర్తిచేసి ప్రాజెక్టు మనుగడ కాపాడేలా అధికార యంత్రాంగానికి సూచనలు చేశారు. అయితే, సుమారు 50 రోజుల క్రితం పునఃప్రారంభమైన పురోగతి పనులు నత్తతో పోటీ పడుతున్నాయి. వర్షాలకు ముందే పనులు పూర్తిచేసేలా షరతు విధించినా కాంట్రాక్టరులో మార్పు లేదు. పనులకు అవసరమైన ఇసుకను మర్రిపాడు డంప్‌యార్డ్ నుంచి 20 వేల మెట్రిక్ టన్నులకు అనుమతి కల్పించారు. ఇక రోజు వారీగా 1000 క్యూబిక్ మీటర్ల మేరకు కాంక్రీట్ పనులు చేయాల్సి ఉన్నా ఆ దిశగా పనులు జరగడం లేదు.

● 20 రోజుల్లో నిండుకుండలా..

సోమశిలకు వరద రోజు రోజుకు పెరుగుతోంది. డ్యాం పూర్తిసామర్థ్యం 77 టీఎంసీలు కాగా ప్రస్తుతం 40 టీఎంసీలకు చేరువైంది. ఇప్పుడు 22,283 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ వరద ఇలాగే కొనసాగితే 20 రోజుల్లో డ్యాం నిండనుంది. జలాశయం పూర్తిసామర్థ్యానికి చేరితే క్రస్ట్‌గేట్లు ఎత్తి నీరు కిందకు వదలక తప్పదు. అప్పుడు పనులు చేసేందుకు వీలుండదు. ఈ క్రమంలో 20 రోజుల్లో అత్యవసర పనులు ముగించాల్సి ఉంది. చర్యలు మాత్రం కనిపించడం లేదు. మరోవైపు రెండు రోజుల క్రితం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సోమశిల వద్ద జరుగుతున్న పనులు చూసి ఆవేదనకు గురయ్యారు. నిర్లక్ష్యంగా జరుగుతున్న పనులపై సీఎంవో కార్యాలయానికి సమాచారం ఇచ్చారు.

పేపర్..!

- ఉషోదయ 'వార్తా' వారథి
- పొద్దున్నే పత్రికతో పలకరింపు
- ఆరోగ్యం... ఆదాయం
- నేడు అంతర్జాతీయ పేపర్ బాయ్స్ దినోత్సవం

పేపర్.... వేకువజామున చీకట్లో వీధుల్లో వినిపించే తొలిపలుకు ఇదే. పాఠకుల ప్రపంచానికి ఉదయించే సూర్యుడు పేపర్‌బాయ్. తెల్లవారక మునుపే వార్తా పత్రికల ద్వారా ప్రపంచాన్ని పాఠకులకు చూపించేది అతడే. దిన పత్రిక అంటే నిరంతర శ్రమ ద్వారా ఎందరో రూపొందించిన వార్తల సమాహారం. పాత్రికేయులు రేయింబవళ్లు కష్టించి సేకరించిన వార్తల్ని సంపాదక బృందం అందంగా అమర్చి అచ్చువేస్తారు. వీరందరి శ్రమను పాఠకుల ముందుకు సకాలంలో తీసుకువెళ్లే సైనికుడే పేపర్ బాయ్.



కుటుంబానికి చేదోడుగా...

ప్రతిరోజూ ఉదయాన్నే ఇంటింటికి పేపర్ వేయడం చాలెంజింగ్‌గా ఉంటుంది. నేను ఊహించకుండానే ఈ అవకాశం వచ్చింది. కుటుంబానికి చేదోడువాదోడు ఉంటుందని పేపర్ వేస్తున్నాను. ఉదయం 3గంటల నుంచి 7గంటల వరకు ఇంటింటికి పేపరు వేసి ఇంటి పనులు చూసుకుంటున్నారు. కొత్తల్లో వేకువనే నిద్ర లేవాలంటే కష్టంగా ఉండేది ఇప్పుడు అలవాటైపోయింది.

- పీ జానకి, కల్లూరుపల్లి, ఇందిరమ్మ కాలనీ

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 3 : ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠకుల ఇళ్లకు న్యూస్‌పేపర్ వేయడం అంత తేలికైన పనికాదు. చలియైన, వర్షమైనా తెల్లవారుజామున 3గంటల నుంచే క్రమశిక్షణతో ఈ పని చేయాలి. కట్టగా వచ్చే పత్రికలను పేర్చు కుని సైకిల్‌కి కట్టుకొని సూర్యోదయానికి ముందే పాఠకుల గృహాలకు చేరవేయాలి. అలాంటి పేపర్‌బాయ్ లేకుంటే పత్రికల మనుగడ ప్రశ్నార్థకమే!. అందుకనే న్యూస్ పేపర్ అసోసియేషన్ ఆఫ్ అమెరికా సెప్టెంబరు 4వ తేదీని అంతర్జాతీయ పేపర్ దినోత్సవంగా ప్రకటించింది. తొలి పేపర్ బాయ్‌గా పనిచేసిన బార్నా ఫ్లాహెర్టీ జయంతి సందర్భంగా ఏటా సెప్టెంబరు 4న అంతర్జాతీయ పేపర్ బాయ్ దినోత్సవం జరుపుకుంటారు. విద్యార్థి దశలో ఖర్చులకనో, కుటుంబానికి ఆసరాగా ఉండేందుకనో ఎంతో మంది పేపర్‌బాయ్ చేరుతుంటారు. ఈ సందర్భంగా అలవడిన క్రమశిక్షణతో జీవితంలో ఉన్నతస్థానాలకు చేరినవారూ ఉన్నారు.

● ఎందరో మహానుభావులు

ప్రపంచ అణు విజ్ఞాన శాస్త్రంలో దిగ్గజం, భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చిన్న తనంలో పేపర్ బాయ్‌గా పనిచేసి చదువు కుంటూనే కుటుంబానికి ఆర్థిక తోడ్పాటును అందించారు. స్వాతంత్ర్య సమర యోధుడు లోకమాన్య బాలగంగాధర్‌తిలక్ స్వాతంత్ర్య ఉద్యమం తొలినాళ్లలో పీపుల్ వార్ పత్రికకు పేపర్‌బాయ్‌గా పనిచేశారు. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ్ కూడా మొదట్లో పేపర్‌బాయ్‌గా పనిచేసి ఆ తర్వాత గొప్ప సాహితీవేత్తగా ఎదిగారు.

పేపర్ వేయడం సంతృప్తినిస్తోంది



నేను ఎంఏ లిటరేచర్ చేశాను. తగిన ఉద్యోగం దొరకకపోవటంతో కొద్దికాలం ప్రైవేటు కళాశాల్లో లెక్చరర్‌గా పనిచేశాను. అక్కడ ఇచ్చే జీతం సరిపోక ఆటో డ్రైవర్‌గా మారాను. వేకువజామున పని ఉండదు కనుక పేపర్ వేస్తే మరికొంత ఆదాయం వస్తుందన్న ఆలోచ నతో కొన్నేళ్లుగా ఆంధ్రజ్యోతి పేపర్ పార్శిల్స్ బస్సుల్లో పెట్టడంతో పాటు చందాదారులకు పేపర్ వేస్తున్నాను. ఈ పని నాకెంతో సంతృప్తినిస్తోంది.

- తన్నీరు నరేంద్ర, కందుకూరు

ఉపాధి లభించింది



ఎలాంటి ఉపాధి లేక తిరుగుతున్న నాకు ఆంధ్రజ్యోతి పేపర్ బాయ్‌గా, ఏజెంట్‌గా ఉపాధి లభించింది. 20 ఏళ్లకుపైగా పేపర్‌బాయ్‌గా, ప్రస్తుతం ఏజంట్‌గా పని చేస్తున్నా. ఉదయం 4గంటలకల్లా బస్టాండ్ చేరుకొని పత్రి కలు సర్దుకుని తెల్లవారక ముందే పాఠ కుడికి అందజేస్తున్నా. దీంతో వచ్చే ఆదా యంతో కుటుంబాన్ని పోషిస్తున్నాను.

- షేక్ ఖాజామస్తాన్, ఉదయగిరి

22 ఏళ్ల నుంచి పేపర్ వేస్తున్నా..



నేను పదో తరగతి వరకు చదువు కున్నా. 22 ఏళ్ల క్రితం పేపర్ బాయ్‌గా చేరాను. విద్యార్థి దశ నుంచే పేపర్ వేస్తున్నా ను. ప్రతి రోజూ ఉదయం 3:30 గంటలకు నిద్రలేచి సెంటర్‌కు వెళ్లి పత్రికలు తీసుకుని పాఠకుల ఇళ్లకు వెళ్లి ఇచ్చేవాడిని. మొదట్లో నెలకు రూ.120 సంపాదనగా వచ్చేది. చదువుకుంటూ డబ్బు సంపాదించుకోవడం ఆనందంగా ఉండేది. ఆంధ్రజ్యోతి పేపర్‌బాయ్‌గా కొనసాగుతూనే అదే దినపత్రిక ఏజన్సీ తీసుకున్నాను. పేపర్ ఏజెంట్‌గా ఆత్మకూరులో గుర్తింపు తెచ్చుకోగలిగాను. ఏజెన్సీ కొనసాగిస్తూనే మెటల్ స్టోర్ నిర్వహిస్తున్నాను.

- కనుమర్లపూడి గురుబ్రహ్మాం, ఆత్మకూరు

వ్యాయామం, ఆదాయం



ప్రతి రోజూ ఉదయాన్నే దిన పత్రికను ఇళ్లకు వేయడం శరీరానికి మంచి వ్యాయామమే కాక ఆర్థికంగా చేయూత లభిస్తుంది. ఉదయాన్నే ఒక గంట సేపు వీధుల్లో తిరిగి పేపరు వేయడం వల్ల శారీరక శ్రమ కలిగి ఆరోగ్యంగా ఉంటా రు. అలాగే ప్రజలకు అవసరమైన సమాచారాన్ని పత్రిక ద్వారా అందించిన సంతృప్తి కలుగుతోంది. పేపర్ వేయించు కునే వారందరితో పరిచయాలు ఏర్పడి ప్రజా సంబంధాలు మెరుగుపడతాయి.

- షేక్ రఫీ, కావలి



ఆహారం తయారీని పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

నిరాశ్రయులకు చేయూత!

- కార్పొరేషన్ నుంచి ఆహార పొట్లాల తరలింపు
- 10 మంచినీటి ట్యాంకులు, 9 డీజిల్ ఇంజన్లు కూడా..

నెల్లూరు (సిటీ) : విజయవాడలో జల ప్రళయానికి నిరాశ్రయులైన బాధితులను ఆదుకునేందుకు నెల్లూరు కార్పొరేషన్ అధికారులు సిద్ధమయ్యారు. కమిషనర్ సూర్యతేజ నేతృత్వంలో మంగళవారం ఉదయం 55 వేల అల్పాహార ప్యాకెట్లతో ఓ లారీని విజయవాడకు తరలించారు. మధ్యాహ్నం, రాత్రి 2 లక్షల మందికి ఆకలి తీర్చేందుకు భోజన ప్యాకెట్లతో మరో లారీ బయలుదేరగా, దాహార్తిని గట్టెక్కించడానికి 10 మంచినీటి ట్యాంకర్లు, నివాసాల వద్ద మురుగు నీరు బయటకు పంపే 9 డీజిల్ ఇంజన్లను బెజవాడకు తరలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్ సూర్యతేజ మాట్లాడుతూ హోటళ్లు, క్యాంటరింగ్‌లు, మెస్‌ల నిర్వాహకుల ద్వారా ఆహార ప్యాకెట్లను తయారు చేసి విజయవాడకు పంపుతున్నామని తెలిపారు. దాతల దాతృత్వం కూడా విపత్తు బాధితులకు అందించాలని పిలుపునిచ్చారు. అనంతరం కందుకూరు సబ్‌కలెక్టర్‌గా నూతన బాధ్యతలు తీసుకున్న తిరుమని శ్రీపూజ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

● **నెల్లూరు (హరనాథపురం)** : వరద బాధితుల కోసం జిల్లా నుంచి 30,185 ఆహార పొట్లాలను 3 కంటైనర్లలో విజయవాడకు పంపినట్లు డీఎస్‌ఓ వెంకటరమణ తెలిపారు.



ఆహార పొట్లాలు ఉన్న కంటైనర్

● **సంగం :** తహసీల్దారు సోమ్లా నాయక్, వీఆర్వోలు శ్రీనివాసులురెడ్డి, ఖాజా రసూల్, శోభన్‌బాబులు విజయవాడలో సహాయ కార్యక్రమాల్లో మంగళవారం ముమ్మరంగా పాల్గొన్నారు. బాధితులకు ప్రభుత్వం తరపున ఆహార ప్యాకెట్లు సరఫరా చేస్తున్నారు.

● **సైదాపురం :** వరద ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు మంగళవారం రెండు బృందాలు బయలుదేరినట్లు ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ తెలిపారు. ఇద్దరు ఎలక్ట్రీషియన్లు, ఇద్దరు ప్లంబర్లు, ముగ్గురు శానిటేషన్ వర్కర్లు ఉన్నారు. వీరికి లీడర్లుగా సైదాపురం సెక్రటరీ వంశీకృష్ణ, తుమ్మలతలుపూరు సెక్రటరీ కార్తీక్ ఉన్నట్లు చెప్పారు.

ఆయాల వేతనాల చెల్లింపునకు ఆదేశాలు

నెల్లూరు (విద్య): పాఠశాల విద్యాశాఖ బడ్జెట్ అంచనాల ప్రకారం 2024- 25 విద్యా సంవత్సరానికి ఆయాలు, నైట్ వాచ్‌మెన్ వేతనాలతో పాటు క్లీనింగ్ మెటీరియల్స్‌కు నిధులు విడుదల చేస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా అధికారులు తెలిపారు. జిల్లాలో పనిచేస్తున్న 2764 మంది ఆయాలకు ఒక్కొక్కరికి రూ.6,438 చొప్పున గౌరవవేతనం విడుదలైందన్నారు. ఆర్థికశాఖ అనుమతులతో ఈ నిధులను త్వరలోనే వారి ఖాతాల్లో జమచేస్తామని పేర్కొన్నారు. అలాగే పాఠశాలల మరుగుదొడ్ల నిర్వహణ, శుభ్రత సామగ్రిని కూడా విడుదల చేస్తామని తెలిపారు.

విజృంభిస్తున్న విషజ్వరాలు

● కొరవడిన పారిశుధ్యం.. మంచినీటి కలుషితమే ప్రధాన కారణం

● రక్తకణాలు తగ్గుతుండటంతో జ్వర పీడితుల ఆందోళన



ఉదయగిరిలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 3: మారిన వాతావరణ పరిస్థితులతో విషజ్వరాలు నియోజవర్గంలో విజృంభించాయి. గ్రామాల్లో ఎక్కడ చూసినా జ్వరపీడుతులే కనిపిస్తున్నారు. కొందరికి రోజులతరబడి జ్వరం తగ్గక పోవడంతో శరీరంలో రక్తకణాల సంఖ్య తగ్గాయని వైద్యులు ధ్రువీకరించడంతో చెన్నై, నెల్లూరు వైద్యశాలలకు వెళ్లి చికిత్స పొంది నయం కావడంతో ఇంటికి చేరుకొన్నారు. ఉదయగిరి పట్టణంలోని సినిమాహాలువీధి, నాగులబావివీధికి చెందిన ఇద్దరు వ్యక్తులు జ్వరం బారినపడడంతో స్థానిక వైద్యశాలలో చికిత్స పొందారు. మరికొందరు జ్వరం తగ్గక నెల్లూరు, ఆత్మకూరు, వింజమూరు, కావలి ప్రాంతాల్లోని ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు.

● అధ్వానంగా పారిశుధ్యం..

అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారి తాగునీరు కలుషితమవుతోంది. ఈ నీటిని తాగి జనాలు పలు వ్యాధుల వ్యాప్తికి గురవుతున్నారు. కాలువల్లో పూడిక తీయక పోవడంతో మురుగు నీరు పొంగిపొర్లి ప్రధాన రహదారులపై నిల్వ చేరి దోమలకు నిలయంగా మారుతోంది. ఇంట్లో ఒకరిద్దరు జ్వరాల బారినపడితే మరికొందరు వాంతులు, విరోచనాలతో బాధపడుతున్నారు. సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, వరికుంట పాడు, వింజమూరు ప్రాంతాల్లో బాధితులు ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి సెలైన్‌లు ఎక్కించుకుంటున్నారు. మరికొందరు ఆర్‌ఎంపీ వైద్యుల వద్ద చికిత్స పొందుతున్నారు. పంచాయతీ అధికారులు, వైద్యులు పరిసరాలు శుభ్రత, దోమతెరలను వాడాలని ప్రచారంతోనే సరిపెట్టుకొంటున్నారే తప్ప నివారణ చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



ఉదయగిరిలో మూలకు చేరిన ఫాగింగ్ యంత్రం

● దోమల నివారణ చర్యలేవీ ?

దోమల నివారణకు 143పంచాయతీలకు ఫాగింగ్ యంత్రాలు ప్రభుత్వం సరఫరా చేసింది. వీటిని ఉపయోగించేందుకు నిధులు లేకపోవడంతో అధికారులు సచివాలయాల్లో మూలన ఉంచారు. రెండు వేల జనాభా ఉన్న గ్రామానికి ఒకసారి ఫాగింగ్ చేయాలంటే కనీసం రూ.5వేలు వరకు ఖర్చవుతుంది. కొన్ని గ్రామాల్లో ఒకసారి మాత్రమే ఫాగింగ్ చేయగా చాలా పంచాయతీ ల్లో ఈ యంత్రాలు మూలకు చేరాయి. కొన్ని పంచాయతీల్లో వీటిని అట్టపెట్టెల్లో నుంచి బయటకు తీసిన పాపాన పోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వరికుంటపాడు, సెప్టెంబరు 3: గణేశ్వరాపురం పిల్లాపేరు వాగు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో ఏఎస్‌ఐ శ్రీనాథ్ మంగళవారం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వాగులో నుంచి వ్యాపారులు ప్రతినిత్యం ఇసుకను అక్రమంగా సమీప గ్రామాలతో పాటు ప్రకాశం జిల్లా పామూరుకు తరలిస్తుండడంతోనే దాడులు నిర్వహించినట్లు సమాచారం.

సమస్యలు పరిష్కరించాలని వినతి

అంనతసాగరం, సెప్టెంబరు 3: తమ సమస్యలను పరిష్కరించాలని మండలంలోని ఆశవర్కర్లు మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పీహెచ్‌సీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనతరం వైద్యులు శ్రీకాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుబ్బలక్ష్మమ్మ, సాబిరా, అక్కమ్మ, సునీత, జయలక్ష్మి పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 3: మండలంలోని 17పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘంకు సంబంధించి రూ.52.25లక్షల టైడ్, రూ.34.83లక్షల అన్‌టైడ్ నిధులు మంజూరైనట్లు ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిధులను తాగునీరు, పారిశుధ్యం, రోడ్ల మరమ్మతులకు వినియోగిస్తామన్నారు.

ఇసుక తరలింపుపై ప్రత్యేక నిఘా

కలువాయి, సెప్టెంబరు 3: పెన్నానది ఇసుక అక్రమ తరలింపును అడ్డుకునేందుకు నాలుగు బృందాలను ఏర్పాటు చేసినట్లు మంగళవారం తహసీల్దారు లీల సంజీవకుమారి తెలిపారు. ఒక బృందంలో ఇద్దరు వీఆర్వోలు, వీఆర్‌ఏ ఉంటారని చెప్పారు. వీరు రాత్రి సమయంలో ఇసుక రీచ్‌లపై నిఘా ఉంచుతారని తెలిపారు. ముఖ్యంగా తెలుగురాయపురం, రాజుపాలెంలో ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ఎక్కడ ఇసుకను అక్రమంగా తరలిస్తే వెంటనే వారు ఎస్‌ఐతో పాటు రెవెన్యూ ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తారన్నారు. మూడురోజుల ప్రకారం షిఫ్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తారని చెప్పారు.

మూతలు ఏర్పాటు చేయాలి

వింజమూరు, సెప్టెంబరు 3: పట్టణంలోని ప్రధాన రహదారి వెంబడి ఉన్న మురుగు కాలువలపై మూతలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా పోలీస్‌స్టేషన్- మండపం మధ్యన ఉన్న మురు కాలువపై మూతలు లేనందువలన ప్రజలు ప్రమాదాకులకు గురి అవుతున్నట్లు చెబుతున్నారు. త్వరలో చెన్నకేశవ స్వామి తిరునాళ ఉన్నందున అంతలోపే సమస్యను పరిష్కరించాలంటున్నారు.

ఏఎస్ఐకి సన్మానం

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 3: స్థానిక పోలీస్‌స్టేషన్ ఏఎస్‌ఐ ఏ.శ్రీనివాసులు ఎస్‌ఐగా పదోన్నతి పొందడంతో మంగళవారం నియోజకవర్గ టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు సందిరెడ్డి రామారావు, టీడీపీ నాయకులు సన్మానించి మిఠాయిలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తులసీరామ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్కూళ్లలో పవన్ జన్మదిన వేడుకలు

వరికుంటపాడు, సెప్టెంబరు 3: మండలంలోని పలు గ్రామాల పాఠశాలల్లో మంగళవారం జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. జనసేన, టీడీపీ నాయకులు పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు పఠాన్ రసూల్, టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి నాదిండ్ల రాజేంద్ర, ఏఎంసీ చైర్మన్ చిననాయబ్ రసూల్, దగ్గుపాటి రవి, కొత్తులూరి శివాజీ, మేడిద వెంకట్, బత్తుల ప్రవీణ్, మణి, వెంగళ రాయుడు, మణికంఠ పాల్గొన్నారు.

ఇంటింటా సర్వే చేపట్టండి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 3: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా వైద్యఆరోగ్య సిబ్బంది ప్రతి రోజూ ఇంటింటా లార్వా, జ్వర పీడితుల సర్వే చేపట్టి నివేదిక అందజేయాలని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి శివకల్పన సూచించారు. మంగళవారం స్థానిక పాత సామాజిక ఆస్పత్రిలో వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. జ్వరపీడితుల నుంచి రక్తనమూనాలను సేకరించాలన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లో డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు చేయాలన్నారు. గర్భవతులు, బాలింతలకు పౌష్టి కాహారం ఆవశ్యకతపై అవగాహన కల్పించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివకుమారి, హెచ్‌ఈ వెంకట సుబ్బయ్య, మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్, ఆరోగ్య పర్యవేక్షకులు భోగ్యం వెంకటేశ్వర్లు, చెన్నయ్య, అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలని నిరసన



తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 3: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట మంగళవారం ఏపీటీఎఫ్ నాయకులు నినాదాలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు యూనియన్ నాయకులు మాట్లాడారు. సెప్టెంబరు 1వ తేదీ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చీకటిరోజు అన్నారు. సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ పెన్షన్ విధానాలను రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే 117 జీవోను వెంటనే ఉపసంహరించుకోవడంతో పాటు ఐఆర్‌ను ప్రకటించి పీఆర్సీ కమిటీని నియమించాలన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారు జహీర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు మండల ఏపీటీఎఫ్ నాయకులు షబ్బీర్, ఓబులేసు, షేక్‌ఎండీ ఖాజా, గౌస్, జిలానీ, మాధవరాజు, ఖాజాపీర్ మార్కేండేయులు, ఖాజాఅహ్మద్, నరసింహులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశుభ్రత..

మరుగుదొడ్ల నిర్వహణ బాధ్యతలపై అవగాహన



సీతారామపురం : సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో మస్తాన్‌వలి

సంగం, ఆగస్టు 3: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్డీ అప్పాజీ ఆధ్వర్యంలో ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లకు మంగళవారం పాఠశాలల మరుగుదొడ్ల ఫొటోల అప్‌లోడ్‌పై ఎంఈవో -1,2లు జానకీరాం,మల్లయ్యలు అవగాహన కల్పించారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు వారానికి రెండురోజులు పాఠశాల మరుగుదొడ్ల పరిశుభ్రతను పరిశీలించి ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లు పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఉదయగిరి రూరల్: ప్రభుత్వ పాఠశాలలో డొక్కా సీతమ్మ బడి భోజనం, మరుగుదొడ్ల నిర్వహణపై పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు పరిశీలించి యాప్‌లో ఫొటోలను అప్‌లోడ్ చేయాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ, ఎంఈవో-2 శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ప్రధానోపాధ్యాయులు, ఎస్‌ఎంసీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ఎడ్యుకేషన్, వెల్ఫేర్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. విద్యార్హతతో సంబంధం లేకుండా యువతీ, యువకులు తమ వయసును బట్టి 10వ తరగతి, ఇంటర్ పరీక్షలు రాయవచ్చన్నారు.

మర్రిపాడు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో విద్యాకమిటీ చైర్మన్, హెచ్‌ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్లకు ఎంఈఓ-1 జ్యోతి, -2 ధనలక్ష్మీలు సూచనలిచ్చారు. ప్రతి సోమ, గురువారాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్లు, బుధ, శుక్రవారాల్లో ఎస్‌ఎంసీ సభ్యులు మరుగుదొడ్ల ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. ఈవోపీఆర్డీ మస్తాన్‌ఖాన్, రిసోర్స్‌పర్సన్ రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

సీతారామపురం: స్థానిక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం, టాయిలెట్ మెయింటేనెన్స్‌లపై హెచ్‌ఎంలు, సచివాలయ సంక్షేమ సహాయకులు, ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లకు మండల విద్యాశాఖ అధికారి షేక్ మస్తాన్‌వలి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భార్గవి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంఎస్‌లు శ్రీనివాసులు, కొండయ్య పాల్గొన్నారు.

చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి



ఆత్మకూరు: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ నారాయణమ్మ

ఆత్మకూరు, సెప్టెంబరు 3: అంగన్‌వాడీకేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం తప్పని సరిగా అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నారాయణమ్మ తెలిపారు. మంగళవారం కరటంపాడు పంచాయతీలోని శ్రీనివాసపురం అంగన్‌వాడీకేంద్రంలో పౌష్టికాహారవారోత్సవాల సదస్సు నిర్వహించారు. కిషోరబాలికలకు సైతం పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. పాలు, గుడ్లు, బాలామృతం, బాల సంజీవనిలు ఉపయోగపడే పౌష్టికాహారమని వివరించారు. సర్పంచ్ రేవతి, హెచ్‌ఎం కొండారెడ్డి పాల్గొన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): నర్రవాడ సెక్టార్ పరిధిలోని వడ్డిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ షాను పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పుట్టినబిడ్డకు అరగంటలోపు ముర్రుపాలు తాపించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శివకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు సుహాసిని, శ్రీలక్ష్మి, ఆయాలు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలపై విజిలెన్స్ తనిఖీలు



కలువాయిలో వివరాలు సేకరిస్తున్న విజిలెన్స్ అధికారి వెంకటరెడ్డి

కలువాయి, సెప్టెంబరు 3: జగనన్న లేఅవుట్లలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై మంగళవారం విజిలెన్స్ అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. చెల్లించిన బిల్లులకు సంబంధించి, ఆన్‌లైన్‌లో ఉన్న సమాచారం ప్రకారం ఇంటి నిర్మాణం ఉందా.. లేదా ఉంటే ఏ దశలో ఉందో వారు వివరాలు సేకరించారు. మండలంలోని 16లేఅవుట్లలో 726 ఇళ్ల నిర్మాణం చేపట్టగా వాటిలో కాంట్రాక్టర్ 424, లబ్ధిదారులు 302 ఇళ్లు నిర్మించుకున్నారు. ప్రతి ఇంటి నిర్మాణంను పరిశీలించారు. వీటిపై సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు ఇస్తామని విజిలెన్స్ అధికారి వెంకటరెడ్డి తెలిపారు. వారి వెంట గృహనిర్మాణశాఖ ఆత్మకూరు డీఈ ముక్తార్ భాషా, కలువాయి ఇన్‌చార్జి ఏఈ మహేష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ ప్రవళిక, నాగరాజు ఉన్నారు.

ఏటి కాలువలో జమ్ము తొలగించండి



ఆత్మకూరు చెరువు కెనాల్‌ను పరిశీలనకు వచ్చిన రైతుసంఘం నాయకులు

ఆత్మకూరు, సెప్టెంబరు 3: స్థానిక చెరువుకు నీటిని సరఫరా చేసే ఏటి కాలువ మరమ్మతులు చేపట్టి, ఏపుగా పెరిగిన జమ్మును తొలిగించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లక్కు కృష్ణప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం చెరువు కెనాల్‌ను ఆయన స్థానిక రైతులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. గొల్లపల్లి వద్ద నుంచి బొగ్గేరు వాగు వరకు ఉన్న ఈ కాలువ అధ్వానంగా ఉండటంతో రైతులకు సాగునీరు అం దడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగేళ్ల నుంచి మరమ్మతులు చేపట్టకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఇరిగేషన్ అధికా రులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం ఆత్మకూరు మండల అధ్యక్షుడు పాపిశెట్టి కృష్ణమోహన్ పాల్గొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

కావలిలో క్షీణిస్తున్న

పారిశుధ్యం

● అధికారుల పర్యవేక్షణ కరువు



కోర్టు వెనుకవీధిలో చెల్లా చెదురుగా చెత్తా చెదారం

కావలి, సెప్టెంబరు 3: కావలి పట్టణంలో మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో పారిశుధ్యం క్షీణిస్తోంది. మున్సిపల్ పారిశుధ్య కార్మికులను లెక్కకుమించి మస్టర్లలో చూపిస్తున్నారే కానీ, విధుల్లోకి వచ్చేసరికి వారు కనిపించడం లేదు. దీనితో పారిశుధ్యం నిర్వహణ అధ్వానంగా మారింది. మున్సిపల్ కార్యాలయానికి సమీపంలో ఉన్న కోర్టు వెనుకవీధిలో ఊడ్చకపోవడంతో చెత్తచెదారం రోడ్డంతా చెల్లా చెదురుగా పడి ఉంది. అసలే వైరల్ జ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్న తరుణంలో పారిశుధ్యం క్షీణిస్తే రోగాలు మరింత ప్రబలే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి వెంటనే పారిశుధ్య నిర్వహణ మెరుగుదలకు చర్యలు చేపట్టాలి.

ఆశా కార్యకర్తల సేవలు భేష్



గుడ్లూరు : మాట్లాడుతున్న డాక్టర్ మారుతీరావు

గుడ్లూరు, సెప్టెంబరు 3: వైద్యశాఖలో ఆశా కార్యాకర్తలు ప్రజలకు అందిస్తున్న సేవలు మరువలేనివని డాక్టర్ మారుతీరావు అన్నారు. ఆశా డే సందర్భంగా మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆశా కార్యకర్తలు ఇంటింటి తిరిగి సర్వే చేసి ఈ పాటికే జ్వరాలు భారిన పడిన వారిని గుర్తించి వారికి ఇంటి దగ్గరే మందులు ఇవ్వాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో భాస్కరరావు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు సోకకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

బిట్రగుంట : వర్షాల కారణంగా వ్యాధులు సోకకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా నివారణ అధికారి హుసేనమ్మ అన్నారు. మంగళవారం బోగోలు మండలం కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కలతో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులు రాజశేఖర్, ప్రవీణ్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ ట్రేలలో నారు పెంపకంపై శిక్షణ



రైతులకు శిక్షణ ఇస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

కందుకూరు, సెప్టెంబరు 3: ప్లాస్టిక్ ట్రేలలో కూరగాయలు, పూలనారు పెంపకంపై స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులు, మహిళా రైతులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ప్లాస్టిక్ ట్రేలలో కోకోపిట్ నింపడంతో పాటు నారుకు తెగుళ్ల సోకకుండా ట్రైకోడెర్మావిరిడి, సూడోమోనాస్ కలిపే విధానాన్ని, పురుగుల నియంత్రణను, పోషకాల యాజమాన్యంపై ప్రయోగాత్మకంగా చేయించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టరు జి.ప్రసాద్‌బాబు మాట్లాడుతూ ట్రేలలో నారుపెంచటం ద్వారా మొక్కలు ధృడంగా ఉండి పొలంలో నాటినప్పుడు త్వరగా నిలదొక్కుకుని రోగాలను తట్టుకుని అధిక దిగుబడినిస్తాయని తెలిపారు. కూరగాయలు, మిరప, పూలు లాంటి పంటలు సాగుచేసే రైతులు ఇంటివద్దనే నారు పెంచుకుని నాణ్యమైన నారును నాటుకోవటం ద్వారా ఖర్చు తగ్గించుకుని అధిక ఆదాయం పొందవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా కేవీకే దత్తత గ్రామాలైన పలుకూరు, పోకూరు, శాఖవరం రైతులకు మినుములో పల్లాకు తెగులును తట్టుకునే పాలిష్‌రకం అయిన ఎల్‌బీజీ 904 రకం విత్తనాన్ని ప్రదర్శనా క్షేత్రాల కింద ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టరు మయాంక్, డాక్టరు వెంకటేష్, డాక్టరు జ్యోతి, డాక్టరు నిహారిక, వివేక్, డాక్టరు శ్రీరంగ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు జీతాలు పెంచాలి

● సీఐటీయూ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ వద్ద ధర్నా



సీహెచ్‌వోకు వినతిపత్రం ఇస్తున్న ఆశా వర్కర్లు

లింగసముద్రం, సెప్టెంబరు 3 : ఆశా వర్కర్లకు జీతాలు పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పీహెచ్‌సీ ఎదుట ఆశా వర్కర్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఫిబ్రవరి 9వ తేదీన ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తామని గెజిట్లో పొందుపరిచిందని కానీ జీవోలు ఇవ్వలేదన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవులు ఇవ్వాలని, రూ.10 లక్షల గ్రూపు ఇన్సూరెన్స్ ఇవ్వాలని, పదవీ విరమణ వయస్సు 62కు పెంచి, 5 లక్షలు బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. అనంతరం వారు సీహెచ్‌వో జి.శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు.

పోషక విలువలు ఉన్న పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న సునీత

వలేటివారిపాలెం, సెప్టెంబరు 3 : గర్భిణులు, బాలింతలు పోషక విలువలు కలిగిన పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. మండలంలోని చెర్లోపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం 7వ రాష్ట్రీయ పోషణ్ మాస్ కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజూ తీసుకునే ఆహారంలో తృణధాన్యాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్, ఏఎన్‌ఎంలు రమాదేవి, వెంకటేశ్వరమ్మ, హైమావతి, అంగన్‌వాడీ కార్యకర్త సరళ పాల్గొన్నారు.

డీఎం చానల్ మరమ్మతులు పూర్తి



కాలువ వద్ద ఇసుక బస్తాలు వేస్తున్న కూలీలు

బిట్రగుంట, సెప్టెంబరు 3: బోగోలు మండలంలోని కడనూతల, కోవూరుపల్లి చెరువులు ఎండుతుండటంతో కావలి ఎమ్మెల్యే దుగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు మండల టీడీపీ నేతలు గత వారం రోజులుగా చేపట్టిన డీఎం చానల్ కాలువ తాత్కాలిక మరమ్మతు పనులు మంగళవారం పూర్తయ్యాయి. నాగులవరం నుంచి దెబ్బతిన్న కాలువ, కలుజు, తూములకు ఇసుక బస్తాలు వేసి నీరు వృథా కాకుండా కట్టుదిట్టం చేశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నిర్లక్ష్యంగా వదిలేసిన షటర్లు పూర్తిగా దెబ్బతినడంతో ప్రస్తుతానికి ఇసుక బస్తాలతో వాటికి అడ్డుకట్ట వేశారు. కావలి కాలువ నుంచి ఎస్వీపీఎం ద్వారా డీఎం చానల్ కాలువకు అనుసంధానం చేసి తాళ్లూరు మీదుగా సోమశిల జలాలను కడనూతల, కోవూరుపల్లి చెరువులకు అందించే విధంగా పనులు చేశారు. బుధవారం ఈ కాలువకు సోమశిల జలాలు విడుదల చేయవచ్చని తెలిసింది.

పరిశుభ్రతను పాటించండి

లింగసముద్రం, సెప్టెంబరు 3 : పాఠశాలల్లో పరిశుభ్రతను పాటించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు చెప్పారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంఈవో-2 శివకుమార్ అధ్యక్షతన పాఠశాలల్లో ఎస్‌ఎంసీ చైర్మన్లు, కాంప్లెక్స్ చైర్మన్లు, హెచ్‌ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ పాఠశాలల్లో మరుగుదొడ్లు ప్రతి సోమవారం వెల్ఫేర్ అసిస్టెంట్లు, ప్రతి గురువారం ఎస్‌ఎంసీ కమిటీ ఫొటోలు తీసి పంపించాలన్నారు. అలాగే కుకింగ్ ఏజెన్సీల వారు వంట గదులను శుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థులు చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కొని భోజనం చేయాలన్నారు.

మరుగుదొడ్ల నిర్వహణపై అవగాహన

కొండాపురం : ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణపై సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్లకు మండల విద్యావనరుల కేంద్రంలో మంగళవారం ఎంఈవో-1 కే.రవికుమార్, ఎంఈవో-2 ఆనందరావులు అవగాహన కల్పించారు. గతంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుండగా కూటమి ప్రభుత్వం ఆ బాధ్యతలను వారి నుంచి తొలగించి పాఠశాల యాజమాన్య కమిటీకి, స్థానిక సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లకు అప్పగించారన్నారు. పాఠశాల యాజమాన్య కమిటీ బుధ, శుక్రవారాలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు సోమ, గురువారాలలో మరుగుదొడ్ల నిర్వహణను కేటాయించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.బ్రహ్మయ్య, మండల పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఎస్‌ఎంసీ చైర్మన్లు పాల్గొన్నారు.

అర్చకుల జీతాల పెంపు హర్షణీయం



మాట్లాడుతున్న ఆదిశైవ అర్చకులు

కావలి, సెప్టెంబరు 3: అర్చకుల జీతాలను రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేల పెంచటం హర్షణీయమని అర్చక సంఘం నాయకులు తెలిపారు. కావలి పాతూరు శివాలయం వద్ద మంగళవారం కావలి డివిజన్ అర్చక సంఘం నాయకుల సమావేశమై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డీడీఎన్ అర్చకుల జీతాలను 5 నుంచి 10 వేల రూపాయలకు, ఎండోమెంట్ దేవాలయాల అర్చకులకు రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పెంచినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా ఆదిశైవ బ్రాహ్మణ అర్చకసంఘం అధ్యక్షుడు కేకే శేషగిరి రావు, ప్రధానకార్యదర్శి గుడ్లూరు ఫణి కుమార్ శర్మ, కోశాధికారి ముదివర్తి రవికాంత్ శర్మ, నేతలు ఎన్.సుబ్బయ్య శాస్త్రి, శశిధర్‌గురుకుల్, శివకుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

కావలిటౌన్, సెప్టెంబరు 3: ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు మంగళవారం కళాశాలలో రక్తదానం చేశారు. ప్రభుత్వ ఏరియా వైద్యశాల రక్తనిధి సిబ్బంది రక్తం సేకరించారు. రక్తదాతలను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శేషయ్య, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మధుకర్, ఏవో రామకృష్ణ, ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు చవల రామకృష్ణ, ఆత్మకూరి లక్ష్మి, పబ్బా సాయి, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు

అనుమతి తప్పనిసరి : సీఐ

కావలి రూరల్, సెప్టెంబరు 3: వినాయక చవితి ఉత్సవాలకు పోలీసుల అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలని కావలి 1వ పట్టణ సీఐ ఫిరోజ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినాయకుడి విగ్రహం పెట్టదలచిన వారు అనుమతి కొరకు ఆన్‌లైన్‌ల్ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసిన వారికి స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ఎంత చలానా కట్టాలన్నది వారి రిజిస్టర్ మొబైల్ నెంబరుకు పేమెంట్ ఐడీ వస్తుందని పేర్కొన్నారు. అనంతరం మీ సేవకు వెళ్లి చలానా కట్టిన తరువాత అనుమతి ఇస్తామని పేర్కొన్నారు.

మృతుడి కుటుంబానికి

ఆర్థిక సహాయం

కందుకూరు, సెప్టెంబరు 3: కందుకూరులో సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో మృతి చెందిన ఇందూరి సాయి కుటుంబ సభ్యులకు టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు రూ.15వేల ఆర్థిక సహాయం అందజేశారు. మంగళవారం ఆయన సాయి మృతదేహాన్ని సందర్శించి కుటుంబసభ్యులను ఓదార్చారు.

గిరిజన కాలనీలో నీటి కష్టాలు

బిట్రగుంట, సెప్టెంబరు 3: బోగోలు మండలం బిట్రగుంట పంచాయతీ కొండబిట్రగుంట గిరిజనకాలనీలో 10 రోజులుగా తాగునీరు లేక తీవ్ర అవస్థలు పడుతున్నామని గిరిజన మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకుల ద్వారా సరఫరా చేస్తున్న నీరు గిరిజనకాలనీ వాసులకు అందచేయడం లేదని అన్నారు. మండుటెండలో కూలీనాలికి వెళ్లి వచ్చి గుక్కెడు నీరు లేక ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు. కాలనీలో ఏర్పాటు చేసి ఉన్న ట్యాంకుకు పంపింగ్ చేసే బావిలో నీరు ఎండిపోవడం వలన తాగునీటి కష్టాలు పడుతున్నామని వారు తెలిపారు. అధికారులు స్పందించి తాగునీటి ఇక్కట్లు తీర్చాలని వారు కోరుతున్నారు.



కొండబిట్రగుంట గిరిజనకాలనీలో నిరుపయోగంగా ఉన్న ట్యాంకు